సూర్య
18 వ వసంతంలోకి ...
visit us @ http://epaper.suryaa.com

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...

☞ APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

సంపుటి 18 | సంచిక 47
ఆదివారం | 8 డిసెంబర్ 2024 | హైదరాబాద్
| పేజీలు 8+8 | వెల: రూ. 8.00
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, మార్గశిర మాసం సప్తమి ఉ.7.30 వరకు, అష్టమి తె.4.36, వర్జ్యం రా.8.34 నుంచి 10.04 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.4.24 నుంచి 5.12 వరకు

## తెలంగాణకు మరో
# మణిహారం

- యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేసిన సీఎం రేవంత్ రెడ్డి!
- ప్రాజెక్ట్ పురోగతి సాధించడం పట్ల సర్వత్రా అభినందనలు
- రాష్ట్రానికి మరిన్ని విద్యుత్ వెలుగులు విరజిమ్మటం షురూ

తెలంగాణ సిగలో మరో మణిహారం చేరింది. విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ తో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను సీఎం రేవంత్ రెడ్డి జాతికి అంకితం చేశారు.


3 లో

## కాంగ్రెస్ బిఆర్ఎస్
# కవల పిల్లలు


3 లో

- కవులు కళాకారులు మేధావులు బిజెపికి మద్దతు ఇవ్వాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక సంవత్సరాల పాటు పోరాటం చేశాం. అనేక బలిదానాలు జరిగాయి.

## తెలంగాణలో మరోసారి
# భూకంపం


3 లో

**భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3 నమోదైంది**

తెలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈనెల 4వ తేదీన తెలంగాణలోని ములుగుతో పాటుహైదరాబాద్, తదితర జిల్లాల్లోని భూకంపం సంభవించింది. ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 5.3గా నమోదైందని గుర్తించారు.

## ఆరునెలల్లో టీచర్
# పోస్టుల భర్తీ!

- కాకినాడలో అక్రమ రేషన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్న మంత్రులు
- కమిటీ నివేదిక కోసం వేచి చూద్దామన్న చంద్రబాబు
- 10 అంశాలపై కేబినేట్ చర్చ
- డిసెంబర్ 15న ఆత్మార్పణ దినం పాటించాలని నిర్ణయం

అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాం. ఆరునెలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిచేస్తాం. ఈ క్రమంలో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించబోతున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్ చూస్తుంటే సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టుగా ఉందని మంత్రి లోకేష్ అన్నారు.


2 లో

# మహిళలను కోటీశ్వరులను చేస్తాం


3 లో

**ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు : డిప్యూటీ సీఎం భట్టి**

మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

# సీఎంకు యనమల లేఖ

- కాకినాడ పోర్టు ద్వారా లబ్ధి పొందిన వాటిల్లో దివీస్ ఒకటి
- కాకినాడ సెజ్ అసలు బాధితులైన పేద బీసీ రైతులు, మత్స్యకారులకు న్యాయం చేయాలి
- కేవీ రావు తక్కువ ధరకు భూములు కొని అధిక ధరకు అమ్ముకున్నారు


2 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## తెలంగాణలో కమల
# వికాసం ఖాయం

- కాంగ్రెస్ టిఆర్ఎస్ ఒకటే
- అబద్ధాలతో అధికారంలోకి
- ఆరు గ్యారెంటీలు అమలు ఏమయ్యాయి
- కళ్యాణ లక్ష్మి, తులం బంగారం ఏమైంది
- రేవంత్ సర్కార్ ఏడాదిగా ప్రజలను మోసం చేస్తుంది
- రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారు
- కాంగ్రెస్ ప్రభుత్వం పై బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా ఫైర్

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. శనివారం సరూర్‌నగర్‌లోని బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో జేపీ నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అబద్ధాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.



3 లో

## ముమ్మరంగా కొనసాగుతున్న
# విజయోత్సవాలు


3 లో

- నక్లెస్ రాడ్‌లో బిర్యాని, చాట్, ఐస్ క్రీం, తెలంగాణా, నార్తన్ తదితర వెరైటీ ఫుడ్ స్టాళ్ళ ఏర్పాటు
- నగర వాసులను అలరించిన వందేమాతరం శ్రీనివాస్ మ్యూజికల్ నైట్

## లోకేష్ నిర్ణయం
# విద్యార్థులకు వరం


2 లో

- విద్యార్థులు, వారి తల్లితండ్రులతో సమావేశాలు మంచి ఫలితాలను ఇస్తాయి
- జగన్ రెడ్డి విద్యా వ్యవస్థను నాశనం చేశాడు

జిల్లాలోని చెరుకుపల్లి హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉల్లాసవంతమైన వాతావరణంలో చదువుకునేందుకు అవకాశం కల్పించేందుకే పీటీఎంలు నిర్వహిస్తున్నామన్నారు.

## అంతా ఇంతే!




ఇప్పుడు నోట్లతో వేస్తున్నారు సార్

# హోంశాఖ ఇవ్వాల్సిందే

- మహాయుతి ప్రభుత్వానికి శిండే డిమాండ్
- వివరాలు తెలిపిన శివసేన ఎమ్మెల్యే భరత్ గోగవాలే
- 11-16 మధ్య కేబినెట్ విస్తరణ ఖాయమని వెల్లడి
- 16న శాసనసభ శీతాకాల సమావేశాలు జరిగే అవకాశం

మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన అనంతరం రాష్ట్ర ముఖ్య మంత్రిగా భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్లకు హోదా కల్పించారు. కాగా మహాయుతిలో మంత్రిత్వశాఖల కేటాయింపులపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.


5 లో

## బంగ్లాదేశ్‌లో మరో
# ఇస్కాన్ కేంద్రంపై దాడి


5 లో

**దాడి చేసి, నిప్పు పెట్టిన దుండగులు- ఇస్కాన్ కోల్‌కతా ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ ప్రకటన**

ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు నేపథ్యంలో బంగ్లాదేశ్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్న విషయం తెలిసిందే. కాగా శనివారం తెల్లవారుజామున బంగ్లాదేశ్‌లోని మరో ఇస్కాన్ కేంద్రంపై దుండగులు దాడి చేసినట్లు ఇస్కాన్ కోల్‌కతా ప్రతినిధి రాధారామణ్ దాస్ తెలిపారు.

## ఇండియా కూటమి
# చీఫ్‌గా మమత..?


5 లో

**విపక్షంలో భిన్న స్వరాలు**

కంద్రంలోని ఎన్డీయే కూటమి ఓటమే లక్ష్యంగా ఏర్పడిన 'ఇండియా' కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. అవకాశం వస్తే ప్రతిపక్ష కూటమికి తాను సమర్థంగా నేతృత్వం వహిస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించడంపై విపక్షంలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
8 డిసెంబర్ 2024



# ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏపీ బ్యూరో, ప్రతినిధి: కోడూరు ప్రభుత్వ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. కల్నల్ డిఎస్ రాజు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ పోడూరు గవర్నమెంట్ స్కూల్ ఆవరణలో మెగా పేరెంట్ మీటింగ్ నిర్వహించబడింది ఈ కార్యక్రమానికి రుదర్రాజు వరాల రాజు, పోడూరి కృష్ణమూర్తి డాక్టర్ ఎస్సె సుధాకర్ రెడ్డి మన గ్రామ ప్రెసిడెంట్ సువర్ణ రాజు జయ రామ కృష్ణ లతో పాటు పూర్వ విద్యార్థులుగా బొక్క గణపతి, బోరాబత్తుల లావణ్య, ఎస్ఎంసి కమిటీ మెంబర్స్ అలాగే ప్రధాన ఉపాధ్యాయులు అధ్యాపకులు ఈ ఫంక్షన్ ని విజయవంతం చేసిన పిల్లల తల్లిదండ్రులు స్కూల్ పిల్లలకి ప్రతి ఒక్కరికి మా ఎస్ఎంసి కమిటీ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ పట్నాల నాగేశ్వరరావు, వైస్ చైర్మన్ పమ్మి మని, కో అప్టేట్ మెంబర్స్ షేక్ బావాజీ, కుసుమ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పీపీఏ సీఈవో అభ్యంతరం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యే గడువును తరచూ మార్చేస్తే ఎలాగని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్ జైన్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 2021 నుంచి వరుసగా తేదీలు మార్చుతూ వస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టును 2026 మార్చినాటికి పూర్తి చేస్తామని రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చినందునే.. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి డెడ్‌లైన్‌ను అధికారికంగా ప్రకటించామని తెలిపారు. ఇప్పుడు కీలకమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యాం (ఈసీఆర్ఎఫ్)ను 2027 డిసెంబరుకు పూర్తి చేస్తామంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. పోలవరం పనులపై శుక్రవారం ఢిల్లీ నుంచి అతుల్ జైన్ రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## మెగా డీఎస్సీ ద్వారా

# ఆరునెలల్లో టీచర్ పోస్టుల భర్తీ!

- కాకినాడలో అక్రమ రేషన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్న మంత్రులు
- కమిటీ నివేదిక కోసం వేచి చూద్దామన్న చంద్రబాబు
- 10 అంశాలపై కేబినేట్ చర్చ
- డిసెంబర్ 15న ఆత్మార్పణ దినం పాటించాలని నిర్ణయం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అధికారంలోకి వచ్చిన వెంటనే 16,347పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాం. ఆరునెలల్లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తిచేస్తాం. ఈ క్రమంలో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించబోతున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు.

మెగా పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్ చూస్తుంటే సంక్రాంతి పండుగ ముందే వచ్చినట్టుగా ఉందని మంత్రి లోకేష్ అన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ లో భాగంగా బాపట్ల మున్సిపల్ హైస్కూలులో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... మిమ్మల్ని చూసిన తరువాత నాకు నా స్కూల్ డేస్ గుర్తు వచ్చాయి. చిన్నప్పుడు మా స్కూల్ లో పేరెంట్స్ – టీచర్స్ మీటింగ్ జరిగితే మా అమ్మ వచ్చేవారు. మా నాన్న అప్పటికే రాష్ట్రానికి టీచర్ కాబట్టి నా స్కూల్ కి రావడానికి ఆయనకి టైం ఉండేది కాదు. పిల్లల్లో నాకు దేవుడు కనిపిస్తాడు. పిల్లలంతా నా కొడుకు దేవాన్ష్ లాగే అనిపిస్తారు. మా వాడు హైదరాబాద్ నేను అమరావతి. వాడితో ఆడుకోవడం కూడా కుదరడం లేదు. ఎంత ఒత్తిడిలో ఉన్నా...ఎన్ని పనులు ఉన్నా..పిల్లలు కనిపిస్తే నేను ఆగిపోతాను. సరదాగా కాసేపు వాళ్లతో ఆడుకుంటాను. పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యాశాఖ మంత్రిని కావడం నా అదృష్టం. ఏ వృత్తి చేపట్టిన వారైనా వారిని తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే. ఉపాధ్యాయులంటే నాకు ఎంతో గౌరవం. జాతిపిత మహాత్మాగాంధీజీ చెప్పినట్లు విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుందని మా ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు గారి విజనరీ ఆలోచనలతో మన విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శంగా ఉండేలా ఆంధ్ర మోడల్ తీసుకొస్తున్నాం.

**మెగా పిటిఎం ద్వారా బలమైన బంధం**

మెగా పిటిఎం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు మధ్య బంధం బలపడుతుంది. ఒక వ్యవస్థ బాగుపడాలంటే...అందులో అందరూ భాగస్వామ్యం అవ్వాలి. విద్యా వ్యవస్థ ఆదర్శంగా ఉండాలంటే సమాజ భాగస్వామ్యం తప్పనిసరి అని సీఎం గారు చెప్పారు. ముఖ్యమంత్రి గారి ఆదేశాలు, సూచనలతో బడి భవిష్యత్తు కోసం చదివే పిల్లలు–వారి తల్లిదండ్రులు, చదువు చెప్పే ఉపాధ్యాయులు–గైడ్ చేసే హెడ్మాస్టర్లు, పాఠశాల యాజమాన్య కమిటీలు, దాతలు, పూర్వ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. ఇదే లక్ష్యంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం రాష్ట్రమంతా ఒకేరోజున పండగ వాతావరణంలో నిర్వహించుకుంటున్నాం.

**మన పేరెంట్ టీచర్ మీటింగ్ ఒక చరిత్ర**

పేరెంట్–టీచర్ మీటింగులు అన్ని చోట్లా జరుగుతాయి..కానీ మన పేరెంట్–టీచర్ మీటింగ్ ఒక రికార్డు. రాష్ట్రమంతా ఒకేసారి వేలాది స్కూళ్లలో, లక్షలాది విద్యార్థులు–టీచర్లు–తల్లిదండ్రులు సమావేశం కావడం ఒక చరిత్ర. రాష్ట్ర వ్యాప్తంగా 45094 ప్రభుత్వ, మరియు ఎయిడెడ్ పాఠశాలలలో ఒకేసారి నిర్వహిస్తున్నాం. ఇందులో 35 లక్షల మంది విద్యార్థులు, 71 లక్షల తల్లిదండ్రులు, 1,88,266 మంది ఉపాధ్యాయులు, 50 వేలకు పైగా ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారు. ఈ సమావేశాలతో బడితో తల్లితండ్రులకు ఆత్మీయ బంధంఏర్పడుతుంది.విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుంది. ఈ సమావేశం ద్వారా పాఠశాలల సమస్యలు తెలుస్తాయి. పిల్లలు ఎలా చదువుతున్నారో తల్లిదండ్రులకు తెలుస్తుంది. విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు అందిస్తున్నాం.హెల్త్ డిపార్ట్మెంట్ సహకారంతో కొన్ని టెస్టులు చేసి ఆ రిపోర్ట్ కూడా పొందుపరుస్తున్నాం. దీని వల్ల విద్యార్థుల ఆరోగ్యం ఎలా ఉందో తల్లిదండ్రులు, టీచర్లకు తెలుస్తుంది. పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవడానికి దీనిద్వారా ఆస్కారమేర్పడుతుంది. విద్యా వ్యవస్థను గాడిలో పెట్టే బాధ్యతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు నాపై పెట్టారు. విద్యాశాఖ అంటే ఎన్నో సవాళ్లతో కూడినది...అయినా ఛాలెంజ్ గా తీసుకుని నిర్వహిస్తున్నాను. విద్యా వ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచాలని కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నాం.

**మా ప్రభుత్వానికి రంగుల పిచ్చి లేదు**

చంద్రబాబు గారి నేతృత్వంలోని మా ప్రభుత్వానికి రంగులు – ఫోటోల పిచ్చి లేదు. నేను మంత్రి అయిన వెంటనే ఫోటోలు, రంగులు తీసేయమని ఆదేశాలు జారీ చేసాను. స్కూల్స్ లో ఒక్క జాబ్ మేళాలు తప్ప ఇతర ఏ కార్యక్రమాలు నిర్వహించకూడదు అని నిర్ణయం తీసుకున్నాను. రాజకీయ కార్యక్రమాలకు పిల్లల్ని తీసుకొని వెళ్ళకూడదు అని స్ట్రిక్ట్ గా చెప్పాను. విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేలా మన చరిత్రను, సంస్కృతిని గుర్తుచేసేలా విద్యారంగంలో విశేష సేవలందించిన వ్యక్తుల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టి వాటిని సమర్థవంతంగా ముందుకు తీసుకెళుతున్నాం. 1 నుండి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ. 944 కోట్లతో ఉచితంగాసర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర స్టూడెంట్ కిట్స్‌పంపిణీ చేశాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంక్రింద లక్షలాది మంది విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన, ఆయా ప్రాంతాల ఆహార అలవాట్లను గౌరవిస్తూ పౌష్టికాహారం అందిస్తున్నాం.

**బోధనేతర పనిభారాన్ని తొలగించాం**

ఉపాధ్యాయులు చదువు మాత్రమే చెప్పాలి, మరుగుదొడ్లు, భోజనం ఫోటోలు తీయడం వారి బాధ్యత కాదు. దీనిపై ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. రాష్ట్రంలో టీచర్లు చదువు మాత్రమే చెప్పాలి ఇతర పనులు, పనికిమాలిన యాప్స్ తొలగించాలని నిర్ణయం తీసుకున్నాం. ఆంధ్రా మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రూపొందిస్తున్నాం. పిల్లలను పిడుగులను తయారు చేసే బాధ్యత నాది. కేజీ టూ పీజీ కరికులం మారుస్తున్నాం. చదువు తో పాటు నైతిక విలువలు చాలా ముఖ్యం. మహిళల్ని గౌరవించడం చిన్న వయస్సు నుండే నేర్పించాలి. ముందు సమాజం లో మార్పు రావాలి. కొందరు చేతికి గాజులు వేసుకున్నావా అని మాట్లాడతారు, అమ్మాయి లా ఏడవకు అని అంటారు. ఈ మాటలు విన్న ప్రతి సారి నాకు బాధ వేస్తుంది. ఇవన్నీ పోవాలి. ఆడ, మగ సమానం అనే భావన కలిగేలా ప్రత్యేక పాఠ్యాంశాలు తీసుకొస్తాం. పిల్లల్లో నైతిక విలువలు పెంచడం కోసం నైతిక విలువల సలహాదారునిగా చాగంటి కోటేశ్వర రావు గారిని నియమించాం. వారి డైరెక్షన్ లో ప్రత్యేక పాఠాలు రూపొందిస్తాం. లైఫ్ స్కిల్స్, సివిక్ అవేర్నెస్, ఆటలు, పాటలు నేర్పించాలని నిర్ణయం తీసుకున్నాం.

**మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి**

విద్యార్థులు చదువుతో పాటు అన్ని విషయాల్లో నంబర్ 1 గా ఉండాలి అనేది మన లక్ష్యం. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకోవడానికి డిజిటల్ ల్యాబ్స్ ఏర్పాటు చెయ్యబోతున్నాం. స్టూడెంట్స్ లెర్నింగ్ అవుట్ కమ్స్ పై దృష్టిపెట్టాం. అన్ని స్కూల్స్ లో టేబుల్స్ , లీక్ ప్రూఫ్ క్లాస్ రూమ్స్, త్రాగునీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం లా అర్ధరాత్రి ఆత్మలతో మాట్లాడి నిర్ణయాలు తీసుకోము. విద్యాశాఖలో ఏ నిర్ణయం తీసుకున్నా.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంఘాలతో చర్చించి మాత్రమే తీసుకుంటున్నాం. డ్రగ్స్, గంజాయి కి ఎడిక్ట్ అవ్వడం వలన ఒక తరం నాశనం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే డ్రగ్స్ పై యుద్ధం చేస్తున్నాం. ఇందుకోసం క్యాబినెట్ సబ్ కమిటీ, టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. ప్రైవేట్ స్కూల్స్ టీచర్ల కంటే ప్రభుత్వ పాఠశాలల టీచర్లు బాగా పాఠాలు చెబుతారు. ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావడం నా బాధ్యత. సిఎం ఆదేశాల మేరకు రాబోయే నాలుగేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తాం, ప్రభుత్వ పాఠశాలలను 4స్టార్ రేటింగ్ కు తీసుకురావాలన్న సిఎం ఆదేశాలను పాటిస్తాం. మిషన్ మోడ్ లో కార్యక్రమం చేపడుతున్నాం. ఇందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం అవసరం. విద్యార్థులు, తల్లితండ్రులు, టీచర్లే నా బ్రాండ్ అంబాసిడర్లు. దాతలు, పూర్వవిద్యార్థులు, స్వచ్ఛందసంస్థలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అంతా కలిసి పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సహకరించాల్సిందిగా మంత్రి నారా లోకేష్ కోరారు.

## అప్పుడు కర్మభూమి

# ఇప్పుడు జన్మభూమిలో సేవ

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : అప్పుడు కర్మభూమిలో సేవ చేసే అవకాశం లభిస్తే, ఇప్పుడు జన్మభూమిలో సేవ చేసుకునే అదృష్టం దక్కిందని పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యుడు మాజీ కేంద్రమంత్రి యలమంచిలి సత్యనారాయణ(సుజనా)చౌదరి తెలిపారు. ప్రజలకు మేలు చేసే సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పుడైనా ఎక్కడైనా సేవా కార్యక్రమాలు చేయడంలో సుజనా ఫౌండేషన్ ముందు ఉంటుందని తెలిపారు. సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమ నియోజకవర్గంలో మరో సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. విజయవాడలోని విద్యాధారపురంలో ఉన్న ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రతిరోజు అందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే తొలి సారిగా కళాశాల విద్యార్థులకు బోజన పథకం ప్రవేశ పెట్టిన సుజనా చౌదరి శనివారం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సుజనా ఫౌండేషన్ ద్వారా సొంత నిధులతో విద్యాన్నపూర్ణ పేరిట భోజన పథకం అమలు చేసేందుకు నిర్ణయించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాట్లు తెలిపారు. ఉర్దూ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎన్నికల సమయంలో సమస్యలు గుర్తించినట్లు చెప్పినా ఆయన గతంలో కాలేజీలో పిట్టగోడలు ఉండేవని, విద్యార్థులు పడిపోతారేమోనని భయం తనకు వేసిందన్నారు. వెంటనే సుజనా ఫౌండేషన్ ద్వారా పిట్టగోడలు నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు.

## దేశవ్యాప్తంగా కొత్తగా

# 85 కేంద్రీయ విద్యాలయాలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : దేశవ్యాప్తంగా కొత్తగా 85 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాంతోపాటు 28 నవోదయ విద్యాలయాలను ప్రారంభించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు శుక్రవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఏపీలో 8 కేంద్రీయ విద్యాలయాలు, తెలంగాణలో 7 నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. అనకాపల్లి, చిత్తూరు జిల్లా వలసపల్లె, సత్యసాయి జిల్లా పాలసముద్రం, గుంటూరు జిల్లా తాళ్లపల్లె, పల్నాడు జిల్లా రొంపిచెర్ల, కృష్ణా జిల్లా నందిగామ, ఏలూరు జిల్లా నూజివీడు, నంద్యాల జిల్లా డోన్ లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు.

తెలంగాణకు 7 నవోదయ విద్యాలయాలు. తెలంగాణలో జగిత్యాల, నిజామాబాద్, కొత్తగూడెం, మేడ్చల్, మహబూబ్ నగర్, సంగారెడ్డి, సూర్యాపేటలో నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు.

# ప్రభుత్వ బడుల్లో చదుకోవాలి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విద్యార్థి ప్రభుత్వ బడుల్లోనే చదువుకోవాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం సాలూరు నియోజకవర్గం మక్కువ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను కూడా ప్రభుత్వ బడిలోనే చేసువుకున్నానని అన్నారు. సొంత ఊరులోనే చదువుకోవడం ఆనందంగా ఉందన్నారు. పాఠశాలకు అవసరమైన ఆర్ఓ ప్లాంట్, కాంపౌండ్ వాల్, భవన మరమ్మతులు చేయాలని విద్యార్దులు తెలిపగా విడతల వారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మన స్కూల్ కి కావాల్సిన అన్ని సౌకర్యాలను సమాకురుస్తానని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో ర్యాంకుల శాతం పెరిగిందని, ఇక్కడ చదివిన విద్యార్దులు డాక్టర్, ఇంజనీర్,ఎన్ఐటి, ఐఐటిలలో సీట్లు సాధిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ బడుల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు విశాలంగా ఉంటాయని,ప్రవేట్ బడుల్లో ఇరుకు గదుల్లో చదువుకోవాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు నాలెడ్జ్ ఎక్కువగా ఉంటుందని అన్నారు. పిల్లలు ఉపాధ్యాయులు చెప్పేది శ్రద్ధగా వినాలని సూచించారు. కష్టపడి చదివే కన్నా ఇష్టపడి చదవాలని పిల్లలతో అన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు పరీక్షలలో తక్కువ మార్కులు వచ్చాయని తిట్టవద్దని, వచ్చే పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా ఇంటి వద్ద కూడా చదివించాలని కోరారు. పిల్లలు చదివే విదానాన్ని తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. పిల్లలను టివిలకు, మొబైల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లలు చదువుకునే సమయంలో తల్లిదండ్రులు టివి లను చూడటం మానేయాలని తెలిపారు. పిల్లల బంగారు భవిష్యత్ కోసం ఒక అడుగు ముందుకు వేయాలని మంత్రి పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాదికారి ఎన్. తిరుపతి నాయుడు మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఆత్మీయ కలయిక సమావేశం జరువుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని 1550 ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమం జరుగుతోందన్నారు. కార్యక్రమ ముఖ్యోద్దేశం పాఠశాలలో వసతులు సమాకూర్చడంతో పాటు విద్యాప్రమాణాల స్థాయి ఎలా ఉందొ ప్రతీ విద్యార్ది తల్లిదండ్రులు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. గతంలో లేని విధంగా విద్యార్థులకు హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందజేశామని, ఆ కార్డులలో విద్యార్థి చదువుకు సంబందించిన అంశాలు, ఆరోగ్య అంశాలను పొందుపరచామని తెలిపారు. పాఠశాల వయసు నుండే చెడు అలవాట్లకు వెళ్లకుండా ఉండేందుకు ప్రభుత్వం, పోలీస్ శాఖ సంయుక్తంగా సంకల్పం కార్యక్రమం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. పిల్లలకు సెల్ ఫోన్ లు ఇవ్వడం తగ్గించాలని కోరారు. పిల్లలు క్రమశిక్షణ, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల తల్లితండ్రులు వేసిన రంగవల్లులు పరిశీలించి విజేతలను ఎంపిక చేసిన మంత్రి సంధ్యారాణి గారు. ముందుగా రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మాత్యులు గుమ్మిడి సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తనకు చదువు చెప్పిన గురువు రెడ్డి సత్య మూర్తి వేదిక పైకి రాగానే గురువు కాళ్ళకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్న మంత్రి విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి టగ్ ఆఫ్ వార్ వంటి క్రీడలు ఆడి అందరినీ ఆకట్టుకున్నారు విద్యార్దులు వేసిన థింసా, పిరమిడ్, వంటి సాంస్కృతిక కార్యక్రమాలను మంత్రి తిలకించారు. సమావేశం అనంతరం పాఠశాల కమిటీ అధ్యక్షులు కొన ఈశ్వరరావు విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించడంతో కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి యం. శ్రీనివాసరావు, తాహసీల్దార్ షేక్ ఇబ్రహీం, యంపిడిఓ స్వరూపా రాణి, యంఇఓ లు సత్యనారాయణ, శ్యామ్ సుందర్, పాఠశాల ప్రాధానోపాధ్యాలు హేమలత, టిడిపి మండల ఇంచార్జ్ వేణు, జనసేన పార్టీ ఇంచార్జ్ రుషి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# లోకేష్ నిర్ణయం విద్యార్థులకు వరం

- విద్యార్థులు, వారి తల్లితండ్రులతో సమావేశాలు మంచి ఫలితాలను ఇస్తాయి.
- జగన్ రెడ్డి విద్యా వ్యవస్థను నాశనం చేశాడు.

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జిల్లాలోని చెరుకుపల్లి హైస్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉల్లాసవంతమైన వాతావరణంలో చదువుకునేందుకు అవకాశం కల్పించేందుకే పీటీఎంలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో జగన్ రెడ్డి విద్యా వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. ఇంగ్లీష్ మీడియం పేరుతో విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావడంతో పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాలు తగ్గిపోయాయన్నారు. హెచ్ఆర్డీ శాఖామంత్రిగా నారా లోకేష్ గత వైసీపీ పాలనలో గాడి తప్పిన విద్యా వ్యవస్థను సరిదిద్దుతున్నారని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున పేరెంట్ టీచర్స్ మీటింగులు నిర్వహించడం ప్రపంచంలోనే పెద్ద చరిత్ర అని చెప్పుకొచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.

అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా యస్ రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల–ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. పాఠశాలకు వచ్చిన అనితకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించిన హోంమంత్రి అని.. ఆపై విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లారు. కాగా.. జిల్లాలో పర్యటించిన హోంమంత్రి ముందుకు యస్ రాయవరంలో వెంకటేశ్వరస్వామి వారిని దర్శించికుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యస్ రాయవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని హోంమంత్రి అనిత ప్రారంభించారు. నంద్యాలలోని బనగానపల్లి మండలం కొత్తపేటలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమిష్టి కృషితోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు అని ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ వెల్లడించారు.

# విద్యారంగానికి ఏడాదికి రూ.14 వేల కోట్లు ఖర్చు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విద్యారంగానికి ప్రభుత్వం ఏటా రూ.14 వేల కోట్లు వెచ్చిస్తోందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పార్వతీపురం మండలం నర్సీపురంలో జరిగిన మెగా పేరెంట్స్ డే సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం పునరంకితం కావాలని అన్నారు. బంగారు భవిష్యత్తును అందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తోందన్నారు. పిల్లలను చదువు వైపు ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయని, ఉపాధ్యా యులు అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. దేశానికి ఉపయోగపడే పౌరులను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. భావి పౌరుల కోసం ప్రభుత్వం తాగునీరు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంతో పాటు మరెన్నో అందజేస్తోందని తెలిపారు. గత ఐదేళ్లలో భారత ప్రభుత్వం ప్రతి ఏటా రూ.4 వేల కోట్లు విడుదల చేస్తున్నప్పటికీ, పాఠశాలల్లో మౌలిక వసతులు కనిపించడం లేదన్నారు. రాబోయే 30 ఏళ్ల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు విజన్ డాక్యుమెంట్లను 2047లో సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో పెట్టుబడులను ఆకర్షించడమే ముఖ్యమంత్రి లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. తల్లిదం డ్రులు పిల్లలను క్రీడలు, పర్యావరణాభివృద్ధికి అనుమతించాలని, డ్రగ్స్‌కు గురికా కుండా చూడాలని మంత్రి కోరారు. పంచా యతీల పని వ్యవస్థ, పౌరుని బాధ్యతలను పెంపొందించడానికి పాఠశాలల్లో బాల పంచాయితీ భావనను అనుసరించాలని ఆయన సూచించారు. పిల్లలు తిరిగి ఇవ్వడం విధానం గురించి ఆలోచించాలని ఆయన ఉద్బోధించారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం తల్లిదండ్రుల సమావేశం అనే మంచి భావనకు శ్రీకారం చుట్టిందన్నారు. విద్యార్థులు లక్ష్యాలను సాధించాలని కలలు కంటూ స్థానికంగా విద్యాసంస్థలను నెలకొల్పేందుకు ముందుకు రావాలన్నారు. ఒంటరి తల్లిదండ్రుల పిల్లల చదువుకు ఆసరాగా నిలిచేందుకు ముందుకు వచ్చాడు. జిల్లా కలెక్టర్ ఎ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 1590 పాఠశాలలు ఉన్నాయని, 95 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. జిల్లాలో మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమాన్ని చేపట్టి పిల్లలకు సలహాలు, మార్గనిర్దేశం చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో నెగ్గిన విద్యార్థులకు సత్కారాలు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మధ్యాహ్నం భోజనాన్ని పాఠశాలలో స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి ఎస్ఎస్ శోబిక, పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీవాస్తవ, సబ్ డివిజనల్ పోలీసు అధికారి అంకితా సురానా, అధికారులు, అనధికారులు పాల్గొన్నారు.

# సీఎంకు యనమల లేఖ

- కాకినాడ పోర్టు ద్వారా లబ్ది పొందిన వాటిల్లో దివీస్ ఒకటి
- కాకినాడ సెజ్ అసలు బాధితులైన పేద బీసీ రైతులు, మత్స్యకారులకు న్యాయం చేయాలి
- కేవీ రావు తక్కువ ధరకు భూములు కొని అధిక ధరకు అమ్ముకున్నారు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి మాజీ మంత్రి, పార్టీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. కాకినాడ సెజ్‌కు సంబంధించి లేఖలో పేర్కొన్నారు. కాకినాడ పోర్టు ద్వారా లబ్ది పొందిన వాటిల్లో దివీస్ కూడా ఒకటి అని తెలిపారు. భూమి కోల్పోవడంతో పాటు సముద్ర, వాయు కాలుష్యం వల్ల పేదలైన బీసీ వర్గాలు ఈ వ్యవహారంలో తీవ్రంగా నష్టపోయారన్నారు. కాకినాడ సెజ్ అసలు బాధితులైన పేద బీసీ రైతులు, మత్స్యకారులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తెలుగుదేశం సీనియర్ నేత యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. కాకినాడ సెజ్‌లో చిన్న రైతులు, మత్స్యకారుల నుంచి భూములు కొనుగోలు చేసిన పెద్ద కంపెనీలు లాభపడ్డాయన్నారు. కేవీరావు తక్కువ ధరకు సెజ్‌లో భూమిని కొని జీఎంఆర్ సంస్థలకు వందల కోట్లకు అమ్మారన్నారు. తరువాత జగన్ బినామీ అయిన అరబిందో కు దాదాపు 4 వేల కోట్లకు అమ్మారని వెల్లడించారు. కాకినాడ పోర్టు ద్వారా లబ్ది పొందిన వాటిల్లో దివీస్ కూడా ఒకటి అని తెలిపారు. భూమి కోల్పోవడంతో పాటు సముద్ర, వాయు కాలుష్యం వల్ల పేదలైన బీసీ వర్గాలు ఈ వ్యవహారంలో తీవ్రంగా నష్టపోయారన్నారు. సెజ్ కోసం దాదాపు 10 వేల ఎకరాలు కోల్పోయిన వీరి సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. కోన అటవీ వాసులకు అనుకూలంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించకుంటే, వారి వాస్తవ సమస్యల కోసం నిరంతరం పోరాడాల్సి వస్తుందన్నారు. వీరి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే చెన్నైలోని ఎన్జీటీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఏపీ పొల్యూషన్ బోర్డులకు లేఖలు రాసినట్లు తెలిపారు.

పేదల నుంచి తక్కువ ధరకు బలవంతంగా భూములు కొనుగోలు చేసింది వైసీపీ నేతలే అని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలోని మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు.. రైతులను మోసం చేసిన వారిలో ఉన్నారన్నారు. సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వం ఆ భూములను అసలు రైతులకు ఇప్పించాలన్నారు. కబ్జా భూములు కావడంతో అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయవచ్చని చెప్పారు. భూ అసలు లబ్ధిదారులైన రైతుల తీవ్ర ఆందోళనలు జరగకుండా ఉండేందుకు పొల్యూషన్ బోర్డు సభ్యుడు, ఎన్‌జీటీ ప్రతినిధి, ఇతర విభాగ అధికారులతో ఓ కమిటీని ఏర్పాటు సమస్య పరిష్కరించాలని కోరారు. కేవీ రావు కూడా ఎస్ఈజెడ్ నష్టపోయిన వారికి న్యాయం చేయలేదన్నారు. బిగ్ షాట్‌లను బారి నుంచి బీసీ రైతులు, మత్స్యకారులను రక్షించాలని.. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం ఉంటుందని యనమల రామకృష్ణుడు లేఖలో పేర్కొన్నారు.



## కాంగ్రెస్ బిఆర్ఎస్ కవల పిల్లలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి కాంగ్రెస్ బిఆర్ఎస్ కవల పిల్లలని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక సంవత్సరాల పాటు పోరాటం చేశాం. అనేక బలిదానాలు జరిగాయి. సకలజనుల సమ్మె చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నాం అని అన్నారు.గతంలో కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ కుటుంబ, అహంకార, అవినీతి పాలనతో తెలంగాణ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేసింది.ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు 100 రోజుల్లో గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు. 420 హామీలు గుప్పించారు.
ఏడాది పాలన గడిచినా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా సరిగ్గా అమలు చేయలేదు.బీఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ప్రజలకు మేలు జరగలేదు. ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు. కాంగ్రెస్ పాలనలోనూ అదే జరుగుతోంది. బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీలవి ఒకే డీఎన్ఏ. ఒకే తానుముక్కలు. పాలనలో కేసీఆర్-రేవంత్ రెడ్డి కవలపిల్లల్లాంటివారు. బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ పార్టీ అవినీతి, కుటుంబ, అహంకార పాలన కొనసాగిస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. డిసెంబరు 9న సోనియా జన్మదినం సందర్భంగా రైతు రుణమాఫీ చేస్తామని, పెన్షన్లు 2000 రూపాయల నుంచి 4 వేలు చేస్తామని హామీలిచ్చారు. రుణమాఫీ పూర్తిచేయలేదు. పెన్షన్లు రూ. 4 వేలకు పెంచలేదు. ఒక కొత్త పెన్షన్ కూడా ఇయ్యలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 12 నెలలు గడిచింది. ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇయ్యలేదు. తెలంగాణ ఉద్యమకారులు, మేధావులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో నిజమైన మార్పు రావాలంటే భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. గత పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి 8 సీట్లు ఇస్తే.. బిజెపి కి 8 సీట్లలో గెలిపించారు.రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ మరింత బలపడాలని ప్రజలు కోరుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలపై ఉద్యమ శంఖారావం పూరించాం. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించి బిజెపి జెండా ఎగురవేసేంత వరకు పోరాటం చేస్తాం.తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి కోసం, ఉద్యమకారుల ఆకాంక్షల కోసం బిజెపి అంకితభావంతో పనిచేస్తుంది. తెలంగాణ కవులు, కళాకారులు, మేధావులు, ప్రజలు.. అందరూ భారతీయ జనతా పార్టీకి అండగా నిలబడాలని కోరారు.

# తెలంగాణకు మరో మణిహారం..



- యాదాద్రి పవర్ ప్లాంట్‌ను జాతికి అంకితం చేసిన సీఎం రేవంత్
- ప్రాజెక్ట్ పురోగతి సాధించడం పట్ల సర్వత్ర అభినందనలు
- రాష్ట్రానికి మరిన్ని విద్యుత్ వెలుగులు విరజిమ్మటం షురూ

ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో : తెలంగాణ సిగలో మరో మణిహారం చేరింది. విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ తో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను సీఎం రేవంత్ రెడ్డి జాతికి అంకితం చేశారు. కేసీఆర్ కలల ప్రాజెక్టు.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపమైంది.

రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసి మిగులు విద్యుత్తు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యాదాద్రి థర్మల్ ప్లాంట్ () నిర్మాణాన్ని చేపట్టింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మాణాన్ని తెలంగాణ జెన్కో చేపట్టింది. నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఐదు యూనిట్లకు జూన్ 26, 2017న కేంద్ర పర్యావరణ శాఖ అనుమతినిచ్చింది. అదే ఏడాది అక్టోబరు 17న రూ.29 వేల కోట్ల అంచనా వ్యయంతో జెన్ కో నిర్మాణం ప్రారంభించి.. భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్ఇఎల్)కు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. పవర్ ప్లాంట్ నిర్మాణం అనుకున్న గడువుకన్నా రెండేళ్లు అదనం కావడంతో అంచనా వ్యయం రూ.29,500 కోట్ల నుంచి రూ.34,500 కోట్లకు పెరిగింది.

**ప్లాంట్ నిర్మాణంలో ఎన్నో సవాళ్లు..**

యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగాయి. ఒకవైపు పనులు ఊపందుకుంటున్న సమయంలోనే ప్లాంట్ నిర్మాణంలో ప్రభుత్వం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. ఈ ప్లాంట్ లో 50 శాతం దేశీయ బొగ్గును, 50 శాతం విదేశీ బొగ్గును వినియోగించాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా నూటికి నూరు శాతం దేశీయ బొగ్గును వినియోగించనుందని రెండు స్వచ్ఛంద సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ()కి ఫిర్యాదు చేశాయి. దీంతో ఎన్జీటి యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో దశ నిర్మాణానికి పర్యావరణ అనుమతులను నిలిపివేసింది. మరోవైపు కరోనా మహమ్మారితో 10వేల మంది కార్మికులు స్వరాష్ట్రాలకు వెళ్లిపోవడంతో రెండేళ్ల పాటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి.

**ప్లాంట్ పనుల స్పీడ్ను పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం:**

రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ సర్కార్ ఏర్పడింది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఎన్జీటీ క్లియరెన్స్ను తీసుకోవడంతోపాటు, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యుత్ ఉత్పత్తికి ఏటా అవసరమయ్యే 3.5 టీఎంసీల నీటిని టెయిల్ పాండ్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ నుంచి 22 కిలోమీటర్ల పైపు లైన్ తో చేపట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. బొగ్గు రవాణా కోసం సమీపంలో జాన్పహాడ్ రైల్వే క్రాసింగ్ నుంచి ప్లాంట్ వరకు రూ.100 కోట్ల వ్యయంతో 8కి.మీ రైల్వేలైన్ నిర్మించారు. ప్రతిరోజు ప్లాంట్కు అవసరమయ్యే 50 వేల టన్నుల బొగ్గును రామగుండం నుంచి కు తరలిస్తున్నారు. దక్షిణాదిలో ప్రభుత్వ రంగంలో అతిపెద్దదైన యాదాద్రి పవర్ ప్లాంట్.. మొదటి, రెండో యూనిట్ల నుంచి పూర్తి స్థాయిలో కాంతులు విరజిమ్మనుంది. ప్లాంట్ పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సందర్శించి అధికారులతో ఎప్పటికప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షిస్తున్నారు.

**మొదటి, రెండవ యూనిట్లు ట్రయల్ రన్ సక్సెస్..**

దశలవారీగా విద్యుత్ ఉత్పత్తిని చేపట్టి గ్రిడ్కు అనుసంధానం చేసేందుకు మార్గం సుగమమైంది. హైటెన్షన్ విద్యుత్లైన్ టవర్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ నెలాఖరులోగా మూడు యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే లక్ష్యంతో అధికారులు పనులను యుద్ధ ప్రాతిపదికన పురోగతి సాధిస్తున్నారు. అందులో భాగంగానే మొదటి, రెండవ యూనిట్లలోని యాక్సిలరీ బాయిలరల్లో లైట్ అప్ చేసి ట్రయల్ రన్ నిర్వహించారు. బొగ్గుకు ప్రత్యామ్నాయంగా ఇంధనాన్ని ఉపయోగించి అధికారులు ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించారు. 275 మీటర్ల ఎత్తు గల చిమ్నీ ద్వారా వాయువును విడుదల చేస్తూ ట్రయల్ రన్ లో భాగంగా ప్రాథమిక పరీక్షలను పూర్తి చేశారు. ప్లాంట్ నిర్మాణ పనులు 90 శాతం పూర్తి కావడంతో విద్యుత్ కాంతులు పంచేందుకు పవర్ ప్లాంట్ సిద్ధమైంది. ప్లాంటుకు అనుసంధానంగా రైల్వేలైన్లు పూర్తికావడంతో ప్లాంట్ ద్వారా తెలంగాణకు 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

**నిర్వాసితులకు పునరావాసం.. ఉపాధి..**

దామరచర్ల మండలంలోని వీర్లపాలెం, కొత్తపల్లి, మోదుగుల తండా, కపూర్ తండాల్లో మొత్తం 4,569 ఎకరాలను జెన్కో సేకరించింది. ఇందులో ప్రైవేటు వ్యక్తులకు చెందిన 1,012 ఎకరాలున్నాయి.రెండు తండాల్లోని 173 కుటుంబాలను పూర్తిగా ఖాళీ చేయించింది. మరోచోట ఇళ్లు కట్టించి ఇచ్చింది. భూ నిర్వాసితులకు కేసీఆర్ సర్కార్ ఎకరానికి రూ.6 లక్షలు పరిహారం అందించింది. అయితే పరిహారంతో పాటు దశలవారీగా యువతకు ఉపాధి అవకాశాలు ప్రభుత్వం కల్పిస్తోంది.

**ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్..**

తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (జెన్కో) రూ.928.52 కోట్ల అంచనాతో ఈ ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ను నిర్మించనుంది. మొత్తం 3,52,771.02 చ.మీ.ల విస్తీర్ణంలో ఈ టౌన్షిప్ నిర్మాణం జరగనుండగా, 2,21,903.67 చ.మీ.ల విస్తీర్ణంలో నివాస గృహ సముదాయాలతో టౌన్ షిప్ ను నిర్మించనున్నారు. పవర్ ప్లాంట్ పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించే 2025 మార్చి నాటికి వేల సంఖ్యలో ఇంజనీరింగ్ అధికారులు, ఉద్యోగులు, ఇతర కార్మికులు ఇక్కడ రాత్రింబవళ్లు పనిచేయనున్నారు. వీరంతా తప్పనిసరిగా స్థానికంగా నివాసం ఉండాల్సి రావడంతో టౌన్షిప్ను జెన్కో నిర్మిస్తోంది. 11 అంతస్తుల బహుళ అంతస్తుల సముదాయాల్లో ఈ క్వార్టర్లు ఉండనున్నాయి.



**రాష్ట్రానికి ఆశాదీపమైన కేసీఆర్ కలల ప్రాజెక్టు.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్..**

కేసీఆర్ కలల ప్రాజెక్టు.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపం కానుంది. వివిధ రాష్ట్రాలు, సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగియనున్న నేపథ్యంలో ఆ లోటును భర్తీ చేసేందుకు యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ఆశాదీపం కానున్నది. రాష్ట్ర విద్యుత్తు అవసరాల కోసం ఇతర రాష్ట్రాల పవర్ ప్లాంట్లతో చేసుకున్న కీలక ఒప్పందాల గడువు రెండు, మూడేండ్లలోనే ముగియనుంది. 2024- 25లో 2,284 మెగావాట్లు, 2025 -26లో 2,400 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు ముగుస్తాయి. వీటితో పాటు మరో 2,899 మెగావాట్ల సోలార్ విద్యుత్తు వినియోగ ఒప్పందాలు సైతం ముగియనున్నాయి. రామగుండం యూనిట్ -7కు చెందిన 87.76 మెగావాట్ల ఒప్పందం 2026 -27లో ముగియనుంది. 2028-29లో 583.9 మెగావాట్ల సింహాద్రి ఒకటో దశ ఒప్పందం ముగియనుండగా, అదే ఏడాదిలో వెయ్యి మెగావాట్ల ఛత్తీస్గఢ్ ఒప్పందం గడు వు సైతం 2028-29లో ముగియనుంది. ఈ నేపథ్యంలో యాదాద్రి పవర్ ప్లాంట్ రాష్ట్రాన్ని విద్యుత్తు కష్టాల నుంచి బయట పడేయనుంది.

**2025 మార్చినాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి..**

ప్లాంట్ లోని 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన రెండవ యూనిట్ ను సీఎం రేవంత్ రెడ్డి విద్యుత్ గ్రిడ్ కు అనుసంధానం చేసి ప్లాంటును జాతికి అంకితం చేశారు. ఈ నెలాఖరు నాటికి మూడు యూనిట్ల ద్వారా 2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తిని ప్రారంభించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మిగతా రెండు యూనిట్లను మార్చి 2025 నాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసి రాష్ట్రానికి వెలుగులు విరజిమ్మేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి ఉన్నారు.

మొత్తానికి యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ పురోగతి సాధించడం పట్ల సర్వత్ర అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు వీరజిమ్ముతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విద్యుత్.. రాష్ట్రానికి మరో మణిహారంగా నిలుస్తోంది.

## మహిళలను కోటీశ్వరులను చేస్తాం

### ఐదేళ్లలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణాలు : డిప్యూటీ సీఎం భట్టి



తెలంగాణ బ్యూరోప్రతినిధిః మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల మేర రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక భవన్లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించిన భట్టి.. అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భవిష్యత్తులో అవి మధ్య, భారీ పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల్లోనూ వ్యాపారదక్షత ఉంటుందని.. పర్యావరణానికి హాని కలగకుండా చేసే ఉత్పత్తులను ఆదరించాలని భట్టి కోరారు.

### ముమ్మరంగా కొనసాగుతున్న

## ప్రభుత్వ విజయోత్సవాలు

- నక్లెస్ రోడ్‌లో బిర్యాని, చాట్, ఐస్ క్రీం, తెలంగాణ, నార్తన్ తదితర వెరైటీ ఫుడ్ స్టాళ్ళ ఏర్పాటు
- నగర వాసులను అలరించిన వందేమాతరం శ్రీనివాస్ మ్యూజికల్ నైట్

హైదరాబాద్ : ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా పి.వి .నర్సింహ రావు మార్గ్ లో నరగంలోని ప్రముఖ హుటల్స్ ఫుడ్ స్టాళ్లను నేటి నుండి 9 తేది వరకు ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ , మొగలాయి, తెలంగాణా, ఆంధ్ర వంటకాలతో పాటు బేకరి ఐటమ్స్ ఐస్ క్రిమ్ పార్లర్లను విజయోత్సవాల్లో పాల్గోనే సందర్శకుల సౌకర్యార్థం వందకు పైగా ఫుడ్ స్టాళ్లను అందుబాటులోకి తెచ్చారు.

నిన్న సాయంత్రం జరిగిన వందేమాతరం శ్రీనివాస్ మ్యూజికల్ నైట్ నిర్వహణకు ఐమాక్స్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో విశాలమైన స్టేజి నిర్మాణం, సౌండ్ సిస్టం తోపాటు సందర్శకులకు సీటింగ్ ఏర్పాట్లు ఎంతో ఘనంగా జరగాయి. ఈ ఏర్పాట్లను సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ డా. హరీష్‌తోపాటు శాఖ ఉన్నతాధికారులు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. అంతర్జాతీయంగా పేరొందిన హైద్రాబాదీ దమ్ బిర్యాని తోపాటు మొగలాయి, జఫ్రాని బిర్యాని పర్యాటకులకు అందించేందుకు ప్రముఖ హోటళ్ళయిన ప్యారెడైజ్, పిస్తా హౌజ్, షాదాబ్, బడేమియా కబాబ్ తదితర హోటళ్లు తమ బ్రాండ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటితోపాటు తెలంగాణ వంటకాలుగా పేరొందిన పాలమార్ గ్రీల్, తెలంగాణ విందు, అంకాపూర్ నాటు కోడి చికెను, ఫుడ్ జాయింట్స్‌ను అందుబాటులోకి తెచ్చారు. నిలోఫర్ కెఫె, బ్రౌన్ బేర్ బేకరిలు ప్రాంకిల్ మ్యాగి హాట్నాట్ కాంటినెంటల్ కాఫీ, ప్రాంకి అండ్ రోల్స్, మొమోస్ అండ్ ఫ్రైస్‌తో పాటు గోకుల చాట్ కూడ తమ సంస్థ ఫుడ్ స్టాళ్లను ఏర్పాటు చేసారు. వీటితో పాటు ఆగ్రా చాట్ అండ్ స్వీట్స్ ఐస్ కంనప్షన్ ఎం బైట్స్, స్టాళ్లను ఏర్పాటు చేసారు.

స్త్రీ శక్తి క్యాంటిన్లను కూడ పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్నారు.

# తెలంగాణలో మరోసారి భూకంపం



### భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3 నమోదైంది

హైదరాబాద్ ః తెలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈనెల 4వ తేదీన తెలంగాణలోని ములుగుతో పాటుహైదరాబాద్, తదితర జిల్లాల్లోని భూకంపం సంభవించింది. ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 5.3గా నమోదైందని గుర్తించారు అధికారులు.

ఇదిలా ఉంటే తాజాగా శనివారం తెలంగాణలోని మహబూబ్నగర్లో మరోసారి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై తీవ్రత 3.0గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. భూకంపం సంభవించడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు.

4న వచ్చిన ములుగు జిల్లాలోని మేడారానికి ఉత్తర దిశలో భూకంప కేంద్రం నమోదైనట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. భూమి లోపల 40 కి.మీ. దూరంలో భూకంప కేంద్రం నమోదైనట్లు చెప్పారు.

భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3 నమోదైంది.

వరంగల్, హనుమకొండ, ఖమ్మం, భద్రాద్రి, హైదరాబాద్ సహా పలుచోట్ల భూమి కంపించింది. తెలంగాణలో 20ఏళ్లలో తొలిసారి భారీగా ప్రకంపనలు వచ్చాయన్నారు శాస్త్రవేత్తలు. భూమి పొరల మధ్య తేడాలుంటే భూకంపాలు వస్తాయన్నారు. గోదావరి బెల్ట్లో భూమి పొరల్లో చాలా తేడాలున్నాయని, అందుకే గోదావరి పరివాహకంలో పలుసార్లు ప్రకంపనలు సంభవించాయంటున్నారు ఎన్జీఆర్ఐ రిటైర్డ్ సైంటిస్ట్ శ్రీనగేష్ తెలిపారు.

## కేంద్రమంత్రికి అభినందలు



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారవు రామ్మోహన్ నాయుడు నలంద విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ రాజు అభినందన తెలిపారు. కేంద్ర మంత్రిగా గింజారవు రామ్మోహన్ నాయుడు కేంద్ర ప్రభుత్వం తరవున వారు చేస్తున్న పనితీరు అభివృద్ధి కార్యక్రమాలను నలంద ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ చైర్మన్ శ్రీనివాసులు ప్రశంసించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజారవు రామ్మోహన్ నాయుడుకు పూలమాల వేసేశాలో కప్పి ఘనంగా సత్కరించారు.

# నేడు బీఆర్ఎస్ నేతలతో కేసీఆర్ భేటీ

- అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ
- బీఆర్ఎస్ అత్యంత గడ్డుకాలాన్ని ఎదుర్కొంటుంది
- గత ఎన్నికల్లో మేము అధికారం మాత్రమే కోల్పోయాం
- కానీ నాయకులు, కార్యకర్తల్లో పోరాట పటిమ చావలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. నేడు ఆదివారం పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ సంయుక్త సమావేశం నిర్వహిస్తారని కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ప్రజా సమస్యలపై సభలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన చెప్పారు. ఆశావర్కర్ల సమస్యలపై సైతం అసెంబ్లీలో చర్చ లేవనెత్తుతామని ఆయన అన్నారు. కళాకారులు, పుస్తకాలు, వివిధ రూపాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పుట్టిన తర్వాత పార్టీ ఇప్పుడే అత్యంత గడ్డుకాలాన్ని ఎదుర్కొంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత ఎన్నికల్లో తాము అధికారం మాత్రమే కోల్పోయామని, కానీ నాయకులు, కార్యకర్తల్లో పోరాట పటిమ చావలేదని ఆయన చెప్పారు. గతేడాది తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో తాము ఊహించని ఫలితాలు వచ్చాయన్నారు కేటీఆర్. కాంగ్రెస్ అడ్డగోలు హామీల వల్లే తాము అధికారం కోల్పోయామని చెప్పారు. కేవలం నాలుగు లక్షల ఓట్లు మాత్రమే కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్కు తక్కువగా వచ్చాయన్నారు. కేసీఆర్ తొంటి ఎముక విరగటం, పార్లమెంట్ ఎన్నికల ముందు కవిత జైలుకు వెళ్లడంతో ఇబ్బందులు పడ్డామని చెప్పారు. పది మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడినా.. ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని అన్నారు. పోరాటాల నుంచే బీఆర్ఎస్ పుట్టుకొచ్చిందని ఆయన చెప్పారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణలో వ్యతిరేకత పెరిగిందని మాజీ మంత్రి కేటీఆర్ చెప్పారు. మూడు నాలుగేళ్ల తర్వాత వచ్చే వ్యతిరేకత ఏడాది లోపలే వచ్చిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కొంచెం కష్టపడితే అధికారం బీఆర్ఎస్దే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అధికారంలో ఉండి కూడా గాంధీ భవన్ బోసిపోతోందని మాజీ మంత్రి ఎద్దేవా చేశారు. కానీ తెలంగాణ భవన్ మాత్రం కళకళలాడుతోందని చెప్పారు. లగచర్ల బాధితులను త్వరలో బయటకు తీసుకొస్తామని కేటీఆర్ చెప్పారు. తాజా మాజీ సర్పంచ్లకు అండగా ఉంటామని ఆయన ఉద్ఘాటించారు. రానున్న పంచాయతీ ఎన్నికల లోపే బిల్లులు ఇప్పించాలని మాజీ సర్పంచ్లు కోరుతున్నారని చెప్పారు. వారి కోరిక మేరకు బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు

### ఇచ్చిన హామీలను అమలు చేయండి : తెలంగాణ లోక్‌దళ్

తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవాలను నిర్వహిస్తున్న పాలకులు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని భారత జాతీయ లోక్దళ్( ఓం ప్రకాష్ చౌతాలా) పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పుల్లూరి వెంకట రాజేశ్వర్ రావు డిమాండ్ చేశారు. అర్హులందరికీ రూ.500ల కే గ్యాస్ అందిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో విఫలం అయ్యిందన్నారు. మహిళలందరికీ రూ.2500 పెన్షన్ ఎక్కడ అని ప్రశ్నించారు. 200 యూనిట్ల విద్యుత్ అందించడంలో కూడా విఫలం అయ్యిందన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్ ప్రయాణంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు ఎప్పుడు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని పుల్లూరి వెంకట రాజేశ్వర్ రావు సూచించారు.

# మాట మార్చడమే మీ విధానమా?

- కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు



తెలంగాణ బ్యూరోప్రతినిధి: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఏమార్చడం, మోసం చేయడమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నాడు ఫార్మా సిటీ అన్నారు, నేడు మాట మార్చి పచ్చటి పొలాల్లో చిచ్చు బెడుతున్నారని విమర్శించారు. గిరిజనుల బిడ్డలను జైళ్ల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే ట్రిపుల్ ఆర్ రోడ్డు అలైన్మెంటును మారుస్తామన్నారని.. ఇప్పుడేమో మాట మార్చి, నిర్బంధాల మధ్య భూసేకరణ కొనసాగిస్తున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి.. మాట మార్చడమే మీ విధానమా? ప్రజలను మభ్య పెట్టడమే కాంగ్రెస్ పద్ధతా అని నిలదీశారు. హైదరాబాద్లోని ఆయన నివాసంలో ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు హరీశ్రావును కలిశారు. ఈ సందర్భంగాఆర్ఆర్ఆర్ విషయంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీని, ఎన్నికల తర్వాత మాట తప్పిన వైఖరిని ఆయనకు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు ఎవరూ తమ బాధను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన మాట తప్పి, నిబంధనలకు విరుద్ధంగా సర్వేలు నిర్వహిస్తున్నారని, భూసేకరణ పత్రాలపై బలవంతంగా సంతకాలు పెట్టిస్తున్నారని బాధను వెలిబుచ్చారు. భూసేకరణ చట్టం అమలు చేయకుండా, తక్కువ ధరకే భూములు లాక్కునే కుట్ర చేస్తున్నారని వివరించారు. తమ సమస్య పట్ల ప్రభుత్వాన్ని అసెంబ్లీలో నిలదీయాలని కోరారు. ఈ సందర్భంగా హరీశ్ రావు బాధితులకు ధైర్యం చెప్పారు. ఎన్నికల హామీలో చెప్పిన విధంగా కాంగ్రెస్ మాట నిలుపుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

అనంతరం హరీశ్రావు మాట్లాడుతూ.. ఉత్తర దిక్కు ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలను బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చేత హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దుర్మార్గం. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలో మీటర్లను పరిగణనలోకి తీసుకోవడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పట్టణం మధ్య నుంచి రోడ్డు వెళ్లడంతో మున్సిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతున్నది. బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోతున్నా ప్రభుత్వం కనికరించడం లేదు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184 కు పెంచడం వల్ల పేదల భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికిగాను నష్టపరిహారం కూడా తక్కువ చెల్లిస్తున్నారు. ఎంపీగా ఉన్నపుడు కోమటి రెడ్డి.. బాధితులతో కలిసి ఆర్ఆర్ఆర్ను మార్చాలని, రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంలోనూ అలైన్మెంట్ మార్చుతామని హామీలు ఇచ్చారు. కానీ, ఇప్పుడేమో అదే పోలీసు బలగాలతో, నిర్బంధంగా రోడ్డుకు 28 కిలోమీటర్ల పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంత పెట్టడం దుర్మార్గం. రైతులను కాదని సర్వేలు నిర్వహించడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం సిగ్గుచేటు అని విమర్శించారు. దక్షిణ దిక్కున 40 కిలోమీటర్లు పరిగణలోకి తీసుకున్నట్లుగానే, ఉత్తర భాగాన పరిగణలోకి తీసుకోవాలని రైతుల పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. లేదంటే భూములు కోల్పోతున్న రైతులకు సంతృప్తి కలిగేలా పరిహారం అందించి, వారి పూర్తి అంగీకారంతో భూ సేకరణ జరపాలని ఈ విషయంలో ప్రభుత్వం దిగిరాకుంటే బాధితుల పక్షాన బి ఆర్ ఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరిస్తున్నాం. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో బాధితుల గొంతును వినిపిస్తాం. ప్రభుత్వాన్ని నిలదీస్తాం. సమస్య పరిష్కరించే వరకు బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుంది


DBS

**వేలం ప్రకటన**

మా బ్యాంక్ యొక్క దిగువ పేర్కొన్న పర్సనల్ లోన్ కస్టమర్‌లు మేము పదేపదే రిమైండర్ చేసిన తర్వాత కూడా వారి లోన్ ఖాతాలను సెటిల్ చేయడంలో విఫలమయ్యారని మరియు అందువల్ల ఇది నాన్-పెర్ఫార్మింగ్ అసెట్ (NPA)గా వర్గీకరించబడిందని సమాచారం. అక్నాలెడ్జ్‌మెంట్ బకాయి, బకాయి ఉన్న మొత్తం మరియు ఎన్‌పిఎ తేదీని వివరించే రిజిస్టర్డ్ లెటర్‌లు ఇప్పటికే బ్యాంక్‌లో వారి రిజిస్టర్డ్ చిరునామాకు పంపబడ్డాయి.
16.12.2024న లేదా అంతకు ముందు పూర్తి లోన్ మొత్తం / మీరిన మొత్తం సెటిల్ చేయబడితే తప్ప, కస్టమర్ పర్సనల్ లోన్ సంబంధిత జ్యువెల్ లోన్ సెక్యూరిటీలు 16.12.2024 ఉదయం 11.00 గంటలకు లేదా బ్యాంకుకు అనుకూలమైన మరేదైనా తేదీకి వేలం ద్వారా విక్రయించబడతాయి. తదుపరి నోటీసు లేకుండా మరియు బ్యాంక్ ప్రాంగణంలో లేదా ఈ-వేలం ప్లాట్‌ఫారమ్‌లో బహిరంగ వేలం విక్రయం ద్వారా బ్యాంక్ యొక్క పూర్తి సంతృప్తి కోసం https://egold.auctiontiger.net

| Ref. No. | Customer Name | Branch Name | Gross weight | Net weight |
|---|---|---|---|---|
| U-13936699 | హనుమంతు అల్లిపూర్ | అల్వాల్, సికింద్రాబాద్ | 128.00 | 121.90 |
| U-14939546 | వి రవి చంద్ర | బోడుప్పల్ | 99.70 | 92.00 |
| U-46134398 | గోషిక ప్రవీణ్ కుమార్ | మల్కాజిగిరి, హైదరాబాద్ | 78.00 | 76.30 |
| U-46134404 | గోషిక ప్రవీణ్ కుమార్ | మల్కాజిగిరి, హైదరాబాద్ | 121.00 | 109.80 |

తేది : 05.12.2024
స్థలం : చెన్నై

అధీకృత అధికారి
డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్

* DBS బ్యాంక్ ఇండియా లిమిటెడ్ అనేది DBS బ్యాంక్ లిమిటెడ్ సింగపూర్ నుండి పూర్తి లైసెన్స్ క్రింద అనుబంధ సంస్థ

సూర్య
హైదరాబాద్
ఆదివారం
8 డిసెంబర్ 2024



# సంపాదకీయం

editpage@suryaa.com

## అసహనం అనర్ధదాయకం !

సహృదయుల్లో కనిపించే ప్రధాన సుగుణాల్లో సహనశీలత ఒకటి. అహింసకు ప్రతిరూపం సహన గుణమే. ఇతరులను సంస్కృతి, వారసత్వం, జీవనసరళి, వైవిధ్యత, ఆచారవ్యవహారాలు, భావప్రకటన స్వేచ్ఛలను గౌరవించడం, విభేధాలను సానుకూలతతో అంగీకరించడం, ప్రశంసించడం మన నిత్య జీవన విధానం కావాలి. విభేధాల్లో సహితం సామరస్యత ప్రదర్శించడమే సహన శీలతగా అర్ధం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా అనేక వైవిధ్యభరిత ఆచార వ్యవహారాలు, సంస్కృతులు, భాషలు, పద్దతులు, జాతులు, కళలు ఉన్నాయి. ఈ వైవిధ్యతలే మానవ జాతి ఎదుగుదలకు, అద్భుత ఆనందమయ అనుభవాలకు పునాదులు అవుతున్నాయి. భిన్నత్వంలో ఏకత్వ సాధన ద్వారా పరస్పర గౌరవం, సమాజాభివృద్ధి జరుగుతున్నాయి. ఇతరులు పాటించే ఆచారాలను, మత విశ్వాసాలను, కుల వారసత్వాలను గౌరవిస్తూ, సమన్వయ భావనలతో ముందుకు సాగడానికి సహనం అనే అద్భుత గుణం ఉపయుక్తం అవుతున్నది. సహనశీలత ద్వారా ఇతరుల మానవ హక్కులు, మౌళిక స్వేచ్ఛ పరిరక్షించబడతాయి. విశ్వ మానవాళి జీవన సరళి సహజంగానే వైవిధ్యభరితం, విలక్షణం. అయినప్పటికీ వారిని శాంతి సామరస్యాలతో కట్టి ఉంచేది దారమే సహన గుణ సంపద అని గమనించాలి. మానవ సమాజ ఏకీకరణకు, ప్రశాంత జీవన విధానాలు కొనసాగడానికి సహనం అనే గుణం ప్రధాన మైనదని అంగీకరించిన ఐరాస 1995 ఏడాదిని "అంతర్జాతీయ సహన సంవత్సరం (ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ టాలరెన్స్)"గా పాటించడం, దానికి కొనసాగింపుగా 1996 నుంచి 16 నవంబర్ రోజున "అంతర్జాతీయ సహన దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ టాలరెన్స్)"గా పాటించడం ఆనవాయితీగా మారింది. సహన భావన మన సంస్కృతి, వారసత్వం, ఆచారాల్లో దాగి ఉంది. అంతర్జాతీ య సహన దినం వేదికగా సహనశీలత ప్రాధాన్యాన్ని వివరించడం, అహింస ఆలోచనలను తట్టిలేపడం, ఓపికను ప్రదర్శించడం, సామాజిక సామరస్యతను పాటించడం, ఇతరుల అభిప్రాయాలు/జీవన విధానాలను గౌరవించడం, ప్రపంచ మానవాళిలో సోదర భావాన్ని జాగృత పరచడం, మానవ హక్కులను పరిరక్షించడం, సహనశీలత కేంద్రంగా చర్చలు/విద్యార్థులకు పోటీలు/సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం లాంటి పలు ఆలోచనలను కార్యరూపంలోకి తేవచ్చు. నేటి ప్రపంచంలో ఏ మూలన చూసిన అశాంతి, సంఘర్షనలు, తీవ్రవాద ధోరిణులు, ఉగ్రవాద రక్తపాతాలు, మత ఘర్షనల మం టలు, కులాల కుమ్ములాటలు, మానవ హక్కుల హననాలు, యుద్ధాలు, సం స్కృతిక విభేదాలు, వేర్పాటువాద హింసలు, ప్రాంతీయతత్వాలు కొనసాగుతూనే ఉన్నాయి. అసహనం రెక్కలు విచ్చుకొని పేట్రేగిపోతున్నది. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రపంచ మానవాళి శాంతి, సమన్వయం, సౌభ్రాతృత్వ బాటలో నడవడానికి సహనమనే ఏకైక సాధనం మాత్రమే అవసరమని ఐరాస భావిస్తున్నది. సహనగుణాలను పెంచడానికి ప్రపంచ దేశాలు కృషి చేయాలని, విద్యలో భాగంగా చిన్నతనం నుంచే సహన బీజాలను చిన్నారుల మనోఫలకాలపై నాటాలని, సమ్మిళిత అభివృద్ధి, అవకాశాలకు పెద్ద పీట వేయాలని అంతర్జాతీయ సహన దినం బోధిస్తున్నది. ఇతరుల ఆచారాలను పాటించకపోయినా వారి భావనలను గౌరవిస్తూ అంగీకరించడమే ప్రపంచ శాంతి స్థాపనకు పెట్టుబడి అని మరిచిపోరాదు.

అంగీకారం, సహనం, క్షమాగుణం, కరుణ, దయ, పరస్పర గౌరవాలు మానవ జీవితాన్ని సుసంపన్నం చేస్తాయని నమ్మడం మన కనీస కర్తవ్యం. అందరికీ జీవించే హక్కు సమానంగా ఉంది. పౌర సమాజం, వివిధ మానవ జాతులు తమ వైవిధ్యభరిత జీవన విధానాలను శాంతియుతంగా కొనసాగించడానికి ప్రతి ఒక్కరిలో సహనగుణం మెల్కొనాలి. విభేదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవడం, సమన్వయ భావనలను ప్రదర్శించడం, అందరూ ఒక్కటే అన్న ఆలోచనలకు పట్టాభిషేకాలు చేయడం, వివక్షను తరిమేయడం, ఇతరుల భావాలను గౌరవిస్తూ అంగీకరించడం, సంకుచిత ఆలోచనలను పాతరేయడం లాంటి సహజీవన పాఠాలను నేటి డిజిటల్ యుగపు నరులు వంటపట్టించుకొని రేపటి ఆనందమయ శాంతియుత సమాజ క్షేత్రంలో సహన బీజాలను నేడే నాటాలని ప్రపంచ పౌర సమాజం గుర్తుంచుకొని, ఆ భవ్యమైన – దివ్యమైన దారిలో నడవడానికి సంకోచించవద్దు.

సహనానికి సంకెళ్లు వేస్తే హింసాగ్ని రెచ్చిపోతుంది. అసహనం అంటరానిదని, పరస్పర గౌరవ భావనలను అలవాటు చేసుకోవాలని ఐరాస ఆశిస్తున్నది. అసహనాన్ని ఆమెడ దూరం తరిమి, అంగీకార ఆలోచనలను దరికి చేర్చుకొని రేపటి ప్రపంచ మానవాళికి సహనశీల శాంతియుత సహజీవన సూత్రాలను బోధిద్దాం, ఆచరణలో పెట్టే విధంగా అవిరళ కృషి చేద్దాం.

## మోడీ గారూ! ఏమి పాలనయ్యా నీది ?

ఒంగోలునుండి నెల్లూరుకు వుదయం 9.30 దాటితే సాయంత్రం నాలుగుదాకా రైళ్లులేవు. ఈ రైల్వే వాల్లు ఎక్కడనిద్రపోతున్నారని నం తిట్టుకుంటుంన్నారు. ఉదయం పదికి ఒంగోలు స్టేషను క వెల్లి నెల్లూరి కి టికెట్ ఇవ్వమనిఅడిగితే సాయంత్రం నాలుగుదాకా రైలులేదనిసమాధానం .ఈలోపు వందే బారత్ రైలువుంది,డానికి ఆన్ లైన్ బుకింగ్ అనిసమాధానం. మనమెక్కడున్నాము .? ఏకాలంలోఉన్నాము ?మనప్రధాని మోడీగారు చాలా అధునాతనమైన , నాగరీకమైన , స్వచ్ఛమైన పాలన అందిస్తున్నానని ప్రకటనలద్వారా గుప్పిస్తున్నారు. మాట్లడితే వందే బారత్ రైళ్లు , వందే మాతరం రైళు , అని చెప్పి నేను ఎంతగా డబ్బుగలవారికి ఎసి రైళ్లు వేస్తున్నానో చూడండి అంటాడు.వీటిని నియోరిచ్ అంటే నడమంత్రపు సిరిగాళ్లు ,బ్యూరో కాట్స్ మాత్రమె సమర్ధిస్తారు , ఎందుకంటె సామాన్యుడు అసలు ఈరైళ్లు ఎక్కడుకదా ! ప్రధానిగా ఇతరదేశాలు ఈయన తిరిగినన్ని తిరుగుళ్ళు గతంలో ఏప్రధానీతిరగలేదు. తిరిగి ప్రజలకు ఎమిసందేశం ఇచ్చాడు ? ప్రజలకు చెప్పాలికదా !
దొంగబాబాలను ఈయన సమర్దినట్లుగా గతంలో ఏప్రధాని సమర్ధించలేదు. రైలుప్రయాణికులను ఈయనపెట్టినట్లుగా గతంలో ఏప్రభుత్వము ఇబ్బందిపెట్టలేదు. పాసెంజర్ రైళ్లను ఎక్స్ప్రెస్ రైళ్లగా మార్చాడు . సినియర్ సిటిజెన్స్ కి చార్జీలో రాయితీ తీసివేశాడు. జనాభాపెరుగుతున్నారు. వారికితగినట్లుగా ప్రయాణ సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత రయిల్వే శాఖపైనఉన్నది. ఆశాఖ సరిగాపనిచేస్తుందా లేదా చూడాల్సిన బాధ్యత ప్రధానిపై ఉంది . లక్షల ఖరీదుచేసే డ్రస్ వేసుకొని , రోజుకొక దేశం తిరగటానికి కాదు ప్రజలు ఎన్నుకున్నది. అయినా ఉదయము 9 .30 దాటితె సాయంత్రం నాలుగువరకు రైలులేదు అని అనటం రయిల్వే వారి అసమర్ధతకు , చేతకాని తనానికి అద్దంపడుతోంది.

**నార్నెవెంకటసుబ్బయ్య .**
**9290617819**

## కేసీఆర్ మౌనం వెనక వ్యూహం?



- ఓటమి తరువాత జనంలోకి వచ్చింది తక్కువే
- శాసనసభకు ఒక్కసారి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు
- ఈసారి శీతా కాల సమావేశాలకు రావాలంటున్న అధికార పార్టీ
- ఈ విషయంపై స్పష్టత ఇవ్వని గులాబి దండు
- ఏడాది పాలనపై అడుగడుగునా నిలదీస్తానంటున్న కేటీఆర్

**- అంబీర్ శ్రీకాంత్,**
**81859 68059.**

23 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర సమితి(ఇప్పుడు భారత రాష్ట్ర సమితి)ని అన్నీ తానై నడిపిన కేసీఆర్..తెలంగాణ రాష్ట్ర శాసనసభకు మూడోసారి జరిగిన ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎలక్షన్స్‌లో సైతం గుండు–సున్నాకె పరిమితమై పరాభవాన్ని మూటగట్టుకున్నారు.బీఆర్ఎస్ అధినేత దాదాపు 11 నెలలుగా మౌనముద్ర దాల్చి ఫాంహౌస్‌కే పరి మితమవుతుండటం రాజకీయ వర్గాల్లో అనేక రకాల చర్చలకు ఆస్కారమవుతోంది.అయితే, ఈ రకంగా మౌనంగా ఉంటున్నట్టు కనిపిస్తున్నప్పటికీ వెనక వ్యూహంఉందని పొలిటికల్ సర్కిల్లో చర్చ. గతంలో సైతం కేసీఆర్ వ్యవహార సరళి ఈ విధంగానే ఉందని, ఇప్పుడూ అదే రకమైన ఫార్ములాను ఫాలో అవుతున్నారనే వాదన వినిపిస్తోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సాగిన ఉద్యమంతో పాటు పదేండ్ల పాలనలోనూ కేసీఆర్ కొద్ది రోజుల పాటు మౌనముద్ర దాల్చిన సందర్భాలున్నాయని పలువురు గుర్తుచేస్తున్నారు. ముఖ్యమంత్రిగా సెక్రెటేరియట్‌కు రాకుండానే నెలల తరబడి ఫాంహౌస్ లేదా ఇంటికి పరిమితమై తన పరిపాలనను కొనసాగించిన సందర్భాలూ ఉన్నాయి. ఈ క్రమంలోనే ప్రస్తుతం సైతం ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి రాకుండా ఉండటంలో విచిత్రమేమీ లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఫాంహౌస్‌లో ఖాళీగా ఉన్నారనుకుంటే పొరపాటే :** 40 ఏండ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగి..ఎమ్మెల్యేగా, ఎంపీగా, డిప్యూటీ స్పీకర్‌గా, రాష్ట్ర మంత్రిగా, కేంద్ర మంత్రిగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన కేసీఆర్..ప్రస్తుతం ఫాంహౌస్‌కే పరిమితమై...ఖాళీగా ఉన్నారనుకుంటే పొరపడినట్లేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంటు ఎలక్షన్స్‌లో ఓటమినిచవి చూసిన ప్పటికీ తెలంగాణలో ఇప్పటికీ బలమైన పార్టీగా బీఆర్ఎస్ ఉంది. ఈనేపథ్యంలో సరైన సమయం, సందర్భం చూసి.. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నమాదిరిగా బహుశా.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యూహరచనలో బిజీగా
ఉన్నట్టున్నారనే టాక్ బీఆర్ఎస్ వర్గాల్లో ఉంది. ప్రభుత్వంపై వ్యతిరేకతనుఆసరాగా తీసుకుని బలమైన అస్త్రం సమకూర్చుకున్న తర్వాతనే ప్రజాక్షేత్రంలోకిఎంట్రీ ఇవ్వాలనేది కేసీఆర్ వ్యూహంగా ఉం డబోతున్నదని రాజకీయ పరిశీలకులుఅంచనా వేస్తున్నారు. ఈ లోపు ప్రజల్లోనూ పార్టీ అధినేత కేసీఆర్ సరైనసమయానికి వస్తారనే భావనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,ఎమ్మెల్యే హరీశ్‌రావుల ద్వారా చర్చకు తీసుకొచ్చి.. తద్వారా గులాబీ కేడర్‌ను సైతం సమాయత్తం చేస్తున్నారనే వాదనలు కూడా వినబడుతున్నాయి.
చూడాలి మొత్తం.. మరోసారి తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ వ్యూహాత్మక అడుగులుఏ విధంగా పడుతాయి. అవి పింక్ పార్టీని ఏ విధంగా విజయతీరాల వైపునకు తీసుకెళ్తాయో..

## "ప్రజాపాలన- ప్రజా విజయోత్సవం"

- మూడు జిల్లాల్లో విజయోత్సవ సభలు
- వరంగల్, కరీంనగర్ మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల్లో సభలు
- మొదటి బహిరంగ సభలో రూ. 4962.47 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- కాళోజీ నాలెడ్జ్ సెంటర్ ప్రారంభోత్సవం
- డిసెంబర్ 7 8 9 తేదీల్లో ట్యాంక్ బండ్ పై వేడుకలు
- ప్రజా పాలన విజయోత్సవం పేరుతో ప్రచారం



**విద్య వెంకట్ తెలంగాణ బ్యూరో**
**9391618181**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు జరుపుకుంటుంది. మొదటి సభ ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండ కేంద్రంగా కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవ సభ జరిగింది.సందర్భంగా విజయోత్సవాలు జరుపుకుంటుంది. మొదటి సభ ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండ కేంద్రంగా కాంగ్రెస్ ప్రజా పాలన విజయోత్సవ సభ జరిగింది. అధికారంలోకి తొలి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి అధికా రులను ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతుండడంతో నిర్వహించనున్న సంబరాలకు "ప్రజాపాలన–ప్రజా విజయోత్సవం" అని నామకరణం చేశారు. ఉత్సవాలను పకడ్బందీ ప్రణాళికతో పక్కాగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలతో పాటు హైదరాబాద్లో భారీ ఎత్తున సంబరాలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఏడాది పాలన దినోత్సవాలపై హైదరాబాద్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్క సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తోపాటు మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమం త్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజాపాలన విజయోత్సవాలకు సంబంధించి డిసెంబర్ 9వ తేదీ వరకు చేపట్టనున్న కార్యక్రమాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఏడాది కాలంలోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం గుర్తుచేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా వరంగల్, కరీంనగర్, మహబూబ్నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యూత్ ఎంపవర్మెంట్కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో వాటిపై వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశం. ఈ నెల 19వ తేదీన వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన చేయాలని నిర్ణయం. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్లోని ట్యాంక్బండ్, సచివాలయం, నెక్లెస్రోడ్ పరిసరాల్లో విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి అధికారులకు చెప్పారు. డిసెంబర్ 9వ తేఈన సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ, ఆ కార్యక్రమానికి మహిళలకు ఆహ్వానం పలకాలని నిర్ణయం. ఈ కార్యక్రమాల నేపథ్యంలో నియోజకవర్గాలవారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. 3 జిల్లాల్లో సభలు ప్రజా పాలన–విజయోత్సవాల ఏర్పాట్లపై సీఎం సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు, వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్న నేపథ్యంలో చేపట్టనున్న "ప్రజాపాలన %–% ప్రజా విజయోత్సవ" కార్యక్రమాలపై డిప్యూటీ సీఎం భట్టితో పాటు పలువురు మంత్రులతో కలిసి సమీక్షించారు. ప్రజాపాలన విజయోత్సవాలకు సంబంధించి డిసెంబర్ 9 వరకు చేపట్టనున్న కార్యక్రమాలను అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరిం చారు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఏడాది కాలం లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందున వాటన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు.
కార్యక్రమాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి..ఈ ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మూడు ప్రాంతాలు వరంగల్, కరీంనగర్, మహబూబ్నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తారు. మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యూత్ ఎంపవర్మెంట్కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిన నేపథ్యంలో వాటికి సంబంధించి ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతారు. నవంబర్ 19న వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.4962.47 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవ వేడుకల్లో భాగంగా హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రై సిటీలో దాదాపు రూ.4962.47 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

**నిధుల కేటాయింపు ఇలా** :వరంగల్ లో అభివృద్ధి పనులకు మొత్తంగా కేటాయించిన నిధులు: రూ. 4962.47 కోట్లు, వరంగల్ మహానగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ: రూ.4,170 కోట్లు, మామునూరు ఎయిర్ పోర్ట్ పునరుద్ధరణ కోసం భూసేకరణకు: రూ.205 కోట్లు, కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లో అభివృద్ధి పనులు: రూ.160.92 కోట్లు,
టెక్స్ టైల్ పార్కులో రోడ్లు, స్కూల్స్, సదుపాయాలు : రూ.33.60 కోట్లు, టెక్స్ టైల్ పార్క్ కు భూములు ఇచ్చిన రైతులకు 863 ఇందిరమ్మ ఇండ్లు: రూ. 43.15 కోట్లు, హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం: రూ.85 కోట్లు, పరకాల నుంచి ఎర్రగట్టు గుట్ట వరకు ఫోర్ లైన్ రోడ్డు విస్తరణ : రూ. 65 కోట్లు, నయీమ్ నగర్ బ్రిడ్జి నిర్మాణం: రూ.8.3 కోట్లు, వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ బిల్డింగ్ టవర్: రూ. 32.50 కోట్లు, ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం: రూ.80 కోట్లు, భద్రకాళి ఆలయం వద్ద పాలిటెక్నిక్ కాలేజీకి కొత్త బిల్డింగ్ నిర్మాణం: రూ.28 కోట్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్ల నిర్మాణం : రూ. 49.50, వరంగల్ ఉర్దూ భవన్, షాదీ ఖానా : రూ.1.50 కోట్లు నిధులు మంజూరు కు ప్రభుత్వం కార్యచరణ రూపొందించినందుకు సమాచారం. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్బండ్, సెక్రటేరియట్, నెక్లెస్రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా డిసెంబర్ 9న సచివాలయం ఆవంఇలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆహ్వానం అందించారు. ఈ విజయోత్సవాల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.
తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలు, కార్యక్రమాలపై శాఖలు, విభాగాల వారిగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ విధంగా అధికార పార్టీ ఏడాది పాలనను విజయోత్సవంగా జరుపుకుంటుంది.

## తెలంగాణాలో విద్యవ్యవస్ధ పరిస్థితి ఏంటి?



తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన సందర్భంగా తెలంగాణ విద్యా రంగంలో మార్పులను పరిశీలిస్తే అనేక మార్పులు జరిగాయి.గత ప్రభుత్వం లో నిర్లక్ష్యానికి, నిర్లిప్తత కు గురైన విద్యా విధానం రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత విద్యా, వైద్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.తెలంగాణ రాష్ట్రం లో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు బదిలీలు చేశారు.దాదాపు పదివేలకు పైగా కొత్త ఉపాధ్యాయులకు అపాయింట్మెంట్ ఆర్డర్ లు ఇచ్చి ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో నియమించారు, ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు.ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ను, సభ్యులను, విద్యా కమిషన్ ఛైర్మన్ ను, సభ్యులను నియమించి విద్యా విధానం లో మార్పులను చేయనున్నారు.తెలంగాణ రాష్ట్రం లోని మంత్రులను నియమించి విద్యా శాఖ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డే పర్యవేక్షణ చేస్తున్నారు.ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చినప్పుడు, కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చినప్పుడు నవంబర్ 14 బాలల దినోత్సవ సందర్భంగా హైదరాబాద్ లోని ఎల్.బి.స్టేడియంలో ముఖ్యమంత్రి స్వయంగా ఉపాధ్యాయులతో కలిసి ఉపాధ్యాయులకు దశ దిశ నిర్దేశం చేశారు.నాణ్యమైన విద్యను ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న విద్యార్థులకు అందించాలని మార్గనిర్దేశం చేశారు.

**ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులేరి ?**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేయడానికి నియమించే ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు డి.ఎడ్.,బి.ఎడ్ పూర్తి చేసి ఉండాలి.తెలంగాణ రాష్ట్రం లోని అన్ని డి.ఎడ్.,బి.ఎడ్ కళాశాలల్లో ఉపాధ్యాయుల, ఉపన్యాసకుల, ఆచార్యుల పోస్టులు గత దశాబ్ద కాలంగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం లేదు.కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను, ఉపన్యాసకులను, డిప్యూటేషన్ మీద ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులను, ఉపన్యాసకులను, ఆచార్యులను నియమించి విద్యా సంవత్సరం పూర్తి చేస్తున్నారు.ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీ ఉపాధ్యాయులను నియమించి వారికి చిన్నప్పటి నుండి నాణ్యమైన విద్యను అందిస్తే పెద్ద చదువులు చదవడానికి సులభం అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డైట్ కళాశాలల్లో ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఒక్క డైట్ కళాశాల లెక్చరర్ లేక పోవడంతో హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి కి ప్రిన్సిపాల్ గా అదనపు బాధ్యతలు అప్పగించారు.హైదరాబాద్ లో విద్యా శాఖ అనేక వినూత్న కార్యక్రమాలు చేపడుతుండడంతో నిజామాబాద్ నుండి డిప్యూటేషన్ మీద వచ్చి ఎస్సీ ఆర్ట్ ఈ ప్రొఫెసర్ ( ఆచార్యులు) కు డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు.అన్ని పోస్టులు ఖాళీగా ఉంటే డిప్యూటేషన్ మీద నియమించడానికి నోటిఫికేషన్ జారీ చేశారు.డి.ఎడ్ ప్రథమ సంవత్సరం పూర్తి అయి పరీక్షల తేదీలు వచ్చినప్పటికీ ఉపాధ్యాయుల శిక్షణ కళాశాలల్లో ఛాత్రోపాధ్యాయులకు సరైన శిక్షణ ఇవ్వడానికి ఉపాధ్యాయులు లేరు.పాఠాలు కాకుండా శిక్షణ కళాశాలల్లో శిక్షణ లేకుండానే పరీక్షలు నిర్వహించడం ద్వారా వారికి ఏ విధమైన ఉపాధ్యాయులను తయారు చేయవొచ్చో మనం ఊహించవచ్చు.2024లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కొత్త ఉపాధ్యా యులలో కొంత మంది ఒక్కరోజు కూడా శిక్షణ కళాశాలలకు వెళ్ళకుండా శిక్షణ పూర్తి చేసినట్టు సర్టిఫికెట్ తీసుకొని వస్తే విద్యా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి శిక్షణ తీసుకోని ఛాత్రోపాధ్యా యులను పోస్టింగ్ ఇవ్వకుండా ఆపివేశారు.
తెలంగాణ రాష్ట్రంలోని విద్యా శాఖ కు లక్షలకు లక్షలు నిధులను మంజూరు చేస్తున్న ప్రభుత్వం అసలు సిసలైన ఉపాధ్యాయ శిక్షణ కళాశాలల్లో ఉపాధ్యాయులను నియమించకుండా నాణ్యమైన విద్యను ఏ విధంగా అందిస్తుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు , మేధావులు, విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నత పాఠశాల లలో పి.జి లు, పిహెచ్.డి లు,ఎం.ఈడి లను పూర్తిచేసి 25,26 సంవత్సరాల అనుభవం గడించిన వారికి పదోన్నతుల ద్వారా డి.ఎడ్.,బి.ఎడ్ కళాశాలల్లో ఉపాధ్యాయులుగా, ఉపన్యాసకులుగా, ఆచార్యులుగా నియమిస్తే శిక్షణ కళాశాలల్లో ఛాత్రోపాధ్యాయులకు సరైన శిక్షణ ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.చాలామంది ఉపాధ్యాయులు ఉన్నతోన్నత చదువులు చదివి డైట్ ( డి.ఎడ్ ) ,బి.ఎడ్ కళాశాలల్లో పదోన్నతులు రాక ఉపాధ్యాయులుగా పదవీ విరమణ చేస్తున్నారు.

**టెట్ పరీక్ష కోసం ఫీజు తగ్గించడం చారిత్రాత్మక నిర్ణయం:–**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో (పనిచేయడానికి) నియమించడానికి డి.ఎస్సీ ద్వారా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తారు.ఉపాధ్యాయ నోటిఫికేషన్ కు ముందు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ ను నిర్వహిస్తారు.రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత రెండు సార్లు టెట్ నోటిఫికేషన్ ఇవ్వడం ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసిన ఛాత్రోపాధ్యాయులకు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గతంలో ఫస్ట్ పేపర్ కు వేయి రూపాయలు, రెండు పేపర్లు రాస్తే రెండు వేల రూపాయలను వసూలు చేసేవారు.ఈ ఫీజు ఒకేసారి ఉపయోగపడేది.ఎక్కువ మార్కుల కోసం మళ్ళీ టెట్ పరీక్ష రాస్తే మళ్ళీ ఫీజు కట్టాల్సి వచ్చేది.రేవంత్ సర్కార్ టెట్ పరీక్ష ఫీజు ను వేయి రూపాయల నుండి ఏడు వందల యాభై రూపాయలు చేసింది.రెండు పేపర్లకు పదిహేను వందల రూపాయల ఫీజు నిర్ణయించింది.రెండవ సారి టెట్ పరీక్ష రాసి మార్కులను పెంచుకోవాలనుకునేవారికి మొదటి సారి ఏదైనా అనివార్య కారణాల వల్ల పరీక్ష రాయని వారు రెండో సారి టెట్ పరీక్ష రాయాలనుకుంటే టెట్ పరీక్ష ఫీజు నుండి మినహాయింపు ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయం అని నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఛాత్రోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రేవంత్ సర్కార్ విద్యా శాఖ లో విప్లవాత్మకమైన మార్పులు తేవడానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ విద్యార్థులకు అందరికీ కలిపి వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటిగ్రేటెడ్ రేసిడెన్షియల్ స్కూల్ లను స్వంత భవనాలలో నిర్మించి నాణ్యమైన విద్యను పేద, బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ విద్యార్థులకు అందించనున్నారు.
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో గత ప్రభుత్వం లో విద్యా రంగంలో ఊహించినంత మార్పులు జరగలేదు.2014 జూన్ తర్వాత విద్యా రంగానికి కేటాయించిన బడ్జెట్ తగ్గుతూ వస్తుంది.అనేక వేల మంది ఉపాధ్యాయ శిక్షణలైన డి.ఎడ్ ( డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్) బి.ఎడ్ ( బ్యాచరల్ ఇన్ ఎడ్యుకేషన్) పూర్తి చేసుకొని డి.ఎస్సీ ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ కోసం ఎదురు చూసిన వారికి నిరాశే మిగిలింది.

(మిగతా రేపటి సంచికలో)

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

## 'మహా' ప్రజల్లో ఆనందం లేదు: శరద్ పవార్

ముంబయి: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ప్రజల్లో ఆనందం కనిపించడం లేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలపై ప్రతిపక్షాలు ఆందోళన చెందాల్సిన అవస రం లేదన్నారు. తాజాగా విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "రాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే.. రాష్ట్ర ప్రజల్లో ఎలాంటి ఉత్సాహం, ఆనందం కనిపించడం లేదు. ఈ ఫలితాలపై ప్రతిపక్షాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రజల్లోకి వెళ్లాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం చేసిన వాగ్దానాలను నేరవేర్చేలా.. మహా వికాస్ అఘాడీ కృషి చేయాలి" అని సూచించారు. కాగా.. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన మహాయుతి కూటమి ఇటీవల నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సీఎం బాధ్యతలను భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్కు అప్పగించింది.

మరోవైపు.. ఎంవీఏ కూటమిలో విభేదాలు తలెత్తాయి. బాబ్రీ మసీదు కూల్చివేతకు సంబంధించి శివసేన (యూబీటీ) నేత ఒకరు చేసిన వ్యాఖ్యలు సమాజ్వాదీ పార్టీ ఆగ్రహానికి కారణమయ్యాయి. బాబ్రీ మసీదు కూల్చివేతపై గురించి ప్రస్తావిస్తూ.. "ఆ పని చేసిన వారి పట్ల గర్వ పడుతున్నా" అని శివసేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్సీ మిలింద్ నర్వేకర్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. వార్తాపత్రికలోనూ దీనిపై ప్రకటన ఇచ్చారు. ఇది కూటమిలో విభేదాలకు దారి తీసింది. దీంతో కూటమి నుంచి వైదొలగాలని ఎస్పీ నిర్ణయించుకుంది.



# ఐఎండీబీ 2024 మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్




ముంబై : సినిమాలు, టీవీ మరియు ప్రముఖుల సమాచారం కోసం ప్రపంచంలోని అత్యంత ప్రాచుర్యం పొందిన ఐఎండిబి నేడు 2024 టాప్ 10 మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్ జాబితాను ప్రకటించింది. 2024లో నెం.1 ఇండియన్ స్టార్ అయిన త్రిప్తి డిమ్రి ఈ ఏడాది బ్యాడ్ న్యూజ్, విక్కీ విద్యా కా వో వాలా వీడియో, భూల్ భులైయా 3 అనే మూడు సినిమాల్లో నటించి ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది.

"ఐఎండీబీ మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్ ఆఫ్ 2024 జాబితా భారతీయ వినోదరంగంలోని విభిన్నతను ప్రదర్శిస్తుంది. ఇందులో ఇప్పటికే మంచి పేరు తెచ్చుకున్న నటులతో పాటు కొత్తగా వస్తున్న నటులను కలుపుకుని ఉంది"అని ఐఎండిబి ఇండియా హెడ్ యామిని పటోడియా అన్నారు. "మా ఈ వార్షిక జాబితా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల అభివృద్ధి చెందుతున్న ఆసక్తులను ప్రతిబింబిస్తుంది. షారుఖ్ ఖాన్ మరియు ఐశ్వర్య రాయ్ బచ్చన్ వంటి లెజెండరీ తారలు త్రిప్తి దిమ్రీ మరియు షార్వరి వంటి వర్ధమాన ప్రతిభావంతులతో పాటు అభిమానులను ఎలా ఆకర్షిస్తున్నారో హైలైట్ చేస్తుంది. ఈ ఏడాది జాబితా భారతీయ సినిమా రంగంలోని నటులు వారి విస్తరిస్తున్న అంతర్జాతీయ ఆకర్షణను కూడా తెలియజేస్తుంది" తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపిన తృప్తి డిమ్రీ, "ఐఎండిబి మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్ ఆఫ్ 2024 జాబితాలో నెం.1 స్థానం పొందడం నిజంగా గొప్ప గౌరవం. ఈ గుర్తింపు నా అభిమానుల నమ్మశక్యం కాని మద్దతుకు మరియు నాకు సహకరించిన ప్రతి ఒక్కరి కృషికి ఇది నిదర్శనం. అద్భుతమైన ప్రాజెక్టులలో పనిచేయడం నుండి 2024 భూల్ భులైయా3తో ముగించడం వరకు, ఇది నాకు చిరస్మరణీయమైన సంవత్సరం. నేను ఈ స్ఫూర్తిదాయక పరిశ్రమలో భాగం అవుతూనే భవిష్యత్ ఎలా ఉంటుందో అని ఎదురుచూస్తున్నాను"

2024 సంవత్సరానికి గాను టాప్ 10-మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్ 1. త్రిప్తి డిమ్రీ 2. దీపికా పదుకొణె 3. ఇషాన్ ఖట్టర్ 4. షారుఖ్ ఖాన్ 5. శోభిత ధూళిపాళ 6. శార్వరి 7. ఐశ్వర్య రాయ్ బచ్చన్ 8. సమంత 9. అలియా భట్ 10. ప్రభాస్ ఐఎండీబీ టాప్ 10 మోస్ట్ పాపులర్ ఇండియన్ స్టార్స్ ఆఫ్ 2024 జాబితాలో 2024లో ఐఎండీబీ వీక్లీ ర్యాంకింగ్స్ లో నిలకడగా అగ్రస్థానంలో నిలిచిన తారలు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐఎండిబికి 250 మిలియన్లకు పైగా నెలవారీ సందర్శకుల వీక్షణల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్ ఇవ్వబడ్డాయి.

## శామ్సంగ్ ఈడిజిఈ సీజన్ 9 విజేతలు




గురుగ్రామ్: శామ్సంగ్, భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, శామ్సంగ్ ఈడిజిఈ తొమ్మిదవ ఎడిషన్ విజేతలను ప్రకటించింది. (ఎంపవరింగ్ డ్రీమ్స్ గెయినింగ్ ఎక్సలెన్స్), దాని వార్షిక ఫ్లాగ్షిప్ క్యాంపస్ ప్రోగ్రామ్, ఇది వేలాది మంది తెలివైన యువకులకు వారి వ్యాపార చతురత, వ్యూహాత్మక ఆలోచన మరియు నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించడానికి అవకాశాలను అందిస్తుంది.

ఈ సంవత్సరం, టాప్-టైర్ బి-స్కూల్స్, ఇంజనీరింగ్ కాలేజీలు మరియు డిజైన్ స్కూళ్లతో సహా 40 ప్రముఖ క్యాంపస్ల నుండి 15,000 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. దేశంలోని కొంతమంది తెలివైన విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ, ఆవిష్కరణ మరియు సహకారం యొక్క స్ఫూర్తిని ప్రతిబింబించారు. గురుగ్రామ్లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో కార్యక్రమంలోజెబి పార్క్, ప్రెసిడెంట్ మరియు సిఇఒ, శామ్సంగ్ సౌతెస్ట్ ఆసియా మరియు శామ్సంగ్ ఇండియాలోని ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. "శామ్సంగ్లో, మనం చేసే ప్రతిపనికి ఆవిష్కరణ మూలస్తంభం. సంవత్సరాలుగా, శామ్సంగ్ ఈడిజిఈ వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి సృజనాత్మక పరిష్కారాలను అందించడానికి విద్యార్థులకు వేదికను అందించింది. ఈ సంవత్సరం, మరింత మంది విద్యార్థులు మరియు క్యాంపస్ల నుండి వచ్చిన అధిక స్పందన మరియు భాగస్వామ్యంతో మేము చాలా సంతోషంగా ఉన్నాము, ఇది నిజంగా స్ఫూర్తిదాయకంగా ఉంది. ఈ యువ మనస్సులలో కొత్త ఆవిష్కరణలుమరియు సమస్యల పరిష్కార స్ఫూర్తిని చూడటం చాలా ఉత్తేజాన్ని కలిగించింది" అని జెబి పార్క్, ప్రెసిడెంట్ మరియు సిఈఓ శామ్సంగ్ సౌత్వెస్ట్ ఆసియా అన్నారు.

ఎక్స్ఎల్ఆర్ఐ జంషెడ్పూర్కి చెందిన ఆర్ఎస్పి టీమ్ శామ్సంగ్ ఈడిజిఈ సీజన్ 9లో జాతీయ విజేత టైటిల్ను కైవసం చేసుకుంది, వినియోగదారుల నిశ్చితార్థాన్ని పెంచడానికి దాని వినూత్న వ్యూహం జ్యూరీని ఆకట్టుకుంది ఆర్ఎస్పి ఆలోచనలో బ్రాండ్ మస్కట్లు, జియో-టార్గెటింగ్, జెన్ ఎంజెడ్ హాట్స్పాట్ ట్యాగింగ్ మరియు మాల్ యాక్టివేషన్లు ఉన్నాయి - ఇవన్నీ వినూత్నమైన, స్థానికీకరించిన మరియు వ్యక్తిగతీకరించిన అనుభవాల ద్వారా లోతైన వినియోగదారు కనెక్షన్లను నిర్మించడానికి మరియు ఎంగేజ్మెంట్ను పెంచడానికి రూపొందించబడ్డాయి. బృందం ు ప్రాంజలి భాటియా, సిద్ధార్థ ద్వివేది, రోహన్ భరద్వాజ్ రూ 450,000 నగదు బహుమతిని, శామ్సంగ్ ఫ్లాగ్షిప్ స్మార్ట్ఫోన్లు మరియు శామ్సంగ్ నుండి ప్రీ-ప్లేస్మెంట్ ఆఫర్లను పొందారు.

XLRI, జంషెడ్పూర్ నుండి టీమ్ Chevy67 స్మార్ట్ హోమ్ మార్కెట్ కోసం వ్యూహంతో మొదటి రన్నరప్స్థానాన్ని పొందింది. ప్రతిపాదిత ఆలోచన డ్రైవింగ్ దత్తతపై దృష్టి సారించింది మరియు వారి కొనుగోలు ప్రయాణాన్ని ప్రోత్సహించడం మరియు కొనుగోలు ప్రయాణాన్ని క్రమబద్ధీకరించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా వినియోగదారు అనుభవాన్ని సులభతరం చేసే భవిష్యత్తు-సిద్ధంగా, పరస్పరం అనుసంధానించబడిన పర్యావరణ వ్యవస్థను నిర్మించడంపై కేంద్రీకృతమై ఉంది. జట్టు ు అపూర్వ మిట్టల్, చయన్ బెనర్జీ, శుభమ్ త్రిపాఠిలకు INR 300,000 నగదు బహుమతి లభించింది.

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్, కలకత్తాకు చెందిన ఫియోనిక్స్ జట్టు రెండో రన్నరప్గా నిలిచింది. 'స్పిన్ టు విన్' స్మార్ట్ క్యూఆర్ కోడ్లు, సుస్థిరమైన డిజైన్తో అనంతమైన అనుభవాలు, ఎక్స్పీరియన్షియల్ రిటైల్ మరియు సస్టైనబిలిటీ ద్వారా బ్రాండ్ ఎంగేజ్మెంట్ను పెంపొందించే లక్ష్యంతో వారి ఫార్వర్డ్-థింకింగ్ ఆలోచనలు. వినియోగ దారులతో లోతైన సంబంధాలను ఏర్పరచుకోవడానికి వినూత్న మార్కెటింగ్ మరియు ఉత్పత్తి వ్యూహాలను ఉపయోగించుకోవడం గురించి ప్రధాన ఆలోచన, అదే సమయంలో ప్రపంచ ప్రేక్షకులకు భవిష్యత్తు-సిద్ధమైన అనుభవాన్ని అందిస్తుంది. బృందయివరుణ్ గోయల్, ఉమంగ్ జైన్, మరియు సాక్షం జైన్ లకు 150,000 నగదు బహుమతి లభించింది.

ఈ సంవత్సరం, శామ్సంగ్ E.D.G.E కోసం నమోదు చేసుకున్న 5713 బృందాలు, 1432 మంది క్యాంపస్ రౌండ్కు ఎంపికయ్యారు, అక్కడ వారు పరిశోధన మరియు ఆలోచనల ద్వారా కార్యనిర్వాహక కేసు సారాంశాలను రూపొందించారు. తదనంతరం, 59 జట్లు ప్రాంతీయ రౌండ్కు చేరుకున్నాయి, సవివరమైన పరిష్కారాలను సమర్పించాయి. ఈ గ్రూప్లోని అగ్రశ్రేణి 8 జట్లు మాత్రమే జాతీయ రౌండ్కు చేరుకున్నాయి, వారి తుది ఆలోచనలను ప్రదర్శించే ముందు శామ్సంగ్ లీడర్ల నుండి ఒకరితో ఒకరు మెంటార్షిప్ పొందారు.

## 2050 నాటికి వృద్ధుల జనాభా మూడు రెట్లు




న్యూఢిల్లీ : జనాభా డివిడెండ్ కారణంగా భారతదేశం ఒక ప్రత్యేకమైన స్థానంలో ఉంది, అయితే దేశంలోని సీనియర్ సిటిజన్లు ప్రధానంగా ఆరోగ్యపరంగా అనేకరంగాల్లో పోరాటాలను ఎదుర్కొంటున్నారు. వెండి సంవత్సరాలలో వృద్ధులు వ్యాధులు మరియు ఒంటరితనంతో కూరుకుపోకుండా చూసేందుకు మరియు నివారించగల ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలను జాబితా చేస్తూ, అసోచమ్ సామాజిక విభాగంఅసోచమ్ ఫౌండేషన్ ఫర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ,"పెద్దల సాధికారత' పేరుతో నిపుణులతో కూడిన ప్యానెల్ చర్చను నిర్వహించింది. : ఎ పాత్ టు హెల్తీ అండ్ గ్రేస్ఫుల్ ఏజింగ్" ఎట్ ది ఇండియా ఇంటరేష్నల్ సెంటర్. పరిశుభ్రత బ్రాండ్ సావ్లాన్ మద్దతుతో, ప్యానెల్ చర్చలో (పద్మశ్రీ) ప్రొఫెసర్. (డా.) సుభాష్ సి. మంచాంద, సర్ గంగా రామ్ హాస్పిటల్, కార్డియాలజిస్ట్, ప్రొఫెసర్ వినోద్ కుమార్, మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ & ఆల్ ఇండియా మాజీ హెడ్ ఆఫ్ జెరియాట్రిక్ క్లినిక్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, న్యూ ఢిల్లీ మరియు డాక్టర్ మీనల్ థక్రాల్, క్లాసిఫైడ్ స్పెషలిస్ట్-జెరియాట్రిక్ మెడిసిన్, ఆర్టెమిస్ హాస్పిటల్, గురుగ్రామ్. ఈ సెషన్ను అసోచమ్ నేషనల్ కౌన్సిల్ ఆన్ సిఎస్ఆర్ సభ్యుడు మరియు ఫౌండర్ & డైరెక్టర్, ఢిల్లీ- ఎన్సిఆర్మరియు ఈసీ సభ్యుడు, రీసెర్చ్ సొసైటీ ఫర్ ది స్టడీ ఆఫ్ డయాబెటిస్ ఇన్ ఇండియా - RSSDI డాక్టర్ రాజేష్ కేసరి నిర్వహించారు.

అసోచమ్ నేషనల్ కౌన్సిల్ ఆన్ సిఎస్ఆర్ చైర్పర్సన్ అనిల్ రాజ్పుత్ మాట్లాడుతూ,"ప్రపంచవ్యాప్తంగా, వృద్ధాప్యం 21వశతాబ్దపు అత్యంతముఖ్యమైన సామాజిక సవాళ్లలో ఒకటి. భారతదేశంలో, వృద్ధుల జనాభా 104 మిలియన్లు మరియు 2050 నాటికి 319 మిలియన్లకు పెరుగుతుందని అంచనా వేయ బడింది. ప్రభుత్వం తన వంతుగా ప్రశంసనీయమైన కార్యక్రమాల ద్వారా ఈ అంశాన్ని పరిష్కరిస్తోంది, అయినప్పటికీ, సంవత్సరాలుగా వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన ప్రధాన సమస్యలు ఉద్భవించాయి. రాబోయే రెండున్నర దశాబ్దాల్లో వృద్ధుల జనాభాలో మూడు రెట్లు పెరుగుదల మరియు వృద్ధుల సంరక్షణ ఇప్పటికీ ఆరోగ్య సంరక్షణలో సాపేక్షంగా కొత్త ప్రాంతం మరియు ప్రధానంగా నగరాలకే పరిమితం కావడంతో, వృద్ధుల సాధికారతకు చురుకైన మరియు నిరంతర భాగస్వామ్యం అవసరమని నేను గట్టిగా నమ్ముతున్నానన్నారు"వ్యసనాలు లేకుండా సమతుల్య ఆహారం, శారీరక వ్యాయామం, మంచి నిద్ర, శాంతి మరియు విశ్రాంతి, అలాగే చురుకైన మానసిక, సామాజిక మరియు ఆధ్యాత్మిక నిశ్చితార్థంలో నిమగ్నమవ్వడం ద్వారా మనోహరమైన ఆరోగ్యకరమైన వృద్ధాప్యం మరియు సంతోషకరమైన వృద్ధాప్యం యొక్క మనిషి కలలు సాధించగలవు" అని ప్రొఫెసర్ కుమార్ చెప్పారు. .

# దుబాయ్‌లో స్వల్ప విరామం ఇలా



విమాన ప్రయాణాలలో సాధారణ విరామాన్ని కూడా ఒక మినీ-సెలవు దినంగా మార్చడానికి దుబాయ్ అనువైన గమ్యస్థానంగా ఉంది. గ్లోబల్ కనెక్టివిటీ , చూడవలసిన మరియు చేయవలసిన విభిన్న కార్యక్రమాలతో ,దుబాయ్ మీరు మీ ప్రయాణంలో కేవలం ఒక రాత్రి లేదా రెండు రోజులు మాత్రమే ఉన్నా, సందర్శించేందుకు చక్కటి ప్రదేశంగా ఉంటుంది. మీరు దుబాయ్లో స్వల్పకాలం మాత్రమే ఉంటే , మీ తక్కువ సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవచ్చంటే... ఎమిరేట్స్ ద్వారా స్టాప్ఓవర్ను బుక్ చేయండి మీ ప్రయాణానికి దుబాయ్లో స్టాప్ఓవర్ని జోడించడం అంత సులభం కాదు. మీరు ఎమిరేట్స్లో ప్రయాణిస్తున్నట్లయితే, మీరు దుబాయ్ స్టాప్ఓవర్ను సులభంగా బుక్ చేసుకోవచ్చు మరియు వారు విమానాశ్రయంలో కలుసుకోవడం మరియు గ్రీట్ చేయడం ప్రారంభించి 24 గంటల చెక్-ఇన్, పర్యటనలు, విహారయాత్రలు మరియు అవసరమైతే వీసాల వరకు ప్రతిదీ చూసుకుంటారు. అనేక దేశాల్లో, ఎమిరేట్స్ పర్యటనను రూపొందించడంలో సహాయపడటానికి 'దుబాయ్ ఎక్స్పీరియన్స్' ప్రోగ్రామ్ను కూడా అందిస్తుంది.

**దుబాయ్ స్టాప్ఓవర్ చెక్లిస్ట్ :** వీసా-రహిత ప్రవేశం: దుబాయ్ 70 కంటే ఎక్కువ జాతీయులకు వీసా-రహిత రాకపోకలను అందిస్తుంది. అవసరమైతే, ఎమిరేట్స్లో ప్రయాణించే వారికి 96 గంటల వీసా అందుబాటులో ఉంటుంది.

**టూరిస్ట్ సిమ్ కార్డ్:** పర్యాటకులు దుబాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్లో ఉచిత మొబైల్ సిమ్ కార్డ్ని పొందవచ్చు మరియు 24 గంటల పాటు చెల్లుబాటు అయ్యే 1జిబి ఉచిత మొబైల్ డేటాను పొందవచ్చు.

**దుబాయ్ మెట్రో:** దాదాపు 90కిలోమీటర్లు విస్తరించి ఉంది, పూర్తిగా ఆటోమేటెడ్ దుబాయ్ మెట్రో నగరాన్ని అన్వేషించడానికి సమర్థవంతమైన మార్గాన్ని అందిస్తుంది. అనేక ప్రసిద్ధ పొరుగు ప్రాంతాలు మరియు షాపింగ్ మాల్స్ స్టాప్లు ఉన్నాయి.

**దుబాయ్ స్టాప్ఓవర్ పాస్:** తక్కువ వ్యవధిలో దుబాయ్ని ఎక్కువగా చూడాలనుకునే వారికి ఇది అనువైనది, మీరు 36 గంటల పాటు సందర్శించడానికి రెండు, మూడు లేదా నాలుగు ఆకర్షణలను ఎంచుకోవచ్చు. ధరలు పెద్దలకు 349 మరియు పిల్లలకు (మూడు నుండి 12 సంవత్సరాల వయస్సు) %ఇష్టం%279 నుండి ప్రారంభమవుతాయి.

**సిటీ బస్సు పర్యటనలు:** సిటీ సందర్శనా సందర్శకులకు దుబాయ్లో అద్భుతమైన హాప్ ఆఫ్ అనుభవాన్ని అందిస్తుంది. ఎంచుకోవడానికి అనేక రకాల ప్యాకేజీలు ఉన్నాయి మరియు టిక్కెట్లు 12 నెలల వరకు చెల్లుబాటులో ఉంటాయి.

**పన్ను రహిత షాపింగ్:** పర్యాటకులు దుబాయ్లో వారి అన్ని కొనుగోళ్లపై 5% వాపసు పొందవచ్చు.

# బంగ్లాదేశ్‌లో మరో ఇస్కాన్ కేంద్రంపై దాడి

**దాడి చేసి, నిప్పు పెట్టిన దుండగులు- ఇస్కాన్ కోల్‌కతా ఉపాధ్యక్షుడు రాధారమణ్ దాస్ ప్రకటన**



బంగ్లా: ఇస్కాన్ కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు నేపథ్యంలో బంగ్లాదేశ్ లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్న విషయం తెలిసిందే. కాగా శనివారం తెల్లవారుజామున బంగ్లాదేశ్లోని మరో ఇస్కాన్ కేంద్రంపై దుండగులు దాడి చేసినట్లు ఇస్కాన్ కోల్కతా ప్రతినిధి రాధారామణ్ దాస్ తెలిపారు. "బంగ్లా రాజధాని ఢాకాలో ఉన్న ఇస్కాన్ కేంద్రం, మరో ఆలయంపై దుండగులు దాడి చేసి, నిప్పు పెట్టారు. ఈ దాడిలో కేంద్రం పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ దాడులు ఇకనైనా ఆగేలా అక్కడి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్లో ఇస్కాన్ ప్రచారకర్తగా పనిచేస్తున్న చిన్మయ్ కృష్ణదాస్ గత నెలలో అక్కడ జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్న సమయంలో ఆ దేశ జెండాను ఉద్దేశించి పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ఢాకా విమానాశ్రయంలో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఈనేపథ్యంలో చెలరేగిన ఘర్షణల్లో ఓ న్యాయవాది ప్రాణాలు కోల్పోయారు. దీంతో అంతర్జాతీయ శ్రీకృష్ణ సమాజం (ఇస్కాన్) కార్యకలాపాలపై నిషేధం విధించాలని ఓ న్యాయవాది పిటిషన్ వేయగా.. బంగ్లా హైకోర్టు దానిని కొట్టివేసింది.

కృష్ణదాస్ తరఫున వాదించడానికి వచ్చిన ఓ న్యాయవాదిని ఆందోళనకారులు తీవ్రంగా కొట్టగా.. ఆయన ప్రాణాలు కోల్పోయారు. మరో న్యాయవాదిని స్థానికులు కోర్టు ప్రాంగణంలోకి అనుమతించలేదు. ఈ నేపథ్యంలో కోర్టు బెయిల్ పిటిషన్ నెల రోజుల పాటు వాయిదా వేసింది. కాగా బంగ్లాలో జరుగుతున్న అల్లర్లపై బ్రిటన్ స్పందిస్తూ ఆ దేశంలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందని పేర్కొంది. రద్దీ ప్రాంతాలు, మతపరమైన భవనాలు, రాజకీయ ర్యాలీలు, పర్యాటక ప్రాంతాల్లో తీవ్రవాదులు పెద్ద ఎత్తున దాడులు చేయడానికి ప్రయత్నిస్తున్నారని హెచ్చరించింది.

## పొరపాటున మార్షల్ లా ప్రకటించా

**క్షమించండి.. మళ్లీ ఆ తప్పు చేయను**

**ప్రజలను వేడుకున్న దక్షిణకొరియా అధ్యక్షుడు**



సియోల్: 'ఎమర్జెన్సీ మార్షల్ లా' ప్రకటనతో చిక్కుల్లో పడిన దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్కు పదవీ గండం ముంచుకొస్తోంది. ఆయనపై విపక్షాలు తీసుకొచ్చిన అభిశంసన తీర్మానంపై మరికొన్ని గంటల్లో పార్లమెంట్లో ఓటింగ్ జరగనుంది. ఈ పరిణామాల నేపథ్యంలో యూన్ ఓ టెలివిజన్ ఛానల్లో మాట్లాడుతూ దేశ ప్రజలకు బహిరంగ క్షమా పణ తెలిపారు. ఇంకోసారి ఇలాంటి తప్పు చేయనని వెల్లడించారు.

"ఆ ప్రకటన కోసం నా రాజకీయ, చట్టపరమైన బాధ్యతను తప్పించుకోలేను. మార్షల్ లా కారణంగా ప్రజలను ఆందోళనకు, తీవ్ర అసౌకర్యానికి గురిచేసినందుకు గానూ క్షమాపణలు తెలియజేస్తున్నా. ఇంకోసారి ఎమర్జెన్సీవిధించే ప్రయత్నం చేయబోనని హామీ ఇస్తున్నా" అని అధ్యక్షుడు యూన్ వెల్లడించారు. ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ.. యూన్ సుక్ యోల్ ఇటీవల 'ఎమర్జెన్సీ మార్షల్ లా' విధించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో పార్లమెంట్లో ఓటింగ్ పెట్టి అత్యవసర స్థితికి వ్యతిరేకంగా తీర్మానాన్ని ఆమోదించారు. గంటల వ్యవధిలోనే ఎమర్జెన్సీని ఎత్తివేశారు. చేసేదేం లేక వెనక్కితగ్గిన అధ్యక్షుడు తన ప్రకటనను విరమించుకున్నట్లు తెలిపారు. ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా ఆయనకు వ్యతిరేకత ఎదురైంది. అధ్యక్షుడు పదవి నుంచి దిగిపోవాలని పట్టుబట్టిన విపక్షాలు పార్లమెంట్లో ఆయనపై అభిశంసన తీర్మానం తీసుకొచ్చారు. అటు సొంత పార్టీ నుంచి కూడా ఆయనకు మద్దతు కరవైంది. శనివారం సాయంత్రం 5 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) దక్షిణకొరియా పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమై అభిశంసన తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనుంది. దీనినుంచి గట్టెక్కాలంటే 300 మంది సభ్యులు ఉన్న దేశ పార్లమెంట్లో 200 మంది యూన్కు అనుకూలంగా ఓటెయ్యాలి. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష డెమోక్రటిక్ పార్టీ, ఇతర చిన్న విపక్ష పార్టీలంతా కలిపి 192 మంది ఉన్నారు. ఇటీవల అధ్యక్షుడి ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానం 190-0తో నెగ్గింది. దీంతో ఆయనను పదవి నుంచి తొలగించడం ఖాయంగానే కనిపిస్తోంది.

# హోంశాఖ ఇవ్వాల్సిందే

**మహాయుతి ప్రభుత్వానికి శిండే డిమాండ్**

**వివరాలు తెలిపిన శివసేన ఎమ్మెల్యే భరత్ గోగవాలే**

**11-16 మధ్య కేబినెట్ విస్తరణ ఖాయమని వెల్లడి**

**16న శాసనసభ శీతాకాల సమావేశాలు జరిగే అవకాశం**



ముంబయి: మహారాష్ట్రలో ప్రభుత్వ ఏర్పాటుపై గత కొంతకాలంగా నెలకొన్న ప్రతిష్టంభన అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రిగా భాజపా సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్ ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎంలుగా ఏక్నాథ్ శిందే , అజిత్ పవార్లకు హోదా కల్పించారు. కాగా మహాయుతిలో మంత్రిత్వశాఖల కేటాయింపులపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈనేపథ్యంలో శిందేకు సన్నిహితుడిగా పేరున్న ఎన్సీపీ ఎమ్మెల్యే భరత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కొత్తగా ఏర్పాటైన మహాయుతి ప్రభుత్వంలో తనకు హోంశాఖను అప్పగించాలని మాజీ సీఎం ఏక్నాథ్ శిందే డిమాండ్ చేశారని శివసేన ఎమ్మెల్యే భరత్ గోగవాలే పేర్కొన్నారు. ఏక్నాథ్ శిందే సీఎంగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం దేవేంద్ర ఫడణవీస్కు హోంశాఖ అప్పగించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాలకు ముందే డిసెంబరు 11-16 మధ్య కేబినెట్ విస్తరణ ఉంటుందని వెల్లడించారు. నాగ్పూర్లో డిసెంబర్ 16న శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి.గత మహాయుతి ప్రభుత్వంలో శివసేనకు ఉన్న శాఖలను మార్చేందుకు కూటమిలో ప్రయత్నాలు జరుగుతున్నా యని మరో శివసేన ఎమ్మెల్యే ఆరోపించారు. కాగా శిందే నేతృత్వంలోని మునుపటి ప్రభుత్వంలో మాదిరిగానే ఎన్సీపీ తమ దగ్గరున్న ఆర్థిక శాఖను, భాజపా హోంశాఖను నిలబెట్టుకునే అవకాశాలు ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. శివసేనకు పట్టణాభివృద్ధి, రెవెన్యూ శాఖలు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం.288 శాసనసభ స్థానాలు ఉన్న మహారాష్ట్రలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఏకంగా 230 స్థానాలతో భారీ మెజార్టీ దక్కించుకుంది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటుపై కూటమిలో ప్రతిష్టంభన నెలకొంది. సీఎం ఎంపిక, శాఖల కేటాయింపులపై భాజపా, శివసేన, ఎన్సీపీల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. డిప్యూటీ సీఎం పదవికి అంగీకరించని ఏక్నాథ్ శిందే, హోంశాఖ కేటాయించాలని పట్టుబట్టినట్లు వార్తలు వచ్చాయి. మరోవైపు, సీఎంగా భాజపా నేతే ఉంటారని ముందునుంచీ ప్రచారం జరిగినా ఫడణవీస్ స్థానంలో ఇంకెవరినైనా తీసుకుంటారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కానీ, పార్టీ అధిష్ఠానం మాత్రం ఆయన వైపే మొగ్గు చూపింది. దీంతో ముఖ్యమంత్రిగా మూడోసారి ఆయన ప్రమాణస్వీకారం చేశారు.

# ఇండియా కూటమి చీఫ్‌గా మమత..?

## విపక్షంలో భిన్న స్వరాలు



డిల్లీ: కేంద్రంలోని ఎన్డీయే కూటమి ఓటమే లక్ష్యంగా ఏర్పడిన 'ఇండియా' కూటమిలో లుకలుకలు బయటపడుతున్నాయి. అవకాశం వస్తే ప్రతిపక్ష కూటమికి తాను సమర్థంగా నేతృత్వం వహిస్తానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించడంపై విపక్షంలో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. దీదీకి ఆ బాధ్యతలు అప్పగించడంపై కాం గ్రెస్ నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవు తోంది. మరోవైపు.. ఆమెకు సమాజ్వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) నేతలు మద్దతు తెలుపుతు న్నారు. దీంతో కూటమిలో గందరగోళ వాతా వరణం నెలకొంది."సీఎం మమతకు కూటమి బాధ్యతలు అప్పగిం చేందుకు మేం పూర్తి మద్దతు తెలుపుతున్నాం. ఎం దుకంటే.. ఆమె నేతృత్వంలోని టీఎంసీ పశ్చిమబెంగాల్లో భాజపాకు గట్టి పోటీ ఇస్తోంది. ఆ పార్టీని నిలువరించడంలో సమర్థంగా పని చేస్తోంది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై నేతలంతా సమగ్ర చర్చలు జరపాలి. ఆమెకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నాం" అంటూ సమాజ్వాదీ పార్టీ జాతీయ ప్రతినిధి ఉదయ్వీర్ సింగ్ పేర్కొన్నారు.

**ఓటమికి కాంగ్రెస్సే కారణం..** "హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి విజయం సాధించక పోవడానికి కారణం కాంగ్రెస్సే. ఆ రాష్ట్రాల్లో ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ తప్పిదాలకు బాధ్యత కూడా వారిదే" అని హస్తం పార్టీపై విరుచుకుపడ్డారు. మరోవైపు.. ఆర్జేడీ స్పందిస్తూ ఇండియా కూటమికి బిహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ సరైన రూపశిల్పి అవుతారని పేర్కొంది. అదే పాటిస్తాం.."కాంగ్రెస్ ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల్లో కూటమి భాగస్వాములకు చోటు కల్పించలేదు. లోక్సభ, అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ పార్టీ మిత్ర పక్షాల మాట విని ఉంటే ఫలితాలు భిన్నంగా ఉండేవి" అని సీపీఐ జనరల్ సెక్రటరీ డి. రాజా మండిపడ్డారు. మమతకు బాధ్యతలు అప్పగించడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. "మమత చెప్పినట్లు ఆమె పార్టీ నడుస్తుంది. అదే విధంగా మేము కూడా మా పార్టీ నిర్ణయాలనే పాటిస్తాం" అంటూ మనసులో మాట బయటపెట్టింది. ఈ పరిణామాలపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా స్పందించారు. "ఇండియా కూటమిలో టీఎంసీ అధినేత్రి ప్రధాన భాగస్వామి కావాలని కోరుకుంటున్నాం. ఆ స్థానంలో ఆమె కానీ, అరవింద్ కేజ్రీవాల్, శివసేన ఎవరున్న మేమంతా కలిసే ఉంటాం. ఈ విషయంపై మమతా బెనర్జీతో చర్చలు జరిపేందుకు త్వరలో కోల్కతా వెళతాం" అని పేర్కొన్నారు.

## గాజా ఆస్పత్రి పరిసరాలలో ఇజ్రాయెల్ దాడి

**వైమానిక దాడుల్లో నలుగురు వైద్యసిబ్బంది సహా 29 మంది మృతి**



గాజా : గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఉత్తర గాజాలోని అద్వాన్ ఆస్పత్రి పరిసరాల్లో ఇజ్రాయెల్వైమానిక దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో నలుగురు వైద్య సిబ్బంది సహా 29 మంది పాలస్తీనా వాసులు మృతి చెందినట్లు అక్కడి అధికారులు వెల్లడించా రు.

శిథి లాల కింద చిక్కుకొని చాలా మంది గాయపడ్డా రని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ దాడులతో సుమారు లక్షమంది పాలస్తీనియన్లు సరైన ఆహారం, వైద్య సదుపాయాలు లేక అలమటిస్తున్నారని పాలస్తీని యన్ సివిల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ పేర్కొంది. గాజా లోని ఆసు పత్రులో వైద్య సామగ్రి, మానవ వనరు ల కొరత అధికంగా ఉందని అక్కడి అరోగ్య శాఖ వెల్లడించింది.

ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటి వరకు 44,600 మంది పాలస్తీనియన్లు మరణించారని..అందులో మహిళలు, పిల్లలు అధికంగా ఉనాన్రని ఆవేదన వ్యక్తం చేసింది. ఓ వైపు ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా.. దాడులు మాత్రం తగ్గకపోవడం ఆందోళనకరంగా మారింది.

సూర్య



# త్యాగరాజ పంచరత్న కీర్తనలతో అలరించిన కళాకారులు..

**మంత్రముగ్ధులైన ప్రేక్షకులు, అభినందించిన ప్రముఖులు..**

**వైభవంగా కొనసాగుతున్న కృష్ణవేణి సంగీత నీరాజనం..**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: కృష్ణమ్మ ఒడ్డున పలువురు కళాకారులు కనకదుర్గమ్మకు గానామృతంతో నీరాజనాలు పట్టారు. త్యాగరాజ పంచరత్న కీర్తనలతో కళాకారులు అలరించారు. కృష్ణవేణి సంగీత నీరాజన పండుగ రెండవ రోజు దేవికృతులతో అత్యంత ఆనంద, ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. విజయవాడలోని కృష్ణానది ఒడ్డున ఉన్న పవిత్ర దుర్గాఘాట్‌లో శనివారం 25మందికి పైగా విజయవాడ కళాకారుల త్యాగరాజ పంచరత్నకీర్తనల ఆలాపనతో కర్ణాటక సంగీత గానామృతం ప్రవహించింది.కృష్ణవేణి సంగీత నీరాజనం ఉత్సవంలో ఈ కార్యక్రమం, ప్రముఖ సంత కవి త్యాగరాజ స్వామి రాసిన శాశ్వత కృతులకు నివాళిగా, ఆంధ్రప్రదేశ్ సంగీత సంపదను ప్రతిబింబిస్తూ ముగ్ధులను చేసింది.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కేఎస్ రామారావు హాజరై, ఈ కార్యక్రమానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను మరింత పెంచారు.

దుర్గాఘాట్ సేదతీరిన వాతావరణం ఈ గాన సమర్పణ ప్రేక్షకులకు సంగీత కళాకారులందరి హృదయాలను హత్తుకుంది కృష్ణవేణి సంగీత నీరాజనం ఉత్సవం భారతదేశం యొక్క వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వానికి ఒక ఘనోత్సవం, సంప్రదాయ కళల అభివృద్ధికి టూరిజం మంత్రిత్వ శాఖ అంకితభావాన్ని ప్రతిఫలిస్తోంది.

# దేశాన్ని క్షయరహితంగా మార్చేందుకు ఏపీ నుంచి పూర్తి సహకారం

- కేంద్రానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ భరోసా
- క్షయ నిర్మూలనకు "ని-క్షయ్ శివిర్: 100 డేస్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్"
- క్షయ వ్యాధి, మరణాల రేటును తగ్గించే లక్ష్యంతో '100 రోజుల ప్రచారం'
- 'ని-క్షయ్ శివిర్ 100 రోజుల ప్రచారం' కోసం విజయనగరం జిల్లా ఎంపిక
- ప్రచారం, క్షయ నిర్ధరణ పరీక్షల కోసం "ని-క్షయ్ వాహన్"లు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : భారతదేశాన్ని క్షయరహిత దేశంగా మార్చే లక్ష్యాన్ని చేరేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ పూర్తిగా సహకరిస్తుందని మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రారంభించిన "ని-క్షయ్ శివిర్: 100 డేస్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్" విజయవంతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని కేంద్ర ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాకు హామీ ఇచ్చారు. నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రామ్ కింద, "ని-క్షయ్ శివిర్: 100 డేస్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్"ను కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 347 జిల్లాల్లో ప్రారంభించింది. మన రాష్ట్రంలో విజయనగరం జిల్లాను ఈ ప్రచారం కోసం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా, కేంద్ర ఆరోగ్యం %á% కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సత్యకుమార్ యాదవ్తో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 25.52 లక్షల మంది టీబీ రోగులు ఉన్నారని, ప్రతి లక్ష మందికి 179 బాధితులు ఉన్నారని వెల్లడించారు. విజయనగరం జిల్లాలో "ని-క్షయ్ శివిర్: 100 డేస్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్"ను విజయవంతం చేయాలని మంత్రిని కోరారు. కేంద్ర మంత్రి విజ్ఞప్తిపై సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందించారు.రాష్ట్రాన్ని క్షయ రహితంగా మార్చేందుకు శాశ్వత నివారణ చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్లో 76, 590 మంది టీబీ బాధితులు ఉన్నారని చెప్పిన మంత్రి, క్షయ వ్యాధి, మరణాల రేటును గణనీయంగా తగ్గించేందుకు శక్తి వంచన లేకుండా పని చేద్దామని అన్నారు. "ని-క్షయ్ శివిర్: 100 డేస్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్" విజయవంతానికి పూర్తి స్థాయిలో సహకరించాలని అధికారులకు సూచించారు.

"ని-క్షయ్ శివిర్: 100 డేస్ ఇంటెన్సివ్ క్యాంపెయిన్"లో భాగంగా, వైద్య ఆరోగ్య శాఖ విజయనగరం జిల్లాలో పెద్ద సంఖ్యలో శిబిరాలు, విస్తృతంగా అవగాహన ప్రచారాలు నిర్వహిస్తుంది. క్షయ సోకేందుకు ఆస్కారం ఉన్నవారితో పాటు సాధారణ ప్రజలకు కూడా పరీక్షలు చేసి టీబీ కేసులు గుర్తిస్తుంది. మధుమేహం ఉండి 60 సంవత్సరాలు పైబడినవారికి, రోగులకు, ధూమపానం – మద్యపానం అలవాటు ఉన్నవారికి, గతంలో టీబీ నిర్ధరణ అయినవారికి –సన్నిహిత కుటుంబ సభ్యులకు, బీఎంఐ 18 కంటే తక్కువ ఉన్నవారికి టీబీ నిర్ధరణ పరీక్షలు చేస్తారు. వైద్య శిబిరాలు, ప్రచార కార్యక్రమాల నిర్వహణతో పాటు క్షయ నిర్ధరణ పరీక్షలు చేసేందుకు ప్రత్యేకంగా "ని-క్షయ్ వాహన్"లు ఏర్పాటు చేశారు. అక్కడికక్కడే ఛాతీ ఎక్స్రే తీయడానికి "ని-క్షయ్ వాహన్"లో పోర్టబుల్ ఎక్స్రే మెషీన్ ఉంటుంది. నాట్ టెస్టింగ్ కోసం కూడా "ని-క్షయ్ వాహన్"లో ఏర్పాట్లు ఉంటాయి. "ని-క్షయ్ శివిర్" విజయవంతానికి అన్ని ప్రభుత్వ శాఖలు, పరిశ్రమలు, పౌర సంఘాలు, ప్రైవేట్ ఆసుపత్రులు సహకరిస్తాయి, భాగస్వామ్యం తీసుకుంటాయి.

# బాధ్యత గల ఎంపీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారా?

**ఇలాంటి వారు మన నాయకులుగా చెలామణి కావడం దౌర్భాగ్యం**

**అక్రమ కేసులతో చంద్రబాబును ఒక్కసారి పంపినందుకే ప్రజలు ఛీ కొట్టారు**

**విజయసాయిపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపాటు**



అమరావతి: తాము అధికారంలోకి వచ్చే వరకు చంద్రబాబు నాయుడు బతికి ఉంటే... జైలుకు పంపుతామన్న వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యత గల ఎంపీ స్థానంలో ఉండి విజయసాయి రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు. సమాజంలో ఇలాంటి వారు నాయకులుగా చెలామణి కావడం ఏపీ ప్రజల దౌర్భాగ్యమని మండిపడ్డారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ కేసులతో మా చంద్రబాబును ఒక్కసారి జైలుకు పంపినందుకే రాష్ట్ర ప్రజలు ఛీ కొట్టారని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో వైసీపీని కేవలం 11 సీట్లకు పరిమితం చేసిన ఆ పార్టీ నాయకుల బుద్ధి మారలేదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ప్రజలు అధికారం ఇచ్చేది పగలు, ప్రతీకారాలు తీర్చుకునేందుకు కాదనే విషయం వైసీపీ నాయకులు గుర్తించాలని హితవు పలికారు. ఈ విషయం గుర్తించి ఉంటే కనీసం వైసీపీ కి ప్రతిపక్ష హోదా అయినా దక్కేదని అన్నారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే ఆశతో విజయసాయి రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని... అయితే ఆ పార్టీ అధికారంలోకి రావడం కేవలం కలలోనే సాధ్యమని మంత్రి గొట్టిపాటి దుయ్యబట్టారు. చంద్రబాబు నాయుడును విజయసాయి రెడ్డి క్రిమినల్ అని సంభోదిస్తున్నారని పేర్కొన్న మంత్రి.... అక్రమార్జన, అవినీతి, మనీలాండరింగ్ కేసుల్లో ఏ1, ఏ2గా ఉన్న జగన్ రెడ్డి, విజయసాయి రెడ్డీలే అసలు క్రిమినల్స్ అని పేర్కొన్నారు. వైసీపీ నాయకులకు వీలైతే ప్రజా సమస్యలపై ప్రజాక్షేత్రంలో పోరాటం చేయాలని కానీ... నోటికి వచ్చినట్లు ఎడాపెడా మాట్లాడితే ఆ 11 సీట్లు కూడా రావని గుర్తు చేశారు.

# రాబోయే ఐదు సంవత్సరాలలో రాష్ట్రం విద్యా హబ్‌గా అభివృద్ధి

- విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించి ఉన్నత స్థాయికి ఎదగాలి
- రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః రాబోయే ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని విద్యా హబ్‌గా అభివృద్ధి చేయడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ , టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవించి మంచి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం టీచర్స్, పేరెంట్స్ ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నేడు పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అనుసంధానం చేసే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం, బట్టలు, పుస్తకాలు, నాణ్యమైన విద్య అందించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాలన్నీ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక వారు సాధించే మార్కులు తదితర విషయాలపై దృష్టి సారించి తన పిల్లలు మంచి మార్గంలో నడిచే విధంగా చూడాలన్నారు. రాబోయే ఐదు సంవత్సరాలలో భారత దేశంలోనే మన రాష్ట్రం విద్యాభివృద్ధిలో నెంబర్ వన్ స్థాయికి ఎదిగే విధంగా రాష్ట్రాన్ని విద్య హబ్ గా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందని విద్యార్థులు బాగా చదివి తమ తల్లిదండ్రులకు తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి పొంచి ఉన్న వాన ముప్పు

**దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు**

**తమిళనాడు, శ్రీలంక తీరాలకు అలర్ట్**

**హెచ్చరికలు జారీ చేసిన అధికారులు**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః ఆంధ్రప్రదేశ్కు మరో ముప్పు పొంచి ఉంది. హిందూ మహా సముద్రంతో పాటు దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరోసారి ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో దక్షిణ బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ ఈ నెల 12వ తేదీలోపు తమిళనాడు, శ్రీలంక తీరాలకు చేరువవుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.దీని ప్రభావంతో ఈనెల 12వ తేదీన దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు. అల్పపీడనం ఏర్పడిన తర్వాతే దానిపై స్పష్టత వస్తుందని అంటున్నారు.

# లక్ష్యానికి దూరంగా ఆదాయం

- ఆశించిన స్థాయిలో పెరగని రిజిస్ట్రేషన్లు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధిః రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతున్నాయి. భారీ ఆదాయంపై ప్రభుత్వం ఆశలు పెరచుకున్నప్పటికీ అనేక ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు తగ్గిపోతుండటం చర్చనీయాంశంగా మారింది. ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖపట్నంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అమరావతిలో కొంత మెరుగ్గా ఉన్నా అదికూడా లక్ష్యాలకు అనుగుణంగా లేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.13,500 కోట్లవరకు ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. అయితే అక్టోబర్ వరకు రూ. 4,332 కోట్లు మాత్రమే వచ్చినట్లు సమాచారం. 2022–23లో 26 లక్షలకు పైగా రిజిస్ట్రేషన్లు జరగ్గా, ఈ ఏడాది అక్టోబర్ వరకు కేవలం 10 లక్షల వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లు చోటుచేసుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు రు. 5,168కోట్లు ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఇక జిల్లాల వారీగా చూస్తే రాష్ట్రంలోనే అతి పెద్ద నగరంగా ఉన్న విశాఖలో రిజిస్ట్రేషన్లు తిరోగమనంలో కనిపిస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో విశాఖ పరిధిలో రు. 1,526 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, సెప్టెంబర్ వరకు రు 747 కోట్లు వస్తాయని అంచనా వేశారు. అయితే కేవలం 58 కోట్లు మాత్రమే ఆదాయం రావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అదే గతేడాది సెప్టెంబర్ వరకు 134 కోట్లు సమకూరింది. అంటే గత ఏడాది కన్నా 56 శాతం తక్కువ ఆదాయం వచ్చినట్లు తేలింది. అమరావతి రాజధాని పరిధిలో గత ఏడాది 112 కోట్లు ఆదాయం సమకూరగా, ఈ ఏడాది 257 కోట్లు రావడం విశేషం.

**ఇతర రాష్ట్రాలతో పోల్చితే తక్కువే**

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో వచ్చిన ఆదాయాన్ని ఇతర రాష్ట్రాలతో పోల్చి చూస్తే తక్కువగానే కనిపిస్తోంది. గతేడాది జూన్కు, ఈ ఏడాది జూన్ వరకు ఆదాయాన్ని పరిశీలిస్తే రాష్ట్రం 23 శాతం మైనస్లో ఉంది. గత ఏడాది 2,403 కోట్లు రాగా, ఈ ఏడాది జూన్ వరకు 1,819 కోట్లు మాత్రమే వచ్చినట్లు తేలింది. కర్నాటక 35 శాతం, మహారాష్ట్ర 22 శాతం, తమిళనాడు 13 శాతం ఎక్కువ ఆదాయంతో ముందంజలో ఉన్నాయి.

**రిజిస్ట్రేషన్ల ద్వారా నెల వారీ వచ్చిన ఆదాయం వివరాలు (రూ. కోట్లలో)**

| నెల | 2023-24 | 2024-25 | నెల | 2023-24 | 2024-25 |
|---|---|---|---|---|---|
| ఏప్రిల్ | 669 | 663 | ఆగస్టు | 842 | 851 |
| మే | 937 | 583 | సెప్టెంబర్ | 816 | 570 |
| జూన్ | 797 | 573 | అక్టోబర్ | 292 | 352 |
| జూలై | 816 | 741. | **మొత్తం** | **5,169** | **4,333** |

# కాకినాడ సెజ్ బాధితులకు న్యాయం చేయండి

**సీఎంకు యనమల లేఖ**



అమరావతి: కాకినాడ సెజ్ బాధితులైన పేద బీసీ రైతులు, మత్స్యకారులకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు కు తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు లేఖ రాశారు. కాకినాడ సెజ్లో చిన్న రైతులు, మత్స్యకారుల నుంచి భూములు కొనుగోలు చేసిన పెద్ద కంపెనీలు లాభపడ్డాయని తెలిపారు. కేవీరావు తక్కువ ధరకు సెజ్లో భూమిని కొనుగోలు చేసి జీఎంఆర్ సంస్థలకు రూ.వందల కోట్లకు విక్రయించారని, తరువాత వైకాపా అధినేత జగన్ ) బినామీ అయిన అరబిందోకు దాదాపు రూ.4వేల కోట్లకు అమ్మారని ఆరోపించారు. కాకినాడ పోర్టు ద్వారా లబ్ధి పొందిన వాటిల్లో దివీస్ కూడా ఒకటని యనమల రామకృష్ణుడు వెల్లడించారు.

భూమిని కోల్పోవడంతోపాటు, సముద్ర, వాయు కాలుష్యం వల్ల పేదలైన బీసీ వర్గాలు ఈ వ్యవహారంలో తీవ్రంగా నష్టపోయాయని యనమల తెలిపారు. సెజ్ కోసం దాదాపు 10వేల ఎకరాలు కోల్పోయిన వీరి సమస్యలు నేటికీ పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. కోన అటవీవాసులకు అనుకూలంగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించకుంటే, వారు సమస్యల కోసం నిరంతరం పోరాడాల్సి వస్తుందన్నారు. వీరి సమస్యల పరిష్కారానికి ఇప్పటికే చెన్నైలోని ఎన్జీటీ, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, ఏపీ పొల్యూషన్ బోర్డులకు లేఖలు రాశానని యనమల వెల్లడించారు. పేదల నుంచి తక్కువ ధరకు బలవంతంగా భూములు కొనుగోలు చేసింది వైకాపా నేతలేనని ఆరోపించారు. వైకాపా ప్రభుత్వంలోని మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు రైతుల్ని మోసం చేసిన వారిలో ఉన్నారని తెలిపారు. సమగ్ర విచారణ జరిపించి ప్రభుత్వం ఆ భూములను అసలు రైతులకు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కబ్జా భూములు కావడంతో అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయవచ్చన్నారు.

# ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్యనే!

- హైదరాబాద్ నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవ రావ్
- సమాజానికి తిరిగి ఇవ్వాలి : విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య
- ప్రపంచం ఎదురుచూస్తోంది : విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు
- విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2వ స్నాతకోత్సవం



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం ఏదైనా ఉందంటే అది ఒక్క విద్యతోనే సాధ్యమని హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవ రావ్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ లెర్నింగ్, ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో ఎంసీఏ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు 2వ స్నాతకోత్సవాన్ని శనివారం వర్సిటీ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవ రావ్ మాట్లాడుతూ దేశానికి నైపుణ్యమైన, జ్ఞానవంతమైన ప్రతిభను కలిగిన విద్యార్థులను అభివృద్ధి చేయడంలో విజ్ఞాన్స్ విశ్వవిద్యాలయం చేస్తున్న కృషి గర్వకారణమన్నారు. విద్య అనేది ఒక చిన్న జిజ్ఞాస లేదా లక్ష్యంతో మొదలై... జ్ఞానం, సామర్థ్యాల వంటి పెద్ద వృక్షంగా పెరుగుతుందన్నారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చెప్పినట్లుగా "జ్ఞానం సృజనకు దారి తీస్తుంది. సృజన ఆలోచనకు దారి తీస్తుంది. ఆలోచన జ్ఞానానికి దారి తీస్తుంది. జ్ఞానం నిన్ను గొప్ప వ్యక్తిగా మార్చుతుంది." అదే విధంగా మీరు జ్ఞానం, నైపుణ్యాలను ఉపయోగించి సమాజానికి సేవ చేయాలన్నారు. మహాత్మా గాంధీ మరియు స్వామి వివేకానంద వంటి మహనీయులు నైతికత, నిజాయితీ ప్రాముఖ్యతను నిరూపించారు. మీరు కూడా చేసే ప్రతీ పనిలో ఉన్నత నైతిక ప్రమాణాలను పాటించాలని పిలుపునిచ్చారు. మీ విజయాన్ని కేవలం వ్యక్తిగత సాధనలతో కాకుండా సమాజంపై మీ ప్రభావంతో కొలవాలన్నారు. మీ విద్యను ఉపయోగించి అవసరమున్న వారికి సహాయం చేయాలని విద్యార్థులను కోరారు. మీరు పొందిన డిగ్రీ జీవితంలో ఒక మైలురాయి మాత్రమేనని, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడానికి మీలో ఆసక్తి, ప్రేరణ నిరంతరం ఉండాలన్నారు. విజ్ఞాన్ విశ్వవిద్యాలయం మీకు అందించిన జ్ఞానం సమాజం మొత్తం అభివృద్ధికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

**ం 860 మంది విద్యార్థులకు డిగ్రీలు అందజేత :** విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2వ స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 860 (ఎంబీఏ%–%670, ఎంసీఏ%–%190) మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసామని తెలిపారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలల్లో మాత్రమే విద్యను అభ్యసించాలనే అవసరం లేదని, 'ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా' అనే ఆలోచనతో వచ్చిందే 'డిస్టెన్స్ మరియు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్' విధానమన్నారు. ఇది మానవాళిని విప్లవాత్మకంగా ఎదగడానికి కారణమవుతోందన్నారు. నిపుణులు మాత్రమే సమాజానికి ప్రగతిని అందించగలరు. ఈ నేపథ్యంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ తీసుకున్న డిస్టెన్స్ మరియు ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రారంభానికి సంబంధించిన కృషి నిజంగా అభినందనీయమన్నారు. డిస్టెన్స్ విద్యార్థులు తమ త్యాగాలు, క్రమశిక్షణ, నిరంతర పట్టుదల. ఆత్మవిశ్వాసంతో ఈ లక్ష్యాన్ని సాధించగలిగారన్నారు. అవసరాల నడుమ వారు తమ సమయాన్ని విద్య కోసం కేటాయించి ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారని కొనియాడారు. వారి అనుభవాలు, వారు పొందిన కొత్త జ్ఞానం జీవితాన్ని మెరుగుపరచడంలో ఉపకరిస్తాయన్నారు. ఇది 'ట్రాన్స్‌ఫర్ లెర్నింగ్' అనే భావనకు ఆధారంగా ఉంటుందన్నారు. మీరు సాధించిన విజయం మీ ఆత్మవిశ్వాసాన్ని, నిబద్ధతను ప్రతిబింబిస్తుందని.. ఎప్పుడూ మీ లక్ష్యాన్ని నమ్మి అది చేరే వరకు అవిశ్రాంతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**సమాజానికి తిరిగి ఇవ్వాలి : విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

విద్య ఒక ప్రత్యేకాధికారం మాత్రమే కాకుండా సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన బాధ్యతను కలిగి ఉందనే విషయాన్ని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య గుర్తుచేశారు. ఎంబీఏ చదవడం ఎప్పుడూ సులభం కాదు. అటువంటిది ఆన్‌లైన్‌లో ఎంబీఏను చేయడమంటే మరింత నిబద్ధతను కోరుతుందన్నారు. పనులు, కుటుంబం, వ్యక్తిగత జీవితం మధ్య కఠినమైన విద్యా ఆవశ్యకతలను సంతులనం చేయడం చిన్న విషయం కాదన్నారు. మీ కృషి మీకు కేవలం ఒక అర్హతనే కాకుండా మీ నైపుణ్యాలను మెరుగుపరచడం, మీ వృత్తిపరమైన దృష్టికోణాన్ని మలుపు తిప్పడం జరుగుతుందన్నారు. ఈ డిగ్రీ మీకు కొత్త అవకాశాలను తెరవడం, నాయకత్వ భూమికలను చేపట్టడానికి శక్తినిచ్చే సాధనంగా ఉపయోగపడుతుందన్నారు. వ్యాపార ప్రపంచం టెక్నాలజీ, స్థిరత్వం, ఆవిష్కరణల ద్వారా ఎన్నడూ లేని వేగంతో అభివృద్ధి చెందుతోందన్నారు. అదేవిధంగా మీరందరూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు తోడ్పడటం ద్వారా సమాజానికి మేలు చేయడం పట్ల దృష్టి కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రయాణంలో మీకు మద్దతు అందించిన మీ కుటుంబసభ్యులకు, ఉపాధ్యాయులు, స్నేహితులకు కృతజ్ఞతలు తెలపాలన్నారు.

**ప్రపంచం ఎదురుచూస్తోంది : విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు**

జీవితంలో సవాళ్లు వస్తాయి... కానీ వాటిని అవకాశాలుగా చూడండి. నైతిక విలువలతో ముందుకు సాగండి. మీరు సృష్టించే మార్గం కోసం ప్రపంచం ఎదురుచూస్తోంది. మీ నడతతో దాన్ని కొత్త పుంతలు తొక్కించండని విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. వ్యక్తిగత జీవితంలో వివధ రకాల బాధ్యతలు, ప్రతికూలతలను ఎదుర్కొంటూనే ఆన్‌లైన్‌లో డిగ్రీ కోర్సును పూర్తి చేయడంలో మీరు చూపిన అచంచలమైన నిర్ణయం మరియు కట్టుబాటుకు అభినందనలు తెలియజేశారు. ఈ ప్రయాణంలో మీరు కేవలం మీ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు మారుతూ ఉండే ప్రపంచంలో నాయకులుగా ఎదగడానికి అవసరమైన మనోధైర్యాన్ని మరియు స్వభావాన్ని కూడా అభివృద్ధి చేసుకున్నారని కొనియాడారు. విద్య అనేది కేవలం సూత్రాలను మాత్రమే కాకుండా మనుషులను అర్థం చేసుకోవడం, సవాళ్లను ఎదుర్కోవడం, సమాజానికి పరిష్కారాలను సృష్టించడం గురించి కూడా ఉంటుందన్నారు. మీరు ఎల్లప్పుడూ నీతి, నిజాయితీ, సమగ్రతలను పాటిస్తూ వ్యక్తిగత మరియు వృత్తిపరమైన జీవితంలో పైకి ఎదగాలని ఆకాంక్షించారు. విజయానికి డబ్బు వెంట పరుగెత్తడమే మంచిదంటూ ఒక సామాన్య భావన ఉంది. కానీ అది నిజానికి విరుద్ధమని, రతన్ టాటాయే ఈ విషయానికి గొప్ప ఉదాహరణని తెలియజేసారు. ఆయన సంపదను సమాజానికి అందజేస్తూనే తన సూత్రాలను ఎప్పుడూ తాకట్టు పెట్టలేదన్నారు. రతన్ టాటా కేవలం ప్రసిద్ధ పారిశ్రామికవేత్త మాత్రమే కాదని... అతని వినయం, మనోధైర్యం, లక్ష్యంతో నడిచే నాయకత్వానికి నిజమైన ప్రాతినిధ్యమన్నారు. టాటా స్టీల్‌లో చిన్న కార్మికుడిగా పని ప్రారంభించిన రతన్ టాటా, ప్రతిభను, కృషిని నమ్ముకుని ఉన్నత స్థానాలకు ఎదిగారన్నారు. టాటా గ్రూప్‌ను గ్లోబల్ పవర్‌హౌస్‌గా మార్చడంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు, మన దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆర్థిక విజయాలను దాటి, ఆయన సామాజిక సేవకు చూపిన నిబద్ధత ప్రత్యేకమని కొనియాడారు. తక్కువ ధరల్లో రవాణా కోసం టాటా నానో, శుభ్రమైన త్రాగునీటికి టాటా స్వచ్, విద్య, ఆరోగ్యం, విపత్తుల సహాయం వంటి రంగాల్లో ఆయన చేసిన దాతృత్వం అసమానమైనవని కొనియాడారు. ప్రియమైన పట్టభద్రులారా.... మీరు ఇప్పుడు వృత్తి ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నారు. రతన్ టాటా గారి నుండి స్ఫూర్తి పొందండి. మీ డిగ్రీ ఒక అర్హత మాత్రమే కాదు. ఇది ఒక బాధ్యత. మీ విశ్లేషణాత్మక నైపుణ్యాలు, వ్యూహాత్మక ఆలోచన మరియు సృజనాత్మకతను ఉపయోగించి సమాజంపై మంచి ప్రభావం చూపండి. మీ నిర్ణయాలకు కరుణ మరియు సమగ్రత మార్గదర్శకంగా ఉండాలని పిలుపునిచ్చారు.

**అంబరాన్నింటిన సంబరం :** డిగ్రీలు చేతబట్టుకున్న వేళ విద్యార్థుల సంబరం అంబరాన్ని అంటింది. కేరింతలతో వర్సిటీ ప్రాంగణమంతా హోరెత్తిపోయింది. విద్యార్థులందరూ గుర్తుగా సెల్ఫీలు దిగారు. దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ప్రతిన బూనారు. విద్యార్థులంతా తలపాగా, కండువా వేసుకుని అచ్చతెలుగు సంప్రదాయాన్ని ప్రదర్శించారు. సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూనే సాంకేతిక విద్యా సర్టిఫికెట్లను పొందారు.

కార్యక్రమంలో హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణ దేవ రావ్, విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ , రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, బోర్డు ఆఫ్ మేనేజిమెంట్ సభ్యులు, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు, అకడమిక్ కౌన్సిల్, ఆయా విభాగాల డీన్లు, సీడీఓఈ డైరక్టర్లు, స్నాతకోత్సవ కన్వీనర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# త్వరలో ఆంధ్ర యూనివర్సిటీ పై కీలక ప్రకటన..

**ఏయూ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేష్..**

**ఏయూని ఐదేళ్లలో టాప్ 3లోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు..**

**ప్రపంచ స్థాయిలో యూనివర్సిటీని టాప్ యూనివర్సిటీలో ఒకటిగా ఉంచాలన్నారు..**



విశాఖపట్నం : త్వరలో ఆంధ్ర యూనివర్సిటీకి సంబంధించిన ఒక కీలక ప్రకటన చేస్తామన్నారు మంత్రి నారా లోకేష్.. ఏయూ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన.. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. అధికారంలోకి వచ్చాక విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాను.. చాలామంది అన్నారు విద్యా శాఖ చాలా కష్టమని.. అయినా ఇష్టపడి తీసుకున్నానని తెలిపారు.. ఇక, ఆంధ్ర యూనివర్సి టీని ఐదేళ్లలో టాప్ 3లోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.. ప్రపంచ స్థాయిలో ఆంధ్ర యూనివర్సిటీని టాప్ యూనివర్సిటీలో ఒకటిగా ఉంచాలన్నారని తెలిపారని గుర్తుచేసుకున్నారు.. 434 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం విజ్ఞానం, విద్యా నైపుణ్యానికి ఒక వెలుగు వెలిగింది.. ఈ రోజు వరకు దాదాపు 3 లక్షల మంది విద్యార్థులకు సేవలందించడం ద్వారా మన రాష్ట్రానికే కాకుండా మన దేశానికి మేధో శక్తి అందించే సామర్థ్యంతో అపారంగా దోహదపడింది.అనేక మంది ప్రముఖులు వారి విజయాలకు నిదర్శనం ఈ విశ్వవిద్యాలయం అన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం విశిష్ట విజయాలు సాధించినందుకు నేను అభినందిస్తున్నాను అన్నారు మంత్రి లోకేష్.. విద్యా ప్రపంచానికి ఇది అపురూపమైన సేవలను అందించినప్పటికీ, ఇటీవలి కాలంలో కీర్తి ప్రతిష్ఠలు గణనీయంగా తగ్గిపోయాయి ..ఎన్ఐఆర్ఎఫ్ యూనివర్శిటీ ర్యాంకింగ్లు 2019లో 16వ స్థానం నుండి 2024లో 25వ స్థానానికి క్షీణించాయి. మొత్తం విభాగంలో 29 నుండి 41కి పడిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.. ఆంధ్ర యూనివర్శిటీ గత వైభవాన్ని తిరిగి పొందడమే కాకుండా, భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని టాప్ 100లో అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలలో ఒకటిగా అవతరించడం ద్వారా ప్రపంచ స్థాయి గొప్ప విద్యాసంస్థగా అవతరించాలని నేను కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు.. ఆంధ్ర యూనిర్సిటీ పూర్వ వైభవం తీసుకు రావడానికి ఒక సలహా మండలిని ఏర్పాటు చేస్తాం.. ఆంధ్ర యూనివర్సిటీని బలోపేతం చేయడానికి ఇండస్ట్రీ కనెక్ట్ కూడా ఒక కీలకమైన చర్యగా పేర్కొన్నారు.. ఈ విశ్వవిద్యాలయం పునరుద్ధరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉంది. విద్యాశాఖ మంత్రిగా విద్యను కేజీ నుంచి పీజీకి మార్చేందుకు కట్టుబడి ఉన్నాను.. యూనివర్శిటీలకు సరిపడా సిబ్బంది ఉండేలా తగిన సిబ్బంది నియామకం, నియామక ప్రక్రియను వేగవంతం చేయనున్నాం.. బహుళ వనరుల నుండి మద్దతుతో, ప్రపంచ స్థాయి సదుపాయంతో గ్లోబల్ ఇంక్యుబేషన్ హబ్గా మారడానికి ఆంధ్ర యూనివర్సిటీ ఒక కృత్రిమమైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ను ఏర్పాటు చేయాలని మేము కోరుకుంటున్నానని తెలిపారు మంత్రి నారా లోకేష్..



# కట్టా నరసింహా రెడ్డి పాలనకు మళ్ళీ తెర లేపిన ఇంచార్జీ వీసీ బాలకిష్టా రెడ్డి

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్టా రెడ్డి జేయన్టీయుహెచ్ యూనివర్సిటీ ఇంచార్జి వైస్ ఛాన్సలరుగా వచ్చి రాగానే మళ్ళీ ఛార్జ్ తీసుకున్న రోజునే రాజ భోగాలు మొదలు పెట్టారు దాదావు 6 నెలలు బుర్ర వెంకటేశం వైస్ ఛాన్సలర్ గా ఉన్న ఏ నాడు కుడా ఇలా భోజనాలు విందు వినోదాలు చేయని వీళ్ళు మళ్ళీ ఒక ప్రొఫెసర్ ఇంచార్జి వైస్ ఛాన్సలర్ గా వచ్చి రాగానే భోజనాలు అని విందులు అని మొదలు పెట్టారు. జె యన్ టీ యూ అంటే అందరికి అందుకే మక్కువ ఎక్కువ బంగారు బాతు లాగ వాడుకోవడం తప్ప ఇంక ఒక ఆలోచన లేకుండా పోయింది.

ఇలా ఇష్టం వచ్చినట్లు విందులు వినోదాలకు లక్షలు దారపోయకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని బాలకిష్టా రెడ్డికి గత వీసీ లాగా అవినీతికి పాల్పడకుండా జాగ్రత్తగా ఇంచార్జి వైస్ ఛాన్సలర్ గా విధులు నిర్వహించాలే తప్ప ఇలా విందులు వినోదాలు కాదు అని హెచ్చరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాము.

యూనివర్సిటీలో ఏళ్ల తరబడి ఆచార్యులు అదనపు పదవుల్లో కొనసాగుతూ విద్యా బోధనకు దూరమయ్యారు. అతిథి అధ్యాపకుల చేత కాలం వెళ్ళ వుచ్చుకోవడం వల్ల విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందక తీవ్రంగా నష్టపోతున్నారని యూనివర్సిటీ విద్యార్థులు విద్యార్థి సంఘాలు ఆరోపణలు చేస్తున్నారు. రెగ్యులర్ వీసీని తక్షణమే ప్రకటించి వైస్ ఛాన్సలర్ యూనివర్సిటీ నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీపై కన్నేసి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.



# తెలంగాణలో కమల వికాసం ఖాయం

● కాంగ్రెస్ టిఆర్ఎస్ ఒకటే ● అబద్ధాలతో అధికారంలోకి ● ఆరు గ్యారెంటీలు అమలు ఏమయ్యాయి ● కళ్యాణ లక్ష్మి, తులం బంగారం ఏమైంది ● కాంగ్రెస్ పార్టీ స్వలాభం కోసం పనిచేస్తుంది ● రేవంత్ సర్కార్ ఏడాదిగా ప్రజలను మోసం చేస్తుంది ● రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారు ● కాంగ్రెస్ ప్రభుత్వం పై బిజెపి జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా ఫైర్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. శనివారం నాడు సరూర్నగర్లోని బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో జేపీ నడ్డా పాల్గొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. శనివారం సరూర్నగర్లోని బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో జేపీ నడ్డా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. అబద్ధాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందన్నారు. ప్రజల వికాసానికి బీజేపీ పని చేస్తుందని చెప్పారు నడ్డా. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అన్న నడ్డా.. లోక్సభ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనం అని పేర్కొన్నారు. విపక్షాలన్నీ ఏకమైనప్పటికీ మూడోసారి మోదీని గెలిపించారన్నారు. 70 ఏళ్లుగా ప్రభుత్వ వ్యతిరేకత గురించి వింటూ వచ్చామని.. మోదీ పాలనపై మాత్రం ఇంత వరకూ ఆ మాట లేదని నడ్డా చెప్పుకొచ్చారు. తెలంగాణలో మార్పు బీజేపీతోనే సాధ్యం అన్నారు. ఎన్నికలు ఎక్కడ జరిగినా బీజేపీ గెలుస్తోందన్నారు. తెలంగాణలో మార్పు బీజేపీతోనే సాధ్యం అన్నారు నడ్డా. ఎన్నికలు ఎక్కడ జరిగినా బీజేపీ గెలుస్తోందన్నారు. బీజేపీ ఒంటరిగా 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉందని గుర్తు చేశారు. బీజేపీతో నేరుగా తలపడ్డ ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలవలేదన్నారు. ప్రాంతీయ పార్టీల సహకారంతోనే కాంగ్రెస్ గెలుస్తూ ఉంటుందని నడ్డా ఎద్దేవా చేశారు. ఇతర పార్టీల బలహీనతలే కాంగ్రెస్ బలం అని అన్నారు. అబద్ధపు హామీలతో కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు.

సీఎం రేవంత్పై షాకింగ్ కామెంట్స్..: ఈ సందర్భంగా సీఎం రేవంత్పై జేపీ నడ్డా సంచలన కామెంట్స్ చేశారు. రేవంత్ గుర్తుపెట్టుకో.. కాంగ్రెస్ ఒక పరాన్నజీవి అని వ్యాఖ్యానించారు. హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఏడాదిగా ప్రజలను కాంగ్రెస్ మోసం చేస్తూనే ఉందని విమర్శించారాయన. ఆటో డ్రైవర్లకు ఇస్తామన్న ఏడాదికి రూ. 12 వేలు ఏమయ్యాయని జేపీ నడ్డా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. మాయలఫకీర్లా డ్రామాలాడుతున్నారంటూ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రైతు భరోసా, రైతు కూలీలకు రూ. 12 వేలు ఇస్తామన్నారని.. అవి ఎటుపోయాయని ప్రశ్నించారు కేంద్ర మంత్రి. విద్యా భరోసా ఏది.. మహిళలకు రూ. 2,500 ఇస్తామన్నారు అది ఏది.. కళ్యాణలక్ష్మి ద్వారా రూ. లక్ష, తులం బంగారం అన్నారు.. అది ఎక్కడికి పోయింది.. అని కాంగ్రెస్ సర్కార్ను జేపీ నడ్డా నిలదీశారు.

# తప్పుడు వార్తలను ఖండిస్తున్నాం

● స్వామి దేవస్థానంలో కోడెలను విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదు ● భక్తులు సమర్పించిన కోడెల సంఖ్య పెరుగుతుంది ● ప్రభుత్వంపై బురదజల్లే రీతిలో కుట్రలు ● తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం ● మంత్రి కొండా సురేఖ



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని కోడెలను అక్రమంగా విక్రయించినట్లు వచ్చిన వార్తల్లో నిజంలేదని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖ తేల్చి చెప్పారు. ప్రభుత్వం పై బురదజల్లే రీతిలో కుట్రపూరితంగా ప్రచారమవుతున్న తప్పుడు వార్తలను మంత్రి సురేఖ ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు సమర్పించిన కోడెల సంఖ్య పెరుగుతుండటంతో కోడెల నిర్వహణ భారంగా మారి చాలా కోడెలు మరణించిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో భక్తుల విన్నపాల మేరకు మొక్కుల రూపంలో భక్తులు సమర్పించిన కోడెల నిర్వహణ నిమిత్తం విధివిధానాలను రూపొందించేందుకు ఆరు నెలల క్రితం మేలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ చైర్మన్ గా, వేములవాడ ఆలయ ఈవో కన్వీనర్ గా, పలువురు ఇతర సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటి మార్గదర్శకాలను రూపొందించినట్లు మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ మేరకు జీవో విడుదల చేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ఈ మార్గదర్శకాల ప్రకారం పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, సంబంధిత మండల అగ్రికల్చర్ ఆఫీసర్ ధ్రువీకరణ పత్రం వుంటేనే పంపిణీ చేస్తున్నట్లు మంత్రి సురేఖ గుర్తు చేశారు. ధ్రువీకరణ పత్రాలు నిబంధనలకు అనుగుణంగా వుంటేనే ఒక రైతుకు రెండు కోడెల చొప్పున మాత్రమే ఇస్తున్న విషయాన్ని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కోడెల సంరక్షణ కోసం గోశాలలో సిసి ఫ్లోరింగ్, సరిపడా షెడ్లు, తాగునీటి వసతి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు మంత్రి సురేఖ వివరించారు. మూగజీవాల పై తమ ప్రభుత్వానికున్న శ్రద్ధ అటువంటిది మంత్రి అన్నారు. ఎంతో నిబద్ధతతో గోశాలల నిర్వహణ, గోవుల సంరక్షణను చేపడుతున్న పరిస్థితుల్లో కోడెలను అక్రమంగా విక్రయించారని వచ్చిన వార్తలు వట్టి వుకార్లను మంత్రి సురేఖ కొట్టి పారేశారు. సాధారణంగా తన వద్దకు వచ్చే దరఖాస్తులను పరిశీలించమని సంబంధింత అధికారులకు సూచిస్తుంటామని, కోడెల పంపిణీకి సంబంధించి వచ్చిన దరఖాస్తులను అదే విధంగా పంపించామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. దేవస్థానం అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే రైతులకు కోడెలను పంపిణీ చేసారని మంత్రి వునరుద్ఘాటించారు. ఇందులో ఎలాంటి అవకతవకలు, అక్రమాలు జరగలేదని మంత్రి సురేఖ తేల్చి చెప్పారు. వేములవాడ రాజరాజేశ్వర దేవస్థానంలోని ప్రతి కోడెకు శాశ్వతమైన ట్యాగ్ వుంటుందని, అటువంటి ట్యాగ్ లున్న కోడెలు ఎక్కడా పట్టుబడలేదని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి నిజానిజాలను వెల్లడిస్తూ నిన్న వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థాన ఈవో స్పష్టతనిచ్చిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. ప్రభుత్వం హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నదని అవాస్తవ ప్రచారం చేస్తూ, సమాజంలో అశాంతిని సృష్టించే అసాంఘిక శక్తులను వెలికితీసి, చట్టపరంగా చర్యలు చేపడతామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.



# అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ సర్కార్ బందీ

● భాగ్యనగర్ ను మరో బంగ్లాదేశ్ గా మార్చే కుట్ర ● రేవంత్ ను జనం సీఎంగా గుర్తించడం లేదు ● ఏ సర్వేలో చూసినా కాంగ్రెస్ ది మూడో స్థానమే ● కాంగ్రెస్ సర్కార్ కు సంక్రాంతి వరకు డెడ్ లైన్ ● ఆలోపు 6 గ్యారంటీలను అమలు చేయకుండా గ్రామాల్లో తిరగనీయం ● కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

తెలంగాణ బ్యూరో ప్రతినిధి:అర్బన్ నక్సల్స్ చేతిలో రేవంత్ రెడ్డి సర్కార్ బందీగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బంగ్లాదేశ్ లో మాదిరిగా భాగ్యనగర్ లోనూ హిందూ దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. పరిస్థితి ఇట్లానే ఉంటే భాగ్యనగర్ మరో బంగ్లాదేశ్ గా మార్చే కుట్రలకు తెరదీశారని అన్నారు. భాగ్యనగర్ ప్రజలారా... స్వామి వివేకానంద, బాబాసాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా వూలే, కొమరం భీం, సేవాలాల్ మహారాజ్ లా మారతారా? లేక నక్సలైట్లుగా మారతారా? ఆలోచించండిఅని కోరారు. రేవంత్ రెడ్డి వాడుతున్న భాష, ఆడుతున్న అబద్దాలను చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలెవరూ ఆయనను సీఎంగా గుర్తించడం లేదన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ కూ మూడో స్థానం తథ్యమన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎగిరేది కాషాయ జెండాయేనని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనా వైఫల్యాలపై ఈరోజు బీజేపీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభకు విచ్చేసిన బండి సంజయ్ ఈ సందర్భంగా కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలను తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. బీజేపీ చల్లబడిందని ప్రచారం చేసే వాళ్ల చెంప చెళ్లుమన్పించండి. బీఆర్ఎస్ తూట్ పాలిష్ నాయకుల లెక్క బీజేపీ కార్యకర్తలుండరు. బీఆర్ఎస్ కార్యకర్తలు, క్యాడర్ బయటకు రావడం లేదు. బీజేపీ కార్యకర్తలు ఫైర్ బ్రాండ్స్ఇగ కాంగ్రెస్ సంగతి చెప్పనక్కర్లేదు. రేవంత్ రెడ్డి ఎన్నడైనా ప్రజా సమస్యలపై పోరాడిండా? రైతుల కోసం, మహిళల కోసం, నిరుద్యోగుల కోసం కొట్లాడిండా? వాళ్ల కోసం ఎన్నడైనా జైళ్లకు పోయిండా? మహా అంటే ఓటుకు నోటు కేసు తప్ప ఆయనపై ఉన్న కేసులేంది? కానీ బీజేపీ కార్యకర్తలు ఏనాడూ కాషాయ జెండా వీడలేదు. పోరాటాలను ఆపలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే తెలంగాణలో వికసించేది కమలమే. ఒక సెక్షన్ మీడియా, టీవీ ఛానళ్లు రేవంత్ రెడ్డి పక్షాన ఉన్నాయని, ఏదో సొంత డబ్బా కొంటుకున్నరు. ఏ సర్వే చూసినా కాంగ్రెస్ ది మూడవ స్థానమే. రేవంత్ రెడ్డి భాష, నడవడిక చూసి జనం నవ్వుకుంటున్నారు. సీఎంగా గుర్తించడం లేదు. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు చేయలే. ఏమైనా అంటే ఫ్రీ బస్సు, ఫ్రీ గ్యాస్, ఫ్రీ కరెంట్ అని కోతలు పెట్టడం తప్ప ఆయన సాధించిందేమిటి? ఈ వేదిక సాక్షిగా మేం అడిగే ప్రశ్నలకు మీరు సమాధానం చెప్పండి. ఇంకా 22 లక్షల మంది రైతులకు రుణమాఫీ అమలు చేయనిది నిజమా? కాదా? వ్యవసాయ మంత్రే ఇది నిజమని ఒప్పుకున్నది వాస్తవం కాదా? రైతులకు ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ఎగ్గొట్టింది నిజం కాదా? తాలు, తరుగు, తేమతో పనిలేకుండా వడ్లు కొంటామని మాట తప్పింది నిజం కాదా? బోనస్ పేరుతో రైతులను వంచించింది మీరు కాదా అని ప్రశ్నించారు.

# రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసిన కెసిఆర్

● జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం ● 2 లక్షల రుణమాఫీతో దేశం దృష్టి సారించిన తెలంగాణ ● మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇస్తామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ కమిటీ ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఆసియాలో అతిపెద్ద కాలనీగా పేరుందిన కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో టెంపుల్ బస్ స్టాప్ లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ విజయోత్సవ సభా కార్యక్రమానికి హరివర్ధన్ రెడ్డి,కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత.. కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ ల హామీతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అయితే గత ప్రభుత్వం కేసీఆర్ హయంలో ఆర్థిక విధ్వంసం చేసిందన్నారు. ప్రజల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుంటే భారత రాష్ట్ర సమితి భారతీయ జనతా పార్టీలు ఏకమై అడ్డుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రెండు లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం దేశం దృష్టిని ఆకర్షించింది అన్నారు. బిజెపి బీఆర్ఎస్ ఒక్కటేనని చీకట్లో ఒప్పందాల కుదుర్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ సర్వతో ముఖాభివృద్ధికి కృషిలో భాగంగా మూసి ప్రక్షాళనతో హైదరాబాద్ నగర ఖ్యాతిని పెంచడంతోపాటుకార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత రంగారెడ్డి, నల్గొండ జిల్లా రైతులకు మేలు చేసే కార్యక్రమాన్ని చేపడితే బిజెపి బీఆర్ఎస్ లు అడ్డుకుంటున్నాయని విమర్శించారు.

ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన మూసి అభివృద్ధి ప్రక్షాళన ఆగదని అన్నారు. 6 గ్యారంటీలను అమలు చేసి రాష్ట్రంలో ఉన్న నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతారని ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో జరిగే ఏ స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మ్రోగిస్తుందన్నారు. ప్రజలు ప్రతిపక్షాల దురుద్దేశ పూరిత విమర్శలకు ఆకర్షితులై వారి మాటలు నమ్మితే నష్టపోతారన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల సంక్షేమాన్ని కృషి చేస్తుందన్నారు. కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. ఇప్పటికే మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణంతోపాటు పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు.

కార్యక్రమంలో.... టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణా రాజ్ వుత్, ఫణీంద్ర కుమార్, సంజీవరావు, మేకల మైకల్, పొడుగు అప్పారావు, సంధ్య, ర్మేశ్మ, జోజమ్మ, 114 డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రంగ స్వామి, శివ చౌదరి, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, బుచ్చి మల్లి, బాల్నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సోను, శ్రీధర్ చారి, రాజు ముదిరాజ్, గిరి నాయుడు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టాలి

● దేశ వ్యాప్తంగా కులగణన చేయాలి ● పంచాయతీరాజ్ ఎన్నికలలో బి.సి.లకు 42% కేటాయించాలని పెద్దయెత్తున ఆందోళనకు హెచ్చరిక ● బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: పార్లమెంటులో బి.సి బిల్లు పెట్టాలని, దేశ వ్యాప్తంగా కులగణన చేయాలని, పంచాయతీరాజ్ ఎన్నికలలో బి.సి లకు 42% కేటాయించాలని, దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని బి.సి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. భువనగిరి ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ప్రసంగిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒకే రోజులో బిల్లు పెట్టి ఆఘ-మేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు పెట్టారు. కాని బి.సి లకు చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని 30 సం.రాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ దేశంలో బి.సి లను బిచ్చగాళ్ళను చేశారని విమర్శించారు. బి.సిలకు రాజ్యాధికారంలో వాటా ఇవ్వకుండ గొర్రెలు బర్రెలు పందులు పెన్షన్లు ఇచ్చి ఓట్లు వేయించుకొని బి.సిలను శాశ్వత బిచ్చగాళ్ళను చేస్తున్నారని విమర్శించారు. చివరకు కులగణన చేసి బీసీల జనాభా కూడా లెక్కించడానికి ఈ అగ్రకుల ప్రభుత్వాలకు మనసు రావడం లేదు. లెక్కలు తీస్తే రిజర్వేషన్లు పెంచవలసి వస్తుందని భయపడుతున్నారు. ప్రజలకు, కుక్కలకు, ఇతర జంతువులకు లెక్కలు ఉన్నవి కానీ బీసీలు ఎంతమంది ఉన్నారో లెక్కలు లేవన్నారు. బీసీలకు కేంద్రస్థాయిలో ఒక్క స్కీము కూడా లేదు. కాలేజీ కోర్సుల్లో చదివే విద్యార్థులకు ఫీజులు కూడా మంజూరు చేయడం లేదు. భారతదేశం అగ్ర దేశంగా తయారవుతుందని గొప్పలు చెప్పుకుంటున్న నేతలు చదువుకునే పేద పిల్లలకు ఫీజులు కూడా కట్టే స్థితిలో లేదన్నారు. రాజ్యాంగ రచన సమయంలోనే బి.సిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ, సామాజిక రంగాలలో రిజర్వేషన్లు పెడితే ఎంతో ప్రగతి జరిగేది. కులతత్వం కనీస స్థాయికి వచ్చేది. బి.సిలకు ఏయే రంగాలాలో అన్యాయం జరిగిందో చూద్దాం.ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలకు, సామాజిక వర్గాలకు వారి వారి జనాభా ప్రకారం రాజకీయ రంగంలో ప్రాతినిధ్యం కల్పించాలి. కానీ మనదేశంలో 56 శాతం జనాభా కలిగిన బీసీలకు ఇంతవరకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా ఈ కులాలను అణచిపెట్టారు. ప్రపంచంలో అణచివేతకు వివక్షకు గురైన అన్ని వర్గాలకు, అన్ని రంగాలలో వాటా ఇచ్చి ఇతర అభివృద్ధి చెందిన వర్గాలతో సమానంగా అభివృద్ధి చేశారు. కానీ మనదేశంలో పీడిత కులాలను ఇంకా అంది వేయడానికి చూస్తున్నారు తప్ప అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, వార్డు మెంబర్లలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం కు పెంచాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం 50శాతం సీలింగ్ అని చెప్పి పెంచకుండా తప్పించుకోవడానికి వీలులేదు. పార్లమెంటులో బి.సి. బిల్లు ప్రవేశపెట్టి, చట్ట సభల్లో బీసీ లకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని. బి.సి ఉద్యోగులకు ప్రమోషన్లను రిజర్వేషన్లు కల్పించాలి. ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని, కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు బి.సి.ల జనాభా ప్రసాదం 27శాతం నుండి 56 శాతంకు పెంచాలని కోరారు. పంచాయతీరాజ్ సంస్థలో బి.సి. రిజర్వేషన్లను 22 శాతం నుంచి 50 శాతంకు పెంచాలి. రాష్ట్రాలకు 80 మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.కేంద్ర స్థాయిలో 2 లక్షల కోట్ల బడ్జెట్ బి.సి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, జనాభా లెక్కల లో బి.సి. కులాల వాది లెక్కలు సేకరించాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంఘం జాతీయ సంఘం బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ,పల్లగొర్ల మోదీరాందేవ్,వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్, జయంతి, రవి యాదవ్, వుట్టా వీరేష్, గుండెబోయిన సురేష్,వంశీ, జంగయ్య,బాలస్వామి,బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి

● తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తి ● సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ ఖాతాలో ఆశక్తికర పోస్ట్



తెలంగాణ బ్యూరోప్రతినిధిః తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనకు ఏడాది పూర్తన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ ఖాతాలో ఆశక్తికర పోస్ట్ చేశారు. ఏడాది ప్రజాపాలనలో ఎంతో సంతృప్తి సమస్త ప్రజల ఆకాంక్షలు సంపూర్ణంగా నెరవేర్చడమే నా సంప్రాప్తి అని సీఎం తెలిపారు. పోరాటాలను, ఉద్యమాలను, త్యాగాలను ఆత్మబలిదానాలను, ఆకాంక్షలను, ఆశయాలనుఅన్నింటినీ కలిపి వీలునామాగా రాసి డిసెంబర్ 7, 2023 నాడుతెలంగాణ నా చేతుల్లో పెట్టిందని తెలిపారు. తన వారసత్వాన్ని సగర్వంగా సమున్నతంగా ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను అప్పగించిందని ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఆక్షణం నుండి జన సేవకుడిగా ప్రజా సంక్షేమ శ్రామికుడిగా మదిలో, విధిలో, నిర్ణయాల జడిలో సకల జనహితమే పరమావధిగా జాతి ఆత్మగౌరవమే ప్రాధాన్యతగా సహచరుల సహకారంతో జనహితుల ప్రోత్సాహంతోవిమర్శలను సహిస్తూ విద్వేషాలను ఎదురిస్తూస్వేచ్ఛకు రెక్కలు తొడిగి ప్రజాస్వామ్యానికి రెడ్ కార్పెట్ పరిచిఅవనిపై అగ్ర భాగాన తెలంగాణను నిలిపేందుకుగొప్ప లక్ష్యాల వైపు నడుస్తూనాలుగు కోట్ల ఆశయాలను నడిపిస్తూనిరంతరం జ్వలించే ఈ మట్టి చైతన్యమే స్ఫూర్తిగా విరామం ఎరుగక విశ్రాంతి కోరకముందుకు సాగిపోతున్నానని సీఎం తెలిపారు.

# అక్రమ కట్టడాలు వల్లే మున్నేరుకి వరద ముంపు

● అడవులను కొట్టడం వల్లే కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయి ● విద్యార్థులు గంజాయి డ్రగ్స్కు అలవాటు పడకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలి : మంత్రి తుమ్మల



తెలంగాణ బ్యూరోప్రతినిధి: నాలాలు పూడ్చి అక్రమ కట్టడాలు వల్లే మున్నేరు వరద ముంపు గండం ఏర్పడిందని మంత్రి తమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలో మామిళ్ళ గూడెం, సారథి నగర్ కాలనీలను అనుసంధానం చేసే రైల్వే అండర్ మినీ బ్రిడ్జిను మంత్రి తుమ్మల ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నాలాలు పూడ్చి అక్రమ కట్టడాలు వల్లే మున్నేరు వరద ముంపు అని తెలిపారు. అడవులను కొట్టడం వల్లే కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని మంత్రి అన్నారు. ఖమ్మం నగరంలో ట్రాఫిక్ కష్టాలు లేకుండా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగిందన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నపుడు అనుమతి వచ్చిందని, గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నపుడు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రజా పాలన ఏడాదిలో ఆర్యూబీ ప్రారంభోత్సవం చేశామన్నారు. ఖమ్మం నగరంలో విశాలమైన రహదారులు పార్క్ లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 500 ఎకరాలు ఉన్న వెలుగుమట్ల పార్క్ ను ఖమ్మం నగరానికి పర్యాటక ప్రదేశంగా ల్యాండ్ మార్క్ గా అభివృద్ధి చెందేలా చేశామన్నారు. ఖమ్మం చరిత్ర తెలిపే ఖిల్లాపై రోప్ వే ఏర్పాటుతో పర్యాటక అభివృద్ధి చెందిందని తెలిపారు. పెరుగుతున్న అర్బన్ పావులేషన్ కు తగ్గట్టుగా మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. ఖమ్మం నగరం పరిశుభ్రంగా విశాలమైన రహదారులు పచ్చదనంతో ఇతర నగరాలకు ఆదర్శంగా ఉండాలన్నారు. విద్యార్థులు గంజాయి డ్రగ్స్ కు అలవాటు పడకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఖమ్మం విప్లవాలు వురిటిగడ్డ అన్నారు. స్వాతంత్ర సంగ్రామంలో నైజాం రజాకార్లను తరిమి కొట్టిన జిల్లా అని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో నాకు అవకాశం ఇచ్చిన ఖమ్మం ప్రజానీకంకు ధన్యవాదాలు తెలిపారు.

# అభివృద్ధి కార్యక్రమాల పుస్తకం ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలు వెలువడిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదవూర్వకంగా కలిసి, ముఖ్యమంత్రి ఆశీస్సులు తీసుకొని పలు జిల్లాల నుండి గెలుపొందిన అభ్యర్థుల ను రాష్ట్ర నూతన కమిటీని ముఖ్యమంత్రి కి జక్కిడి శివ చరణ్ రెడ్డి నీ పరిచయం చేశారు. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజారిటీని నమోదు చేసుకున్న జక్కిడి శివ చరణ్ రెడ్డి ని అభినందించి శాలువాతో సన్మానించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం పూర్తయిన సందర్భంగా ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి, ఆరు గ్యారెంటీ హామీల అమలుపై జక్కిడి శివ చరణ్ రెడ్డి ప్రచురించిన ప్రజా పాలన వుస్తకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.

# బధిరుల హాస్టల్లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ప్రజాపాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా దివ్యాంగులతో సమయాన్ని వెచ్చించడం ఆనందంగా ఉందనీ మంత్రి సీతక్క అన్నారు. అవయవ లోపాలు ఉన్నంత మాత్రాన దివ్యాంగులు అనడం సరికాదనీ, వారు దివ్యాంగులు కాదు విభిన్న ప్రతిభావంతులు అని అన్నారు.

సరూర్నగర్, మాసబ్ ట్యాంక్ లోని అంద హాస్టల్లో ఉండి చదువుకున్నవాళ్లు 16 మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. వారి స్ఫూర్తిగా ఇతర దివ్యాంగులు ఏదో ఒక రంగంలో ముందంజలో నిలవాలనీ, దివ్యాంగుల సమస్యలు విని వాటి పరిష్కరిస్తామని భరోసా కల్పించాం అని స్పష్టం చేశారు.బధిరులకు తగిన సంఖ్యలో ఇంటర్ కాలేజీలను త్వరలో ప్రారంభిస్తాం అని అన్నారు. ఆఫీసుల చుట్టూ తిరగకుండా చేయుత పెన్షన్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో వేసేలాగా చర్యలు తీసుకుంటాం, ప్రజా ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దివ్యాంగులతో టైం స్పెండ్ చేయడం ఆనందంగా ఉందన్నారు.

వికలాంగుల పెన్షన్ల పెంపు, ఇతర పెండింగ్ సమస్యలను త్వరలో పరిష్కరించనున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్. వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

సూర్య
హైదరాబాద్
ఆదివారం
8 డిసెంబర్ 2024



cinema@suryaa.com

సూర్య సినిమా

# ది గర్ల్ ఫ్రెండ్ టీజర్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ నెల 9వ తేదీన టీజర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వైవిధ్యమైన ప్రేమకథగా తెరకెక్కుతున్న "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా ప్రస్తుతం చివరి దశ షూటింగ్ లో ఉంది.

# డింకర్ సాయి లిరికల్ సాంగ్



ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 27న ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "డ్రింకర్ సాయి" సినిమా నుంచి 'నేల మీది నక్షత్రమా..' లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. 'నేల మీది నక్షత్రమా..' లిరికల్ సాంగ్ ను శ్రీ వసంత్ ఆకట్టుకునేలా కంపోజ్ చేయగా, చంద్రబోస్ అందమైన సాహిత్యం అందించారు. అనుదీప్ దేవ్ మంచి ఫీల్ తో పాడారు. ఈ పాట ఎలా ఉందో చూస్తే - 'నేల మీది నక్షత్రమా నేల మీది నక్షత్రమా నేల మీది నక్షత్రమా ఆకాశమంత చిలిపితనం అంతరిక్షమంత పసితనం మేఘమాల లాంటి పడుచుతనం మధ్యలోనే ఉరిమే గడుసుతనం నేల మీది నక్షత్రమా నేల మీది నక్షత్రమా నేల మీది నక్షత్రమా...' అంటూ బ్యూటిఫుల్ మెలోడీ గా ఆకట్టుకుంటుందీ పాట.

# క్యారెక్టర్ బేస్డ్ 'బచ్చల మల్లి' : డైరెక్టర్ సుబ్బు మంగాదేవి

హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన బ్లాక్ బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇప్పటికే విడుదలైె టీజర్, పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. బచ్చల మల్లి డిసెంబర్ 20న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుబ్బు మంగాదేవి విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు.



*'బచ్చల మల్లి' ప్రాజెక్ట్ ఎలా స్టార్ట్ అయ్యింది ?*

-నిర్మాత రాజేష్ నాకు ముందు నుంచి ఫ్రెండ్. రాజేష్ కి ముందుగా ఈ కథ చెప్పాను. ఆయనకి నచ్చింది. తర్వాత నరేష్ కి చెప్పమన్నారు. నరేష్ సింగిల్ సిట్టింగ్ లోనే ఒకే చేశారు. కథ విన్న వెంటనే సినిమా చేసేద్దామని చెప్పారు.

*హీరో క్యారెక్టర్ ఎలా వుంటుంది ?*

-మూర?త్వం బోర్డర్ దాటేసిన క్యారెక్టర్. అందరిలో మూరు?డు వుంటారు. కానీ అతనిలో ఈ మోతాదు ఎక్కువ. అది ఎంత ఎక్కువ అనేది ఎస్టాబ్లిష్ చేయడానికి టీజర్ లో పిల్లల చందాల బాక్సు కూడా ఎత్తుకెళ్ళే సీన్ చూపించాం. అలా ఎత్తుకెళ్ళి ఏం చేశాడనేది సినిమాలో చూసినప్పుడు చాలా హై ఇస్తుంది.

***ఇందులో బచ్చల మల్లి క్యారెక్టర్ గెటప్, లుక్ కి పుష్పతో పోలిక కనిపించింది కదా?***

ఈ పోలిక రావడానికి కారణం వుంది. పుష్ప పార్ట్ 1 హీరోది కూలీ క్యారెక్టర్. బచ్చల మల్లి ట్రాక్టర్ డ్రైవర్. వీళ్ళంతా దాదాపుగా ఒకే ఛాయలో వుంటారు. సాఫ్ట్ వేర్ అనగానే డీసెంట్ గెటప్, లుక్ వుంటుంది. అలాగే ఊర్లో పొలం పనులు పనిచేసేవాళ్ళు దాదాపు ఒకేలా వుంటారు. అలా గెటప్ విషయంలో కంపారిజన్ వచ్చింది తప్పా మరొకటి కాదు.

*ఇది నిజజీవిత కథ ఆధారంగా రాసుకున్నారా?*

లేదండి. బచ్చల మల్లి అనే క్యారెక్టర్ వున్న మాట వాస్తవమే. చిన్నప్పుడు ఆ క్యారెక్టర్ గురించి వినేవాళ్ళం. ఊరు గురించి నిలబడిన హీరోయిక్ క్యారెక్టర్. ఆ క్యారెక్టర్ వైబ్ తో కేవలం టైటిల్ మాత్రమే పెట్టాం తప్పా ఇది ఆయన కథ కాదు.

*90 నేపథ్యం తీసుకోవడానికి కారణం ?*

-కథని ఎమోషనల్ గా చెప్పాలని అనుకున్నాం. అలాగే ఇందులో ఒక మంచి ప్రేమ కథ వుంది. ఇప్పుడు ప్రేమకథ చెప్పాలంటే వేరే జోన్ లో చెప్పాలి. ఇప్పుడు మనుషులతో నేరుగా మాట్లాడటమే తగ్గిపోయింది. సోషల్ మీడియాలోనే మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఎమోషనల్ లవ్ స్టోరీలు తగ్గిపోయాయి. పైగా నేను 90లోనే ఊర్లో పెరిగాను. అప్పటి మనుషులు ఎలా ప్రవర్తించేవారు నాకు తెలుసు. అందుకే కథని ఆ జోన్ లో చెప్పాలని అనుకున్నాను.

# ఎన్టీఆర్ టు విజయ్.. సినీతారల రాజకీయం

సినీ రంగంలో ఓ వెలుగు వెలిగిన, వెలుగుతున్న నటులు రాజకీయాల్లోకి రావడం పరంపరగా కొనసాగుతోంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో చిత్ర పరిశ్రమ నుంచి తారలు పొలిటికల్ ఎంట్రీ ఇస్తూ.. రియల్ లైఫ్ లోనూ నాయకులు కావాలని









ప్రయత్నిస్తున్నారు. కథానాయకులు మాత్రమే కాదని ప్రజా నాయకులు గాను రాణించాలని తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

తెరమీది పాత్రలే కాకుండా తెరనుంచి బయటకు వచ్చి రాజకీయ రణ రంగంలో ప్రత్యక్షపాత్రలు పోషించాలని సంసిద్ధమవుతున్నారు. అయితే, అనుకున్నంత ఆదరణ పొందలేక రాజకీయాల నుంచి తప్పుకున్న వారూ ఉన్నారు. దక్షిణ భారతంలో కొంతమే రకు రాజకీయాల్లో సినీతారలు ఎక్కువ విజయాలు సాధించారు. ఉత్తర భారత నటులు కూడా విజయాలు పొందారు. కానీ ఆశించినంత కాదు.

అమితాబ్ బచ్చన్, చిరంజీవి, విజయకాంత్, ఆర్. శరత్ కుమార్, శివాజీ గణేషన్ మొదలైనవారున్నారు. అమితాబచ్చన్ 1984లో కాంగ్రెస్ పార్టీ నుంచి నాటి ముఖ్యమంత్రి డి.ఎన్. బహుగుణ మీద పోటీచేశారు. 3 లక్షల ఓట్ల మెజారిటీతో లోక్ సభకు సభ్యుడిగా ఎన్నికయ్యారు. కానీ తదనంతర కాలంలో ప్రత్యక్ష రాజకీయాల్లో ఇమడలేక తప్పుకున్నారు. తన ఏబీసీ కంపెనీ నష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకున్న ఎస్పీకి మద్దతిచ్చారు. అందుకు బహుమానంగా ఎస్పీ.. జయాబచ్చన్ ను రాజ్యసభకు పంపింది. 2009లో చిరంజీవి ప్రజారాజ్యం పేరిట పార్టీ పెట్టారు. 'మార్పు' అనే నినాదమిచ్చారు. కానీ ఎన్నికల తరువాత తన విధానాలు మార్చుకున్నారు. పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు. 81 లక్షల ఓట్లు, 18 శాసనసభ స్థానాలు ఇచ్చిన ప్రజాతీర్పును పక్కన పెట్టి.. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుని కేంద్ర సహాయమంత్రి పదవి పొందారు. విజయకాంత్ కెప్టెన్ ప్రభాకరన్, రమణ వంటివారు సామాజిక చిత్రాలతో ప్రజల ఆదరాభిమా నాలు పొందారు. ప్రజల అభివృద్ధి పేరుతో డీఎండీకే పార్టీని స్థాపించారు. కాని ఆశించిన ఫలితాలు, స్థానాలు గెలువలేదు. ప్రతిపక్షపాత్ర పోషించారు. ఆర్.శరత్ కుమార్ ఏఐఎస్ఎంకే పార్టీ స్థాపించి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. కానీ తదనంతర కాలంలో మళ్లీ తెరమీద (సినిమా)కే పరి మితమయ్యారు. శివాజీ గణేషన్ 1987లో టీఎం.ఎం పేరుతో పార్టీని స్థాపించాడు. కానీ పార్టీని విజయతీరాల వైపునకు నడిపించలేకపోయారు. ఎం.జి.రామచంద్రన్, ఎన్టీఆర్, శత్రుఘ్న సిన్హా వంటి వారు కూడా కొంతమేరకు విజయం సాధించారు.

ఎన్టీరామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీ స్థాపించిన సమయానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పరిస్థితి ఎలా ఉన్నది? కీలుబొమ్మల ముఖ్యమంత్రుల ప్రభుత్వం నడుస్తున్నది. దాని పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉన్నది. దానిని గమనించిన ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాడు. పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చాడు. ప్రస్తుతం ప్రముఖ నటుడు పవన్ కళ్యాణ్ 14 మార్చి 2014న జనసేన పార్టీ స్థాపించారు. పార్టీ పెట్టిన 10 ఎండ్లకు 100% స్ట్రైక్ రేట్ తో పోటీ చేసిన అన్ని అసెంబ్లీ పార్లమెంటు స్థానాల్లో ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. ఏపీ డిప్యూటీ సీఎం గా బాధ్యతలు స్వీకరించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. దాదాపు పవన్ కళ్యాణ్ స్థాయి ఫాలోయింగ్ ఇమేజ్ ఉన్న మరో ప్రముఖ నటుడు దళపతి విజయ్ తమిళనాడు రాజకీయాల్లో అడుగు పెట్టారు. తమిళ వెట్రి కలగం పార్టీ స్థాపించి రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగబోతున్నారు. ఈ నేపథ్యంలో విజయ్ మరో పవన్ కళ్యాణ్ లా రాజకీయాల్లో సక్సెస్ అవుతారా? అనే చర్చ జరుగుతున్నది.

అయితే తమిళ రాజ కీయాల్లో ఉన్న ద్రవిడ సిద్ధాంత నేపథ్యంలో పెరియార్, కరుణానిధి, ఎంజీఆర్ లను తాను ఆరాధిస్తానని, సైద్ధాంతికంగా కేంద్రంలోని బిజెపిని, డీఎంకేను వ్యతిరేకిస్తానని విజయ్ ప్రకటించారు. అయితే తమిళనాడులోని 234 అసెంబ్లీ సీట్లలో విజయ్ పార్టీ అన్నింటా పోటీ చేస్తుందా. మిత్రపక్షాలతో కలిసి ఏమైనా పొత్తులు పెట్టుకునే అవకాశాలు ఉన్నాయా? వంటి ప్రశ్నలకు సమీప భవిష్యత్తులో సమాధానాలు దొరికే అవకాశాలు ఉన్నాయి. ఏది ఏమైనా అప్పటికి తమ పొలిటికల్ జర్నీని సినిమా రంగంలో కెరీర్ పీక్స్ ఉన్న సమయంలో నటులు ప్రారంభించడానికి చూస్తే తాము సమాజానికి తిరిగి సేవ చేయాలనే సదుద్దేశమైతే కనిపిస్తోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషి స్తున్నారు.

- కె.బాపురావు,
జర్నలిస్టు,
సెల్: 95533 07006



# "ఫియర్" ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది - డైరెక్టర్ డా. హరిత గోగినేని



హీరోయిన్ వేదిక లీడ్ రోల్ లో నటిస్తున్న సినిమా "ఫియర్". ఈ సినిమాను దత్తాత్రేయ మీడియా బ్యానర్ పై ప్రొడ్యూసర్స్ డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మిస్తున్నారు. సుజాత రెడ్డి కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్ కథతో దర్శకురాలు డా. హరిత గోగినేని ఫియర్ మూవీని రూపొందిస్తున్నారు. అరవింద్ కృష్ణ ఓ స్పెషల్ రోల్ లో కనిపించనున్నారు. "ఫియర్" సినిమా విడుదలకు ముందే వివిధ అంతర్జాతీయ ప్రతిష్టాత్మక ఫిలిం ఫెస్టివల్స్ లో 70 కి పైగా అవార్డ్స్ లను గెల్చుకుని కొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సినిమా ఈ నెల 14న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో "ఫియర్" మూవీ హైలైట్స్ లేటెస్ట్ ఇంటర్వ్యూలో తెలిపారు డైరెక్టర్ డా. హరిత గోగినేని

- నాకు సినిమాలంటే ఇష్టం. చిన్నప్పటి నుంచి ఎన్నో సినిమాలు చూస్తూ పెరిగాను. బుక్స్ చదివే అలవాటు ఉంది. కొన్ని కథలు రాసుకున్నాను. క్రమంగా డైరెక్షన్ మీద ఇంట్రెస్ట్ ఏర్పడింది. మూడేళ్ల క్రితం "ఫియర్" సినిమా ఆలోచన మొదలైంది. అయితే అప్పుడు లక్కీ లక్ష్మణ్ ప్రాజెక్ట్ కూడా చేస్తున్నాం. అది కంప్లీట్ అయ్యాక పూర్తిగా ఈ సినిమా మీదే దృష్టి పెట్టాం.

- వేదిక కంటే ముందు మరికొందరు హీరోయిన్స్ ను అప్రోచ్ అయ్యాం. అయితే వాళ్ల డేట్స్ కోసం ఏడాది పాటు ఆగాలని చెప్పారు. అంత టైమ్ వెయిట్ చేయడం ఇష్టం లేక కొన్నిఆప్షన్స్ చూశాం. వేదిక ముని, కాంచన 3 వంటి మూవీస్ లో బాగా నటించింది. మా సబ్జెక్ట్ కు కూడా చాలా యాప్ట్ అనుకుని ఆమెను సంప్రదించాం. కథ విన్న తర్వాత వేదిక కూడా వెంటనే ఒకే చెప్పింది. నేను అనుకున్న కథలో వేదికను ఊహించుకుంటే ఆమె పర్ఫెక్ట్ అనిపించింది.

# ఎర్రచీర - 27న రిలీజ్



బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాయల ఎంటర్టైన్మెంట్స్ -శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం "ఎర్రచీర - ది బిగినింగ్". ఈ సినిమాలో నటుడు రాజేంద్రప్రసాద్ ముద్దుల మనవరాలు బేబీ సాయి తేజస్విని నటిస్తోంది. "ఎర్రచీర - ది బిగినింగ్" మూవీకి సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్ర పోషించారు. మదర్ సెంటిమెంట్, హార్రర్, యాక్షన్ కథతో ఈ సినిమా తెరకెక్కింది. ఈ నెల 27న "ఎర్రచీర - ది బిగినింగ్" గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. శనివారం ఉదయం సినిమా ట్రైలర్ ను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా రిలీజ్ చేశారు. ప్రముఖ నిర్మాత సి. కల్యాణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ కారుణ్య చౌదరి మాట్లాడుతూలి - "ఎర్రచీర - ది బిగినింగ్" సినిమా ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాను. నేను కూడా మీతో పాటు ట్రైలర్ చూశాను. నేను ట్రైలర్ లో మిమ్మల్ని భయపెట్టానని అనుకుంటున్నా. సుమన్ గారు ఎంతో ఎఫర్ట్స్ పెట్టి ఈ మూవీ చేశారు. అది స్క్రీన్ మీద కనిపిస్తోంది. ఈ నెల 27న థియేటర్స్ లోకి వస్తున్నాం. మీరంతా చూసి బ్లెస్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

లిచిత్ర దర్శక నిర్మాత, నటుడు సుమన్ బాబు మాట్లాడుతూలి - మా "ఎర్రచీర - ది బిగినింగ్" మూవీకి మొదటి నుంచి ఎంతోమంది పెద్దలు సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. హీరో వెంకటేష్ గారి దగ్గర నుంచి ఈరోజు కల్యాణ్ అన్న వరకు మా మూవీకి సపోర్ట్ చేస్తున్నారు. వాళ్లందరికీ చాలా థ్యాంక్స్ చెబుతున్నా. ఈ రోజు మీ అందరి సమక్షంలో "ఎర్రచీర - ది బిగినింగ్" థియేట్రికల్ ట్రైలర్ రిలీజ్ చేసుకోవడం సంతోషంగా ఉంది.

బేబి సాయి తేజస్వినీ మా చిత్రంలో అద్భుతంగా నటించింది. అలాగే కారుణ్య ఒక సీన్ కోసం 2 రోజులు పట్టుదలగా వర్క్ చేసింది. మా సినిమాకు చాలా మంది పెద్ద ఆర్టిస్టులు వర్క్ చేశారు వారంతా సపోర్ట్ చేస్తున్నారు కానీ ఒక్క కమల్ కామరాజు అనే యాక్టర్ మాత్రం మా ఫోన్స్ ఆన్సర్ చేయడం లేదు. ఆయన ఒక హీరో ఈ మూవీలో అయి ఉండి కూడా మాకు ప్రమోషన్ కు రావడం లేదు. ఎంతో కష్టపడి మాలాంటి వాళ్లం మూవీ చేస్తే కనీసం ప్రమోషన్ కు రాకపోవడం బాధా కరం. ఈ నెల 24న ప్రీ రిలీజ్ ఈవెంట్ చేయబోతున్నాం. 27న మూవీని రిలీజ్ చేస్తాం. ప్రేక్షకులకు మా మూవీ కోసం ఒక కాంటెస్ట్ పెడుతున్నాం. ఫ్యామిలీ ప్యాక్ బిర్యానీ 45 నిమిషాల్లో తిన్న ప్రేక్షకుడికి పది వేల రూపాయలు బహుమతి ఇస్తాం. అన్నారు. దాదాపు 300 థియేటర్స్ లో మా సినిమాను గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నాం. మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

# "జిన్" ప్రారంభం,

అమిత్ రావ్ హీరోగా నటిస్తున్న సస్పెన్స్ హారర్ థ్రిల్లర్ మూవీ "జిన్". ఈ చిత్రాన్ని సాదలమ్మ ఫిల్మ్ ప్రొడక్షన్స్, బిల్వ స్టూడియోస్ బ్యానర్స్ పై నిఖిల్ ఎమ్ గౌడ నిర్మిస్తున్నారు. వరదరాజ్ చిక్కబళ్లాపుర డైలాగ్స్ అందిస్తూ కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. చిన్మయ్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఇతర ముఖ్య పాత్రలను పర్వీజ్ సింబా, ప్రకాష్ తుంబినాడు, రవి భట్, సంగీత, బాల్రాజ్ వాడి పోషిస్తున్నారు. ఈ రోజు హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో పూజా కార్యక్రమాలతో జిన్ సినిమా లాంఛనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇవ్వగా ..._ పముఖ గీత రచయిత రామ జోగయ్య శాస్త్రి కెమెరా స్విచ్చాన్ చేశారు. రాజ్ కందుకూరి, రామజోగయ్య శాస్త్రి స్క్రిప్ట్ ను అందచేశారు. ఈ సందర్భంగా నిర్మాత నిఖిల్ ఎమ్ గౌడ మాట్లాడుతూ - జిన్ సినిమాను తెలుగు, కన్నడ బైలింగ్వల్ ప్రాజెక్ట్ గా నిర్మిస్తున్నాం. వచ్చే వారం నుంచి ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. మీ అందరి సపోర్ట్ ఉంటుందని ఆశిస్తున్నాం.



డైరెక్టర్ చిన్మయ్ రామ్ మాట్లాడుతూ - జిన్ సినిమా డైరెక్టర్ గా నాకు ఫస్ట్ మూవీ. నా స్నేహితుడు పర్వీజ్ తో కలిసి స్క్రిప్ట్ రెడీ చేశాను. ఇదొక మంచి కథ. స్క్రిప్ట్ పర్ఫెక్ట్ గా వచ్చేందుకు చాలా టైమ్ తీసుకున్నాం. ఇక్కడే హైదారాబాద్ లో ఫస్ట్ షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం. నాకు ఈ అవకాశం ఇచ్చిన ప్రొడ్యూసర్, నాకు సపోర్ట్ చేస్తున్న టీమ్ అందరికీ థ్యాంక్స్. మీ సహకారం మా టీమ్ కు ఉంటుందని ఆశిస్తున్నాం. అన్నారు.

హీరో అమిత్ రావ్ మాట్లాడుతూ - ఈ రోజు మా జిన్ మూవీ లాంఛ్ కు గెస్ట్ లుగా వచ్చిన రామజోగయ్య గారికి, రాజ్ కందుకూరి గారికి థ్యాంక్స్. జిన్ సినిమా స్క్రీన్ ప్లే కాంప్లికేటెడ్ గా ఉంటుంది. మంచి విజువల్స్ తో సినిమా చేయబోతున్నాం. డైరెక్టర్ చిన్మయ్ రామ్ గారి మీద మాకు బాగా నమ్మకం ఉంది. ఇలాంటి ఒక మంచి స్క్రిప్ట్ తో హీరోగా మీ ముందుకు వస్తుండటం సంతోషంగా ఉంది. అన్నారు.

# యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్



హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు జరగనున్న యూరో పియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ శుక్రవారం సాయంత్రం ప్రారంభమైంది. హైదరాబాద్ లోని ప్రసాద్ లాబ్స్ ప్రివ్యూ థియేటర్ లో ఈ నెల 15వ తేదీ వరకు ఈ ఫెస్టివల్ ను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా యూరప్ లోని 24 దేశాలకు చెందిన 24 అవార్డు చిత్రాలను షెడ్యూల్ ప్రకారం ప్రదర్శిస్తారు. ఫ్రెంచ్ చిత్రం జిమ్స్ స్టోరీని ప్రారంభ చిత్రంగా ప్రదర్శించారు. కాగా ఫెస్టివల్ ప్రారంభోత్సవానికి సినీరంగంతో పాటు పలువురు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఫిలిం క్లబ్ అధ్యక్షుడు కె.వి.రావు మాట్లాదుతూ, హైదరాబాద్ నగర ప్రజలకు దేశ, విదేశ అత్యుత్తమ చిత్రాలను సదాశయంతో 50 సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ క్లబ్ ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తూనే ఉన్నదని అన్నారు. శ్రీ సారథీ స్టూడియోస్ సుదీర్ఘమైన సహకారం అందించడం వల్లనే క్లబ్ మనుగడ సాధ్యమైందని చెప్పారు. 29వ యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ న్యూఢిల్లీ, కోల్ కటా తర్వాత హైదరాబాద్ లోనే జరుగుతుండటం, దానిని మా క్లబ్ నిర్వహిస్తుండటం ఓ విశేషమని అన్నారు. హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ సెక్రటరీ ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, మనదేశంలో పేరున్న అతి కొద్ది ప్రైవేట్ ఫిల్మ్ సొసైటీలలో, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ ఒకటని అన్నారు. తాము చేసిన అనేక ఫెస్టివల్స్ సినీ ప్రియులను ఎంతగానో అలరించాయని, కొన్ని గొప్ప మైలు రాళ్లు కూడా తమ క్లబ్ సొంతమని అన్నారు. తమ ప్రయాణం ఇలానే కొనసాగుతుందని అన్నారు.

**PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD**, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **PRINTED AT SPR PRINTING PRESS,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, **TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD,** SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. **EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232** RNI Registration No. **APTEL/2007/22044**